


# పెన్ పవర్

తెలుగు దిన పత్రిక

ప్రశ్నించడం మన హక్కు





సంపుటి : 1 సంచిక : 317 పేజీలు :8 సంపాదకులు : జి.ఎ.రావు ( ఆనంద్ గంట్యాడ) ప్రచురణ : ఒంగోలు ఆదివారం 19 జూలై 2026 వెల : 1/-రూ ॥

VOLUME :1 ISSUE :317 PAGES :8 EDITOR : G. A. RAO ( ANAND GANTYADA ) PUBLISHED : ONGOLE SUN 19 JULY 2026 PRICE : 1/- RS

Simultaneously Published form Ongole,Visakhapatnam,Kakinada,Bapatla,Narasarao Peta, YSR Kadapa,Circulated by :Srikakulam,manyam,Vizianagaram,East Godavari,West Godavari,Eluru,Guntur,SPSR Nellore,Tirupati,Chittor,Kurnool,Anantapur


## ముందు ఎన్సీపీ విలీనం.. తర్వాత ఎన్డీయేలోకి.. మహారాష్ట్రలో బీజేపీ మాస్టర్ ప్లాన్!

- ఎన్సీపీ విలీనంపై జోరుగా చర్చలు
- ముందు విలీనం.. తర్వాత ఎన్డీయే ఫార్ములా
- 15 రోజుల్లో తుది ప్రకటనకు అవకాశం
- విలీనం లేకపోతే ప్రత్యేకంగానే ఎన్డీయేలో చేరే ఛాన్స్
- అధ్యక్ష పదవిపై సునేత్రా పవార్ పట్టు



పెన్ పవర్ డెస్క్:మహారాష్ట్ర రాజకీయాల్లో మరో కీలక పరిణామం చోటుచేసుకునే సూచనలు కనిపిస్తున్నాయి. శరద్ పవార్ నేతృత్వంలోని ఎన్సీపీ (ఎస్పీ) ఎన్డీయేలో చేరే అవకాశాలపై చర్చలు జరుగుతున్న వేళ.. ముందుగా ఎన్సీపీ రెండు వర్గాలు విలీనం కావాలనే

- మిగతా 2లో

## రాష్ట్రంలో గుడిసెలు లేకుండా చేస్తాం

- ప్రతి పేద కుటుంబానికి పక్కా ఇల్లు అందిస్తామన్న కోమటిరెడ్డి
- ప్రజా సంక్షేమమే లక్ష్యంగా పాలన సాగుతోందని వ్యాఖ్య
- పేదలకు సన్న బియ్యం పంపిణీ చేస్తున్నామన్న మంత్రి



పెన్ పవర్ డెస్క్:తెలంగాణ రాష్ట్రంలో గుడిసెలు అనేవే లేకుండా చేస్తామని, అర్హులైన ప్రతి నిరుపేద కుటుంబానికి సొంత పక్కా ఇల్లు అందిస్తామని మంత్రి కోమటిరెడ్డి వెంకటరెడ్డి స్పష్టం చేశారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి నాయకత్వంలో ప్రజా సంక్షేమమే ధ్యేయంగా పాలన సాగుతోందని ఆయన కొనియాడారు. వికారాబాద్ జిల్లా పరిగి నియోజకవర్గంలో రూ. 184.15 కోట్ల భారీ వ్యయంతో చేపట్టనున్న

- మిగతా 2లో




- స్కైరూట్ ఏరోస్పేస్ 'విక్రమ్-1' రాకెట్ ప్రయోగం విజయవంతం
- భారత్ తొలి ప్రైవేట్ ఆర్బిటాల్ రాకెట్‌గా రికార్డు సృష్టి
- శ్రీహరికోట నుంచి నింగిలోకి దూసుకెళ్లిన రాకెట్
- 'ఆగమన్' పేరుతో చేపట్టిన ఈ ప్రయోగం చారిత్రాత్మకం
- ప్రధాని సందేశంతో పాటు పలు పేలోడ్లను కక్ష్యలోకి మోసుకెళ్లిన 'విక్రమ్-1'

భారత అంతరిక్ష రంగంలో ఒక చారిత్రక ఘట్టం ఆవిష్కృతమైంది. దేశీయ ప్రైవేట్ స్పేస్ సంస్థ స్కైరూట్ ఏరోస్పేస్, పూర్తిగా స్వదేశీ పరిజ్ఞానంతో అభివృద్ధి చేసిన 'విక్రమ్-1' ఆర్బిటాల్ రాకెట్‌ను విజయవంతంగా ప్రయోగించింది. శ్రీహరికోటలోని సతీశ్ ధావన్ స్పేస్ సెంటర్ (షార్) నుంచి ఈ రాకెట్ నింగిలోకి దూసుకెళ్లింది. ఈ ప్రయోగం విజయవంతం కావడంతో వాణిజ్యపరంగా సొంతంగా ఆర్బిటాల్ రాకెట్లను అభివృద్ధి చేసి, ప్రయోగించిన అతికొన్ని దేశాల సరసన భారత్ నిలిచింది.

- మిగతా 2లో

**'మిషన్ ఆగమన్'**

భారత్ తొలి ప్రైవేట్ అంతరిక్ష ప్రయాణానికి రాకెట్ నాంది పలికింది. నాలుగు దశలు అనుకున్నట్టుగా పనిచేసి, తొలి ప్రయోగంలోనే ఉపగ్రహాలను కక్ష్యలో విజయవంతంగా ప్రవేశపెట్టింది. ఈ విజయం భవిష్యత్ ప్రైవేట్ అంతరిక్ష ప్రయోగాలకు ఒక కొత్త మైలురాయిగా నిలిచింది.

**స్కైరూట్ ఏరోస్పేస్ ప్రయాణం**

- ఇస్రో మాజీ శాస్త్రవేత్తలైన పవన్ కుమార్ చందన, నాగ భరత్ డాకా 2018లో సంస్థను స్థాపించారు.
- లక్ష్యం: చిన్న ఉపగ్రహాలకు తక్కువ ఖర్చుతో, నమ్మకమైన ప్రయోగ సేవలు అందించడం.
- 2022లో 'విక్రమ్-ఎస్' సబ్-ఆర్బిటల్ రాకెట్‌ను ప్రయోగించి తొలి భారతీయ ప్రైవేట్ సంస్థగా చరిత్ర సృష్టించింది.

ఈ విజయం భారత అంతరిక్ష యానంలో ప్రైవేట్ రంగానికి కొత్త శకం!

# 2024లో రాజకీయ చెత్తను ప్రజలే శుభ్రం చేశారు

- రాష్ట్రవ్యాప్తంగా రూ.15,274 కోట్ల పట్టణాభివృద్ధి పనులకు గుడివాడ నుంచి శ్రీకారం
- బూతులు తిట్టిన వారి నోళ్లను ప్రజలు తమ ఓట్లతో కడిగేశారన్న చంద్రబాబు
- అక్టోబర్ 2 నాటికి ఏపీని చెత్త రహిత రాష్ట్రంగా తీర్చిదిద్దుతామని ప్రకటన
- భావ ప్రకటనా స్వేచ్ఛ పేరుతో అసభ్య పోస్టులను సహించేది లేదని హెచ్చరిక
- ఈ నెల 22 నుంచి "తల్లికి వందనం" కింద తల్లుల ఖాతాల్లో నిధులు జమ



పెన్ పవర్ డెస్క్:పరిశుభ్రమైన, సంపన్నమైన ఆంధ్రప్రదేశ్ నిర్మాణమే లక్ష్యంగా స్వచ్ఛాంధ్ర-స్వర్ణాంధ్ర కార్యక్రమాన్ని అమలు చేస్తున్నామని, 2024 ఎన్నికల్లో రాష్ట్రంలోని రాజకీయ చెత్తను ప్రజలే శుభ్రం చేశారని ముఖ్యమంత్రి చంద్రబాబు అన్నారు. బూతులు తిట్టిన వారి నోళ్లను ప్రజలు తమ ఓట్లతో కడిగేశారని ఘాటుగా వ్యాఖ్యానించారు. కృష్ణా జిల్లా గుడివాడలో శనివారం జరిగిన 18వ స్వచ్ఛాంధ్ర-స్వర్ణాంధ్ర కార్యక్రమంలో ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా రాష్ట్రంలోని 120 పట్టణ స్థానిక సంస్థల పరిధిలో రూ. 15,274 కోట్ల విలువైన ప్రజారోగ్య, మున్సిపల్ ఇంజినీరింగ్ పనులకు ఆయన శంకుస్థాపనలు చేశారు. అక్టోబర్ 2వ తేదీ నాటికి రాష్ట్రాన్ని కాలుష్య రహిత, చెత్త రహిత ప్రాంతంగా తీర్చిదిద్దడమే తమ ప్రభుత్వ లక్ష్యమని స్పష్టం చేశారు.

స్వచ్ఛ రాజకీయాల కోసమే ఎన్టీఆర్ పార్టీ స్థాపన

దివంగత ఎన్టీఆర్ తొలిసారి ప్రజాక్షేత్రంలో నిలిచిన గుడివాడ నుంచే స్వచ్ఛ రాజకీయాలకు పునాది పడిందని చంద్రబాబు గుర్తుచేశారు. స్వచ్ఛమైన రాజకీయాలు, స్వచ్ఛమైన ప్రజాప్రతినిధులు, తెలుగువారి ఆత్మగౌరవం అనే లక్ష్యాలతోనే ఎన్టీఆర్ తెలుగుదేశం పార్టీని స్థాపించారని తెలిపారు. గతంలో ఉన్న స్వార్థ రాజకీయాలను పక్కనపెట్టి అభివృద్ధి, సంక్షేమానికి ఆయన శ్రీకారం చుట్టారని అన్నారు. ప్రస్తుతం తమ ప్రభుత్వం అర్హులందరికీ సంక్షేమం, రాష్ట్రాభివృద్ధి, సంపద సృష్టి లక్ష్యంగా పనిచేస్తోందని చెప్పారు. శాంతిభద్రతల పరిరక్షణ, ప్రజల జీవన ప్రమాణాల మెరుగుదలకు కట్టుబడి ఉన్నామని హామీ ఇచ్చారు. పరిశుభ్రత అంటే కేవలం రోడ్లు ఊడ్చడం కాదని, పర్యావరణాన్ని, ప్రజారోగ్యాన్ని కాపాడటమే అసలు లక్ష్యమని వివరించారు.

- మిగతా 2లో



## ఆగస్టు 1న చరిత్రలో నిలిచిపోయేలా భోగాపురం ఎయిర్ పోర్టు ప్రారంభోత్సవం

- భోగాపురం ఎయిర్‌పోర్టు ప్రారంభోత్సవానికి ముహూర్తం ఖరారు
- ప్రధాని నరేంద్ర మోదీ చేతుల మీదుగా ప్రారంభోత్సవం
- ఉత్తరాంధ్ర అభివృద్ధికి ఇది మైలురాయి అని సీఎం చంద్రబాబు వ్యాఖ్య
- జీఎంఆర్ నిర్మించిన ఈ ప్రాజెక్ట్ తొలిదశ వ్యయం రూ. 4,592 కోట్లు
- తొలిదశలో ఏటా 63 లక్షల మంది ప్రయాణికులకు సేవలు

- మిగతా 2లో



## ధర్మేంద్ర ప్రధాన్ కాదు.. మోడీ రాజీనామా చేయాలి

### కాక్రోచ్ పార్టీ కొత్త డిమాండ్

పెన్ పవర్ డెస్క్: నీట్ పేపర్ లీక్, విద్యా వ్యవస్థలోని అక్రమాలకు నిరసనగా ప్రముఖ పర్యావరణ, విద్యావేత్త సోనమ్ వాంగ్ చుక్ చేపట్టిన ఆమరణ నిరాహార దీక్షను పోలీసులు భగ్నం చేయడంపై కాక్రోచ్ జనతా పార్టీ ఆగ్రహం వ్యక్తం చేసింది. సోనమ్ వాంగ్‌చుక్ దీక్ష భగ్నం చేసినా మా ఉద్యమం ఆగదని కేంద్ర ప్రభుత్వాన్ని హెచ్చరించింది. సోనమ్ స్థానంలో మేం ఇక్కడే ఉంటాం.. ఇక్కడే మా పోరాటం కొనసాగిస్తామని స్పష్టం చేసింది. ముందుగా చెప్పినట్లే జులై 20న తలపెట్టిన చలో పార్లమెంట్

- మిగతా 2లో

## గోదావరిలో గల్లంతైన ఐదుగురూ మృతి.. చంద్రబాబు, పవన్ దిగ్భ్రాంతి

- పోలవరం జిల్లా ఎటపాక మండలంలో విషాదకర ఘటన
- గోదావరిన నీటి ప్రవాహానికి కొట్టుకుపోయిన గిరిజనులు
- బాధిత కుటుంబాలకు ప్రభుత్వం అండగా ఉంటుందన్న చంద్రబాబు
- ఈ ఉదంతం కలచివేసిందన్న పవన్




పెన్ పవర్ డెస్క్:పోలవరం జిల్లా ఎటపాక మండలం గొల్లగూడెం వద్ద గోదావరి నదిలో చేపల వేటకు వెళ్లి ఐదుగురు స్థానికులు

- మిగతా 2లో

## మహిళను వివస్త్రను చేసి దాడికి పాల్పడిన ఘటన మానవత్వానికే మచ్చ

- గుంటూరులో మహిళపై టీడీపీ నేత దాడి ఘటనపై జగన్ ఆగ్రహం
- బుధవారం ఘటన జరిగితే మూడు రోజులు కప్పిపుచ్చారని ఆరోపణ
- ఫిర్యాదు చేసినా పోలీసులు స్పందించలేదని తీవ్ర విమర్శలు
- ఇదేనా సుపరిపాలన, మహిళా భద్రత అంటూ సర్కారుకు ప్రశ్నలు
- మహిళల ఆగ్రహం ప్రభుత్వానికి బుద్ధి చెబుతుందని హెచ్చరిక



పెన్ పవర్ డెస్క్:గుంటూరులో ఒక మహిళను వివస్త్రను చేసి, టీడీపీ నాయకుడు దాడికి పాల్పడిన ఘటన మానవత్వానికే మచ్చ అని, రాష్ట్రంలో శాంతిభద్రతల నిర్వహణ ఎంత ఘోరంగా

- మిగతా 2లో

## హైదరాబాదులో పవన్ కల్యాణ్ ను పరామర్శించిన నారా లోకేశ్..

- గతంలో పవన్ భుజానికి గాయం
- ఇటీవల ముంబైలో విజయవంతంగా శస్త్రచికిత్స
- కొన్ని రోజుల కిందటే ఆసుపత్రి నుంచి డిశ్చార్జి
- హైదరాబాదులోని నివాసంలో విశ్రాంతి తీసుకుంటున్న వైనం
- పవనన్న త్వరగా కోలుకోవాలని ఆకాంక్షించిన లోకేశ్



పెన్ పవర్ డెస్క్:ఆంధ్రప్రదేశ్ డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్‌ను రాష్ట్ర ఐటీ, విద్యాశాఖ మంత్రి నారా లోకేశ్ శనివారం పరామర్శించారు. ఇటీవల ముంబ యిలో భుజానికి శస్త్రచికిత్స చేయిం చుకుని

- మిగతా 2లో

## బహదూర్‌గూడలో మళ్లీ ఉద్రిక్తత.. పోలీసులపై కారం చల్లిన రైతులు

- బహదూర్‌గూడలో భూసేకరణపై ఘర్షణ
- పోలీసులపై కారం చల్లి దాడి చేసిన రైతులు
- కానిస్టేబుళ్లు సహా పలువు పోలీసులకు గాయాలు
- 600 ఎకరాల భూముల స్వాధీనానికి వ్యతిరేకత
- ఐదు రోజులుగా రైతుల ఆందోళన కొనసాగింపు



పెన్ పవర్ డెస్క్:రంగారెడ్డి జిల్లా శంషాబాద్ మండలం బహదూర్‌గూడలో బుల్లెట్ ట్రైన్ ప్రాజెక్టు కోసం భూసేకరణ వ్యవహారం మరోసారి ఉద్రిక్తతకు దారితీసింది. భూములు స్వాధీనం చేసుకునేందుకు అధికారులు వెళ్లగా రైతులు అడ్డుకోవడంతో

- మిగతా 2లో

## గోదావరిలో ఐదుగురు గిరిజన మహిళలు గల్లంతు: ముగ్గురి మృతదేహాలు లభ్యం



పెన్ పవర్ డెస్క్:అల్లూరి సీతారామరాజు జిల్లా ఎటపాక మండలం గొల్లగూడెం దగ్గర గోదావరి నదిలో ఘోర ప్రమాదం జరిగింది. చేపలు పట్టడానికి వెళ్లిన ఐదుగురు గిరిజన మహిళలు నదిలో మునిగిపోయారు. నదిలో చేపలు పడుతున్న సమయంలో, నీళ్లు లోతుగా ఉన్న వైపు వెళ్లడం వల్లే వీరంతా కొట్టుకుపోయినట్లు తెలుస్తోంది.

- మిగతా 2లో

# భారత అంతరిక్ష చరిత్రలో నవశకం.. తొలి ప్రైవేట్ రాకెట్ 'విక్రమ్-1' ప్రయోగం సక్సెస్

'మిషన్ ఆగమన్' పేరుతో చేపట్టిన ఈ ప్రయోగం భారత ప్రైవేట్ అంతరిక్ష పరిశ్రమ రాకను సూచిస్తుంది. తొలుత ఒక అంతర్గత సాంకేతిక సమస్య కారణంగా కొద్దిసేపు నిలిపివేసినా, ఆ తర్వాత రాకెట్ ప్రణాళిక ప్రకారమే నిప్పులు చిమ్ముతూ ఆకాశంలోకి దూసుకెళ్లింది. రాకెట్‌కు సంబంధించిన నాలుగు దశలు అనుకున్నట్టుగానే పనిచేయడమే కాకుండా ఉపగ్రహాలను కక్ష్యలో ప్రవేశపెట్టే ప్రక్రియ కూడా తొలి ప్రయత్నంలోనే విజయవంతమైంది. ఈ చారిత్రక విజయం స్కైరూట్ బృందంలో కొత్త ఉత్సాహాన్ని నింపింది.

**'విక్రమ్-1' ప్రత్యేకతలు**

దాదాపు ఏడు అంతస్తుల ఎత్తు ఉండే విక్రమ్-1 రాకెట్‌ను పూర్తిగా కార్బన్ కాంపోజిట్ మెటీరియల్‌తో నిర్మించారు. ఇది 350 కిలోల బరువున్న పేలోడ్లను భూమికి సమీపంలోని కక్ష్య (లో ఎర్త్ ఆర్బిట్)లోకి మోసుకెళ్లగలదు. ఈ రాకెట్‌లో ఉపయోగించిన ప్రొపల్షన్ సిస్టమ్స్, అధునాతన 3డి-ప్రింటెడ్ ఇంజన్లు, హై-పెర్ఫార్మెన్స్ సాలిడ్ రాకెట్ మోటార్లు వంటి కీలక భాగాలన్నింటినీ స్కైరూట్ సంస్థే స్వయంగా అభివృద్ధి చేసింది.

ఈ తొలి ప్రయోగంలో గ్రాహ స్పేస్, కాస్మోసర్ఫ్, డీక్యూబ్డ్ వంటి సంస్థలకు చెందిన టెక్నాలజీ డెమాన్‌స్ట్రేషన్ పేలోడ్లతో పాటు, స్కైరూట్‌కు చెందిన 'స్కోప్' ప్రయోగాన్ని కూడా పంపించారు. వీటితో పాటు కొన్ని ప్రత్యేకమైన వస్తువులను కూడా అంతరిక్షంలోకి పంపారు. వాటిలో ప్రధాన మంత్రి నరేంద్ర మోదీ స్వదస్తూరితో రాసిన 'వందేమాతరం' పోస్ట్‌కార్డ్, ఇస్రో ప్రస్తుత, మాజీ చైర్మన్లు, భారత వ్యోమగాములు, స్కైరూట్ ఉద్యోగులు, పెట్టుబడిదారులు రాసిన సందేశాలు ఉన్నాయి. ఈ విజయం కేవలం రాకెట్ పనితీరును నిర్ధారించడానికే పరిమితం కాదు. అంతరిక్ష రంగంలో ఇస్రోతో పాటు ప్రైవేట్ సంస్థలకు కూడా తలుపులు తెరుస్తూ కేంద్ర ప్రభుత్వం చేపట్టిన సంస్కరణలకు ఇది ఒక పెద్ద విజయంగా నిపుణులు అభివర్ణిస్తున్నారు. ఈ ప్రయోగం ద్వారా లభించిన కీలకమైన ఇంజినీరింగ్ డేటా, భవిష్యత్తులో విక్రమ్ సిరీస్ రాకెట్లను మరింత మెరుగుపరచడానికి, క్రమం తప్పకుండా వాణిజ్య ప్రయోగాలు చేపట్టడానికి స్కైరూట్‌కు సహాయపడుతుంది.

ఇస్రో మాజీ శాస్త్రవేత్తలైన పవన్ కుమార్ చందన, నాగ భరత్ డాకా 2018లో స్కైరూట్ ఏరోస్పేస్‌ను స్థాపించారు. వేగంగా అభివృద్ధి చెందుతున్న చిన్న ఉపగ్రహాల మార్కెట్‌కు తక్కువ ఖర్చుతో, నమ్మకమైన సేవలు అందించడమే లక్ష్యంగా వారు ఈ సంస్థను ప్రారంభించారు.

2022లో 'విక్రమ్-ఎస్' అనే సబ్-ఆర్బిటాల్ రాకెట్‌ను ప్రయోగించి, అంతరిక్షంలోకి రాకెట్‌ను పంపిన తొలి భారతీయ ప్రైవేట్ సంస్థగా స్కైరూట్ ఇప్పటికే చరిత్ర సృష్టించిన విషయం తెలిసిందే. తాజా విజయంతో భారత అంతరిక్ష యానంలో ఇస్రోతో పాటు ప్రైవేట్ రంగం కూడా ఒక కీలక శక్తిగా నిలిచింది.

## ఎడిటర్ వ్యూ

## మహిళను వివస్త్రను చేసి దాడికి పాల్పడిన ఘటన మానవత్వానికే మచ్చ

- మొదటి పేజి తరువాయి

విఫలమైందో చెప్పడానికి ఇది నిలువెత్తు నిదర్శనమని వైసీపీ అధినేత జగన్ మండిపడ్డారు. ఈ దారుణానికి చంద్రబాబు ప్రభుత్వం సిగ్గుతో తలదించుకోవాలని ఆయన విమర్శించారు. ఈ ఘటన బుధవారమే జరిగినా, మూడు రోజులపాటు దానిని కప్పిపుచ్చే ప్రయత్నం చేశారని, చివరకు ఆ వీడియోలు సోషల్ మీడియాలో బయటకు వచ్చి రాష్ట్ర ప్రజలంతా ఈ పరిపాలనను అసహ్యించుకున్న తర్వాతే ప్రభుత్వం స్పందించిందని ఆయన ధ్వజమెత్తారు. ఇప్పుడు తానేదో గొప్పగా చర్యలు తీసుకుంటున్నట్లు ముఖ్యమంత్రి చంద్రబాబు హడావుడి చేయడం మరింత సిగ్గుచేటని అన్నారు. ఆ వీడియోలను కప్పిపుచ్చడంపై చూపిన శ్రద్ధను నిందితులను పట్టుకోవడంపై చూపలేదని జగన్ ఆగ్రహం వ్యక్తం చేశారు. బుధవారం తనపై తొలిసారి దాడి జరిగిన వెంటనే బాధితురాలు పోలీసులను ఆశ్రయించినప్పుడు వారు స్పందించి ఉంటే, ఆ తర్వాత ఇంతటి ఘోరం జరిగేది కాదు కదా అని ప్రశ్నించారు. ఆమె ఫిర్యాదుపై వెంటనే కేసు నమోదు చేసి, నిందితులను అదుపులోకి తీసుకుని ఉంటే ఈ దారుణం జరిగేదా? అని నిలదీశారు. ఫిర్యాదు చేసిన మహిళకు రక్షణ కల్పించకుండా మౌనం వహించడం ఎంతవరకు న్యాయమని ప్రశ్నించారు. "అసలు పోలీస్ స్టేషన్లు ఉన్నది ఎందుకు? బాధితుల ఫిర్యాదులను స్వీకరించడానికా? లేక అధికార పార్టీ నాయకులు ఏం చెబితే అది చేయడానికా? బాధితురాలికి అండగా నిలవకపోగా, పంచాయితీలు చేయడానికి ప్రయత్నిస్తారా? వీడియోలు బయటకు వస్తేనే చట్టం మేల్కొంటుందా? బాధితురాలి ఫిర్యాదుకు విలువ లేదా? నేరం జరుగుతున్నప్పుడు స్పందించకుండా, ప్రజల్లో ఆగ్రహం పెల్లుబికిన తర్వాత చర్యల పేరుతో నాటకాలు ఆడటం ఏ రకమైన పోలీసింగ్? రెడ్‌బుక్ రాజ్యాంగం పేరుతో ప్రతిపక్ష నాయకులు, కార్యకర్తలు, సోషల్ మీడియా యాక్టివిస్టులపై ఈ చంద్రబాబు ప్రభుత్వం కావాలనే దాడులను ప్రోత్సహించింది. ఆ అరాచకాలను కప్పిపుచ్చడానికి పోలీసు వ్యవస్థను ఒక రాజకీయ ఆయుధంగా మార్చుకుంది. చట్టాన్ని అధికార పార్టీకి చుట్టంగా, ప్రతిపక్షాలపై వేధింపులకు, అక్రమ కేసులకు ఒక సాధనంగా మార్చి రాష్ట్రాన్ని జంగిల్‌రాజ్‌గా దిగజార్చింది" అని ఆయన తీవ్రంగా విమర్శించారు.

అధికార పార్టీ నాయకులు ఏం చేసినా పోలీసులు రక్షిస్తారనే ధైర్యం ఈ రెడ్‌బుక్‌పాలనలో గ్రామాలు, వార్డుల స్థాయి వరకూ పాకిందని జగన్ అన్నారు. అందుకే టీడీపీ కూటమికి చెందిన పలువురు నాయకులు దుశ్శాసనుల్లా తయారయ్యారని మండిపడ్డారు. ఎలాంటి దారుణాలు చేసినా, ముఖ్యంగా మహిళలపై దాడి చేసినా, తమను కాపాడటానికి చంద్రబాబు ఉన్నారనే ధైర్యం వారిలో పెరిగిపోయిందని ధ్వజమెత్తారు.

ఈ పరిస్థితి రాష్ట్రంలో మహిళలకు రక్షణ లేకుండా చేసిందని జగన్ ఆరోపించారు. అధికార పార్టీ నాయకుల దురాగతాల నుంచి తమను తాము కాపాడుకోవాల్సిన దుస్థితికి మహిళల చేరుకున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. "చంద్రబాబు గారూ, ఇదేనా మీరు చెప్పే మహిళా భద్రత? ఇదేనా మీ సుపరిపాలన? ఇదేనా మీ పోలీసింగ్? మహిళల ఆగ్రహమే మీ ప్రభుత్వానికి తగిన బుద్ధి చెబుతుంది" అని ఆయన హెచ్చరించారు.

## గోదావరిలో గల్లంతైన ఐదుగురూ మృతి.. చంద్రబాబు, పవన్ దిగ్భ్రాంతి

- మొదటి పేజి తరువాయి

ప్రాణాలు కోల్పోయిన విషాద ఘటనపై ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి చంద్రబాబు, ఉపముఖ్యమంత్రి పవన్ కల్యాణ్ తీవ్ర విచారం వ్యక్తం చేశారు. ఒకే గ్రామానికి చెందిన ఐదుగురు ఇలా మృత్యువాత పడటం అత్యంత విచారకరమని, బాధిత కుటుంబాలకు కూటమి ప్రభుత్వం అన్ని విధాలా అండగా ఉంటుందని భరోసా ఇచ్చారు. ఈ ప్రమాదం గురించి సమాచారం అందిన వెంటనే చంద్రబాబు అధికారులతో మాట్లాడి వివరాలు అడిగి తెలుసుకున్నారు. గొమ్ముకొత్తగూడెం గ్రామానికి చెందిన తుర్రం భారతి, ఊకే సుశీల, ఊకే లక్ష్మి, బాసిబోయిన బాలరాజు, ఊకే రమేశ్ అనే ఐదుగురు ఈ దుర్ఘటనలో మరణించినట్లు అధికారులు సీఎంకు తెలిపారు. బాధిత కుటుంబాలకు తక్షణమే అవసరమైన ఆర్థిక, నిత్యావసర సహాయ సహకారాలు అందించాలని జిల్లా యంత్రాంగాన్ని ముఖ్యమంత్రి ఆదేశించారు. ఈ దారుణ ఉదంతం తనను తీవ్రంగా కలిచివేసిందనిపవన్ కల్యాణ్ పేర్కొన్నారు. ఆయన పోలవరం జిల్లా కలెక్టర్‌కు ఫోన్ చేసి, ఘటనకు దారితీసిన పరిస్థితులపై ఆరా తీశారు. ప్రాణాలు కోల్పోయిన వారి కుటుంబ సభ్యులకు తన ప్రగాఢ సానుభూతిని తెలియజేస్తూ.. ప్రభుత్వం తరఫున వారికి ఎలాంటి లోటు రాకుండా సహాయ చర్యలు ముమ్మరం చేయాలని అధికారులకు దిశానిర్దేశం చేశారు. ఈ ప్రమాదంపై రాష్ట్ర హోంమంత్రి వంగలపూడి అనిత కూడా తీవ్ర దిగ్భ్రాంతి వ్యక్తం చేశారు. జిల్లా కలెక్టర్, ఎస్పీలతో ఆమె ఫోన్‌లో మాట్లాడి సహాయక చర్యలను పర్యవేక్షించారు. సాధారణంగా చేపల వేటకు వెళ్లే ప్రాంతంలో ఈ ప్రమాదం ఎలా జరిగిందనే కోణంలో సమగ్ర దర్యాప్తు జరపాలని పోలీసు అధికారులను ఆదేశించారు. బాధిత కుటుంబాలకు తక్షణ ప్రభుత్వ సాయం అందేలా చూడాలని జిల్లా యంత్రాంగానికి స్పష్టం చేస్తూ... మృతుల కుటుంబ సభ్యులకు ఈ కష్ట సమయంలో భగవంతుడు మనోధైర్యాన్ని ప్రసాదించాలని ఆమె ఆకాంక్షించారు

## బహదూర్‌గూడలో మళ్లీ ఉద్రిక్తత.. పోలీసులపై కారం చల్లిన రైతులు

- మొదటి పేజి తరువాయి

పరిస్థితి ఉద్రిక్తంగా మారింది. ఆగ్రహానికి గురైన కొందరు రైతులు పోలీసులపై కారం చల్లి, రాళ్లు, కుర్చీలు విసురుతూ దాడికి దిగారు. ఈ ఘటనలో పలువురు కానిస్టేబుళ్లు, ఎస్‌ఐలు, సీఐలకు గాయాలయ్యాయి. గాయపడిన అధికారులకు చికిత్స అందించారు. డీసీపీకి కూడా గాయాలైనట్టు తెలుస్తోంది. ఈ ఘటనతో ఆ ప్రాంతంలో ఉద్రిక్త వాతావరణం నెలకొంది. బుల్లెట్ ట్రైన్ ప్రాజెక్టు కోసం సుమారు 600 ఎకరాల భూమిని సేకరించేందుకు అధికారులు చర్యలు చేపడుతున్నారు. అయితే తమ భూములను ఎట్టి పరిస్థితుల్లో ఇవ్వబోమంటూ రైతులు ఐదు రోజులుగా నిరసన కొనసాగిస్తున్నారు. తమకు స్పష్టమైన హామీ ఇచ్చిన తర్వాతే భూసేకరణ చేపట్టాలని డిమాండ్ చేస్తున్నారు.

భూముల స్వాధీన ప్రక్రియ కోసం శనివారం ఉదయం హైడ్రా అధికారులు భారీ బందోబస్తుతో అక్కడికి చేరుకున్నారు. అధికారులు ముందుకు సాగేందుకు ప్రయత్నించగా రైతులు అడ్డుకున్నారు. ఉదయం మొదలైన ఉద్రిక్తత సాయంత్రానికి మరింత తీవ్రరూపం దాల్చింది. పరిస్థితి చేదాటడంతో డీసీపీ యోగేశ్ గౌతమ్ రంగంలోకి దిగారు. వారికి నచ్చజెప్పే ప్రయత్నం చేశారు. ఇది ఆరంభం మాత్రమేనని, చర్చలు జరిపిన తర్వాతే తుది నిర్ణయం తీసుకుంటారని స్పష్టం చేశారు. ఎలాంటి అభ్యంతరాలు ఉన్నా కలెక్టర్‌కు విన్నవించుకునే అవకాశం కల్పిస్తారని చెప్పారు. రైతుల అనుమతి లేకుండా ఎలాంటి బలవంతపు చర్యలు తీసుకోబోరని హామీ ఇచ్చారు. అయినప్పటికీ.. రైతులు వెనక్కి తగ్గలేదు. నిరసన కొనసాగిస్తామని భీష్మించారు.

## 2024లో రాజకీయ చెత్తను ప్రజలే శుభ్రం చేశారు

- మొదటి పేజి తరువాయి

**అక్టోబర్ 2 నాటికి చెత్త రహిత రాష్ట్రం**

గత ప్రభుత్వ హయాంలో రాష్ట్రంలో 140 లక్షల మెట్రిక్ టన్నుల చెత్త పేరుకుపోయిందని, దానిని తొలగించి ఇప్పుడు స్వచ్ఛ పథం, ఆపరేషన్ క్లీన్ స్వీప్ వంటి కార్యక్రమాలతో రాష్ట్రాన్ని శుభ్రం చేస్తున్నామని చంద్రబాబు తెలిపారు. అక్టోబర్ 2 నాటికి రాష్ట్రాన్ని చెత్త రహితంగా మారుస్తామని ప్రకటించారు. దీనికోసం రూ.528 కోట్లతో వ్యర్థాల నిర్వహణ ప్లాంట్లు, చెత్త నుంచి విద్యుత్ ఉత్పత్తి చేసే 8 ప్లాంట్లను ఏర్పాటు చేస్తున్నామన్నారు. ఇంటింటికీ చెత్త సేకరణ కోసం 126 ఎలక్ట్రిక్ ఆటోలను ప్రారంభించామని, త్వరలో మరో 1104 ఇ-ఆటోలు అందుబాటులోకి వస్తాయని వెల్లడించారు. ప్రతి ఒక్కరూ తమ ఇంటి నుంచే తడి, పొడి చెత్తను వేరుచేయాలని, 'నెట్ జీరో' వ్యర్థాల విధానాన్ని అలవాటు చేసుకోవాలని పిలుపునిచ్చారు.

**తప్పు ఎవరు చేసినా ఉపేక్షించం**

గత ఐదేళ్ల పాలనలో రాష్ట్రంలో విధ్వంసం జరిగిందని, ప్రజలు సంతోషంగా జీవించే పరిస్థితి లేకపోయిందని చంద్రబాబు విమర్శించారు. రాజకీయాల్లో క్రిమినల్ ధోరణులు, కుట్రలు, సోషల్ మీడియాలో అసభ్య పోస్టులతో ప్రజలను వేధిస్తున్నారని ఆరోపించారు. డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్ కుటుంబ సభ్యులపై అసభ్య పోస్టులు పెట్టి, ప్రశ్నిస్తే భావ ప్రకటనా స్వేచ్ఛ అనడం దారుణమన్నారు.

ప్రజల జీవితాలకు ఆటంకం కలిగించే వారిని ఎట్టి పరిస్థితుల్లోనూ ఉపేక్షించబోమని హెచ్చరించారు. చట్టాన్ని ఎవరూ చేతుల్లోకి తీసుకోవడానికి వీల్లేదని, తప్పు చేసిన వ్యక్తి ఏ పార్టీకి చెందిన వారైనా కఠిన చర్యలు తప్పవని స్పష్టం చేశారు. గుంటూరులో మహిళ పట్ల దురుసుగా ప్రవర్తించిన టీడీపీ కార్యకర్తను తక్షణమే పార్టీ నుంచి సస్పెండ్ చేసి అరెస్ట్ చేయించామని, శ్రీకాకుళం ఘటనలోనూ బాధితులకు న్యాయం చేస్తామని తెలిపారు.

**సంక్షేమం, అభివృద్ధి రెండు కళ్లు**

తీవ్ర ఆర్థిక ఇబ్బందులు ఉన్నప్పటికీ సంక్షేమ పథకాలను కొనసాగిస్తున్నామని ముఖ్యమంత్రి తెలిపారు. ప్రభుత్వం వద్ద డబ్బు లేకపోయినా, పేదల పక్షాన నిలిచే మనసుందని అన్నారు. ఈ నెల 22 నుంచి 24 మధ్య "తల్లికి వందనం" పథకం కింద 67.47 లక్షల మంది విద్యార్థుల తల్లుల ఖాతాల్లో రూ.10,122 కోట్లు జమ చేయనున్నట్లు ప్రకటించారు.

మరోవైపు, 12 ఏళ్ల క్రితం నీళ్లు లేక ఇబ్బంది పడిన కృష్ణా డెల్టాకు పట్టిసీమ ద్వారా 450 టీఎంసీల గోదావరి జలాలను అందించి రూ.50 వేల కోట్ల సంపద సృష్టించామని గుర్తుచేశారు. అక్వా రైతులకు యూనిట్‌కు రూ.1.50కే విద్యుత్ అందిస్తూ ఆదుకుంటున్నామని భరోసా ఇచ్చారు.

ఈ కార్యక్రమంలో భాగంగా గుడివాడ బస్టాండ్ అభివృద్ధికి అన్నే నరసింహారావు దంపతులు రూ.3 కోట్లు విరాళం ప్రకటించారు. సాయి శ్వేత అనే గృహిణి అమరావతి కోసం తన బంగారు గాజులను విరాళంగా ఇచ్చారు. వారిని ముఖ్యమంత్రి అభినందించారు. ఈ కార్యక్రమంలో మంత్రులు పి.నారాయణ, కొల్లు రవీంద్ర, వాసంశెట్టి సుభాష్, ఎంపీ బాలశౌరి, స్థానిక ఎమ్మెల్యే వెనిగండ్ల రాము తదితరులు పాల్గొన్నారు.

## రాష్ట్రంలో గుడిసెలు లేకుండా చేస్తాం

- మొదటి పేజి తరువాయి

రోడ్ల అభివృద్ధి పనులకు మంత్రులు శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా పరిగి పట్టణంలో భారీ ర్యాలీ నిర్వహించిన అనంతరం ఏర్పాటు చేసిన బహిరంగ సభలో మంత్రులు కీలక వివరాలను వెల్లడించారు. రాష్ట్రవ్యాప్తంగా ఇళ్లు లేని పేద ప్రజలు సొంతంగా పక్కా ఇంటిని నిర్మించుకునేందుకు ప్రభుత్వం రూ.5 లక్షల ఆర్థిక సహాయాన్ని అందిస్తోందని కోమటిరెడ్డి తెలిపారు. త్వరలోనే అర్హులైన మిగతా వారందరికీ ఇళ్లు ఇచ్చేందుకు రెండో విడత కార్యక్రమాన్ని కూడా ప్రారంభిస్తామన్నారు. వికారాబాద్ జిల్లాలో రోడ్ల నెట్‌వర్క్ బలోపేతం కోసం రూ.900 కోట్ల నిధులు మంజూరు చేయించామని, అందులో నుంచే పరిగి నియోజకవర్గానికి రూ.184.15 కోట్లు కేటాయించినట్లు వెల్లడించారు. రవాణా వ్యవస్థ మెరుగైతేనే పరిశ్రమలు వచ్చి స్థానిక యువతకు ఉపాధి పెరుగుతుందని ఆయన ఆశాభావం వ్యక్తం చేశారు. లక్ష్మీదేవిపల్లి ప్రాజెక్టు పనులను వేగవంతం చేసి తీరుతామని మాట ఇచ్చిన మంత్రి కోమటిరెడ్డి... నిరుపేదలకు కొత్త రేషన్ కార్డులతో పాటు సన్న బియ్యం పంపిణీ చేస్తున్నామని గుర్తుచేశారు. మహాలక్ష్మి పథకం ద్వారా మహిళలకు ఉచిత బస్సు ప్రయాణం, రూ.500లకే గ్యాస్ సిలిండర్ వంటి సంక్షేమ పథకాలను విజయవంతంగా కొనసాగిస్తున్నామని వివరించారు.

## ధర్మేంద్ర ప్రధాన్ కాదు.. మోడీ రాజీనామా చేయాలి

- మొదటి పేజి తరువాయి

కార్యక్రమం చేసి తీరుతామని తేల్చిచెప్పింది.

ఈ సందర్భంగా కాక్రోచ్ జనతా పార్టీ ఫౌండర్ అభిజిత్ దీప్కే మాట్లాడుతూ.. సోనమ్ వాంగ్ చుక్? దీక్షను భగ్నం చేసినంత మాత్రాన మా ఉద్యమం ఆగుతుందనుకుంటే అది వారి పొరపాటేనని అన్నారు. మేము ఇప్పటి వరకు ధర్మేంద్ర ప్రధాన్ రాజీనామా చేయాలని డిమాండ్ చేశాం.. కానీ శాంతియుతంగా చేస్తోన్న మా దీక్షను భగ్నం చేశాక ఇప్పుడు ప్రధాని మోడీ రాజీనామా చేయాలని డిమాండ్ చేస్తున్నామని దీప్కే పేర్కొన్నారు. మేం ఇక్కడే ఉంటాం.. సోనమ్ స్థానంలో దీక్షను యధావిధిగా కొనసాగిస్తామని స్పష్టం చేశారు. జులై 20న తలపెట్టిన చలో పార్లమెంట్ కార్యక్రమం విజయవంతం చేసి తీరుతామని ధీమా వ్యక్తం చేశారు. ఎవరూ వెనక్కి తగ్గొద్దని.. పెద్ద ఎత్తున జంతర్ మంతర్?కు తరలిరావాలని మద్దతుదారులకు సూచించారు.

సోనమ్ వాంగ్ చుక్?ను దీక్షా శిబిరం నుంచి పోలీసులు బలవంతంగా ఈడ్చుకెళ్లారని ఆగ్రహం వ్యక్తం చేశారు. శాంతియుతంగా నిరసన తెలుపుతున్న సీజేపీ మద్దతుదారులపై పోలీసులు విచక్షణరహితంగా ప్రవర్తించారని మండిపడ్డారు. శాంతియుతంగా చేస్తోన్న తమ దీక్షను భగ్నం చేసి ప్రభుత్వం పెద్ద తప్పు చేసిందని అన్నారు. మమ్మల్ని ఎంత అణగదొక్కాలని చూస్తే అంతకు రెట్టింపు వేగంతో మా ఉద్యమం మరింత విస్తరిస్తుందని హెచ్చరించారు.

## హైదరాబాదులో పవన్ కల్యాణ్ ను పరామర్శించిన నారా లోకేశ్..

- మొదటి పేజి తరువాయి

హైదరాబాద్‌లోని తన నివాసంలో విశ్రాంతి తీసుకుంటున్న పవన్ కల్యాణ్‌ను లోకేశ్ మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా "పవనన్న త్వరగా కోలుకోవాలి" అని ఆయన ఆకాంక్షించారు. పవన్ కల్యాణ్ ఆరోగ్య పరిస్థితిని లోకేశ్ అడిగి తెలుసుకున్నారు. భుజానికి అయిన గాయం, జరిగిన శస్త్రచికిత్స వివరాలను అడిగారు. వైద్యుల సూచనల మేరకు పూర్తి విశ్రాంతి తీసుకోవాలని సూచించారు. తన పరామర్శ అనంతరం లోకేశ్ మాట్లాడుతూ.. "డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్ గారిని పరామర్శించాను. ఆయన త్వరగా కోలుకోవాలని ఆకాంక్షించాను. వైద్యుల సూచనలు పాటిస్తూ వీలైనంత మేర విశ్రాంతి తీసుకోవాలని సూచించాను" అని తెలిపారు. గతంలో భుజానికి గాయం కావడంతో పవన్ కల్యాణ్ కొంతకాలంగా ఇబ్బంది పడుతున్న సంగతి తెలిసిందే. ఇటీవలే ముంబయిలోని కోకిలాబెన్ ఆసుపత్రిలో ఆయన కుడి భుజానికి వైద్యులు విజయవంతంగా శస్త్రచికిత్స చేశారు. ఆసుపత్రి నుంచి డిశ్చార్జ్ అయిన తర్వాత ఆయన హైదరాబాద్‌లోనే ఉంటూ విశ్రాంతి తీసుకుంటున్నారు. పలువురు ప్రముఖులు ఆయన నివాసానికి వచ్చి పరామర్శిస్తున్నారు.

### గోదావరిలో ఐదుగురు గిరిజన మహిళలు గల్లంతు:

## ముగ్గురి మృతదేహాలు లభ్యం

- మొదటి పేజి తరువాయి

ప్రమాదానికి గురైన వారంతా గొమ్ముకొత్తగూడెం గ్రామానికి చెందినవారు. ప్రమాదం గురించి తెలియగానే పోలీసులు, స్థానికులు కలిసి నదిలో గాలింపు చర్యలు చేపట్టారు. ఇప్పటివరకు ముగ్గురి మృతదేహాలు లభ్యమవ్వగా, మిగిలిన ఇద్దరి కోసం వెతుకులాట కొనసాగుతోంది. మరణించిన వారిని ఊకె సుశీల (37), ఊకె లక్ష్మి (37), తుర్రం భారతి (40), భాసుబోయిన బాలరాజు (38), ఊకె రమేష్ (38)గా గుర్తించారు. ఒకే గ్రామానికి చెందిన ఐదుగురు చనిపోవడంతో గొమ్ముకొత్తగూడెం గ్రామంలో తీవ్ర విషాదం నెలకొంది. ప్రస్తుతం మృతదేహాలను పోస్టుమార్టం కోసం స్థానిక ప్రభుత్వ ఆసుపత్రికి తరలించాక వారి కుటుంబ సభ్యులకు అప్పగించనున్నారు. కాగా, ఈ ప్రమాదంపై ఏపీ మంత్రి సంధ్యారాణి స్పందిస్తూ అధికారులను వివరాలు అడిగి తెలుసుకున్నారు.

## ఆగస్టు 1న చరిత్రలో నిలిచిపోయేలా భోగాపురం ఎయిర్ పోర్టు ప్రారంభోత్సవం

ఉత్తరాంధ్ర ప్రజల దశాబ్దాల కల నెరవేరబోతోంది. విశాఖపట్నం సమీపంలోని భోగాపురంలో నిర్మించిన అల్లూరి సీతారామరాజు అంతర్జాతీయ విమానాశ్రయం ప్రారంభానికి ముహూర్తం ఖరారైంది. ఆగస్టు 1న ప్రధానమంత్రి నరేంద్ర మోదీ చేతుల మీదుగా ఈ గ్రీన్‌ఫీల్డ్ ఎయిర్‌పోర్టును లాంఛనంగా ప్రారంభించనున్నట్లు ముఖ్యమంత్రి చంద్రబాబు ప్రకటించారు. దీంతో గత కొంతకాలంగా ప్రారంభోత్సవ తేదీపై నెలకొన్న ఊహాగానాలకు తెరపడింది. శనివారం సాయంత్రం విమానాశ్రయ నిర్మాణ పనుల పురోగతిపై ఉన్నతాధికారులతో సమీక్ష నిర్వహించిన చంద్రబాబు, ఈ కీలక ప్రకటన చేశారు. ప్రారంభోత్సవ కార్యక్రమాన్ని చరిత్రలో నిలిచిపోయేలా అత్యంత ఘనంగా నిర్వహించాలని అధికారులను ఆదేశించారు. భోగాపురం విమానాశ్రయం ఉత్తరాంధ్ర అభివృద్ధిలో ఒక చారిత్రక మైలురాయిగా నిలుస్తుందని ఆయన ధీమా వ్యక్తం చేశారు. ఈ ప్రాంతంలోని పర్యాటకం, పోర్టులు, జాతీయ రహదారులు, పారిశ్రామిక ప్రగతితో కలిసి ఈ ఎయిర్‌పోర్టు ఉత్తరాంధ్రను 'అన్‌స్టాపబుల్' శక్తిగా మారుస్తుందని ఆయన పేర్కొన్నారు. విజయనగరం జిల్లా భోగాపురం వద్ద, విశాఖ నగరానికి సుమారు 45 కిలోమీటర్ల దూరంలో జాతీయ రహదారి-16కు సమీపంలో సుమారు 2,200 ఎకరాల విస్తీర్ణంలో ఈ విమానాశ్రయాన్ని నిర్మించారు. ప్రఖ్యాత మౌలిక సదుపాయాల సంస్థ జీఎంఆర్ గ్రూప్‌కు చెందిన 'జీఎంఆర్ విశాఖపట్నం ఇంటర్నేషనల్ ఎయిర్‌పోర్ట్ లిమిటెడ్ (+ఎ×ూూ)' ఈ ప్రాజెక్టును ప్రతిష్టాత్మకంగా చేపట్టింది. తొలి దశలో భాగంగా రూ. 4,592 కోట్ల వ్యయంతో ఎయిర్‌పోర్టును నిర్మించారు. మొదటి దశలో ఏటా 63 లక్షల (6.3 మిలియన్ల) మంది ప్రయాణికులకు సేవలు అందించే సామర్థ్యంతో టెర్మినల్ భవనాన్ని తీర్చిదిద్దారు. భవిష్యత్తులో ప్రయాణికుల రద్దీకి అనుగుణంగా రెండో దశలో 1.2 కోట్లు, మూడో దశలో 1.8 కోట్ల మందికి విస్తరించేలా మాస్టర్ ప్లాన్ రూపొందించారు. ఈ ప్రాజెక్టు పలు ప్రభుత్వాల హయాంలో పురోగతి సాధించింది. 2019 ఫిబ్రవరిలో అప్పటి ముఖ్యమంత్రిగా చంద్రబాబు శంకుస్థాపన చేశారు. 2024 సెప్టెంబర్‌లో ఈ విమానాశ్రయానికి 'అల్లూరి సీతారామరాజు అంతర్జాతీయ విమానాశ్రయం'గా నామకరణం చేశారు. ప్రస్తుతం విశాఖ నగరంలోని ఐఎన్ఎస్ డేగా నేవల్ ఎయిర్‌బేస్ నుంచి కొనసాగుతున్న పౌర విమానయాన కార్యకలాపాలు దశలవారీగా భోగాపురం ఎయిర్‌పోర్టుకు మారనున్నాయి. ఈ విమానాశ్రయం చుట్టూ 'ఏరోట్రోపాలిస్'ను అభివృద్ధి చేసే ప్రణాళికలు కూడా ఉన్నాయి. ఈ విమానాశ్రయం పూర్తిస్థాయిలో అందుబాటులోకి వస్తే ఉత్తరాంధ్ర పారిశ్రామిక, పర్యాటక రంగాలకు కొత్త ఊపు వస్తుందని నిపుణులు అంచనా వేస్తున్నారు.

## ముందు ఎన్సీపీ విలీనం.. తర్వాత ఎన్డీయేలోకి.. మహారాష్ట్రలో బీజేపీ మాస్టర్ ప్లాన్!

- మొదటి పేజి తరువాయి

ఫార్ములాను బీజేపీ పరిశీలిస్తున్నట్లు సమాచారం. ఈ అంశంపై రెండు వర్గాల మధ్య లోతైన చర్చలు జరుగుతున్నాయని.. 15 రోజుల్లో తుది నిర్ణయం వెలువడే అవకాశం ఉందని సంబంధిత వర్గాలు చెప్పినట్లు 'న్యూస్18' పేర్కొంది. 2023 జులైలో ఎన్సీపీ చీలిపోయిన తర్వాత అజిత్ పవార్ వర్గం బీజేపీ-శివసేన ప్రభుత్వంలో చేరింది. ఈ ఏడాది బరామతి సమీపంలో జరిగిన విమాన ప్రమాదంలో అజిత్ పవార్ మరణించారు. అప్పటి నుంచి రెండు వర్గాల విలీనంపై మళ్లీ చర్చలు ఊపందుకున్నాయి. ఇటీవల ఎన్డీయే నేతలు, రెండు ఎన్సీపీ వర్గాల ప్రతినిధులు పలుమార్లు సమావేశమైనట్లు సమాచారం. ఒకవేళ విలీనం సాధ్యంకాకపోతే.. శరద్ పవార్ వర్గం ప్రత్యేక పార్టీగానే ఎన్డీయేలో చేరడం లేదా ప్రభుత్వానికి బయట నుంచి మద్దతు ఇవ్వడం వంటి ప్రత్యామ్నాయాలనూ పరిశీలిస్తున్నట్లు తెలుస్తోంది. అయితే ఆ వర్గానికి చెందిన ఎక్కువ మంది ఎంపీలు, ఎమ్మెల్యేలు నేరుగా ఎన్డీయేలో చేరాలని కోరుకుంటున్నట్లు సమాచారం. కేంద్రం, మహారాష్ట్ర ప్రభుత్వాల్లో భాగమైతే పార్టీ బలోపేతానికి ఉపయోగపడుతుందని వారు భావిస్తున్నారని తెలుస్తోంది. విలీనం జరిగితే పార్టీ అధ్యక్ష పదవిని సునేత్రా పవార్‌కు ఇవ్వాలని కోరుతున్నట్లు సమాచారం. అలాగే మహారాష్ట్ర ఆర్థిక శాఖ తమ వర్గానికే ఇవ్వాలని ఆమె పట్టుబడుతున్నారని, శరద్ పవార్ వర్గం కూడా అదే శాఖపై ఆసక్తి చూపుతున్నట్లు తెలుస్తోంది. మరోవైపు లోక్‌సభ స్థానాల సంఖ్య పెంపు, మహిళలకు 33 శాతం రిజర్వేషన్‌కు సంబంధించిన రాజ్యాంగ సవరణ బిల్లు పార్లమెంట్‌లో మళ్లీ ప్రవేశపెట్టాలని ఎన్డీయే భావిస్తున్నట్లు వార్తలు వస్తున్నాయి.

# అంగన్వాడీ కేంద్రాల్లో చక్కటి సేవలు అందించాలి

## ఇండక్షన్ స్టవ్‌లు పంపిణీ  ఎమ్మెల్యే ఉగ్ర

**పీసీ పల్లి, పెన్ పవర్ జూలై 18**

అంగన్వాడి కేంద్రాల ద్వారా చిన్నారులు, గర్భిణీలు, బాలింతలకు సేవలు అందించడంలో బాధ్యతగా ఉండాలని కనిగిరి ఎమ్మెల్యే ముక్కు ఉగ్ర నరసింహా రెడ్డి సూచించారు. విద్యుత్ ఆదా చేయడంలో భాగంగా అంగన్వాడీ కేంద్రాలకు ఇండక్షన్ స్టవ్ లు, వంట పాత్రలను ఆయన శనివారం పంపిణీ చేశారు. పీసీ పల్లి



అంగన్వాడీ కేంద్రాలకు అందజేశారు. ఒక్కొక్క అంగన్వాడీ కేంద్రానికి సుమారు 7 వేల రూపాయల విలువ చేసే వస్తువులను అందిస్తోందని అన్నారు. చిన్నారుల్లో పోషకాహార లోపం ఉండకూడదనే ఉద్దేశంతో అంగన్వాడీ కేంద్రాలకు ప్రభుత్వం భారీగా నిధులు కేటాయిస్తుందని చెప్పారు. నిధుల సద్వినియోగం జరిగేలా అధికారులు పనిచేయాలని ఆయన సూచించారు.

పెన్ పవర్
MARKAPURAM మార్కాపురం
మార్కాపురం - ప్రకాశం

# చుక్కల భూముల సమస్యకు నెల రోజుల్లో పరిష్కారం

**నెలరోజుల తర్వాత మరోసారి శామీర్ పాలెంలో పర్యటిస్తా -పూర్తి స్థాయిలో విద్యుత్ స్తంభాలు ఏర్పాటు చేయాలని అధికారులకు ఆదేశాలు**

**ప్రభుత్వం సరఫరా చేస్తున్న మంచినీటిలో మెండుగా పోషకాలు -వీ.బీ.జీ రామ్ పనులు పరిశీలించిన కలెక్టర్ రాజబాబు ,ఎమ్మెల్యే ఇంటూరి**

**ముర్రా జాతి గేదేలతో మరింత పాల దిగుబడి -అంగన్వాడీ కేంద్రం లో చిన్నారులను ఆప్యాయంగా పలకరించి పైకెత్తుకుని ముద్దాడిన కలెక్టర్ రాజబాబు**





**వలేటివారిపాలెం, పెన్ పవర్ జూలై 18**

సమీరపాలెంలోని చుక్కల భూముల సమస్యను నెల రోజుల్లోగా పరిష్కరించేలా చర్యలు తీసుకుంటానని జిల్లా కలెక్టర్ పి.రాజాబాబు హామీ ఇచ్చారు. గ్రామంలోని ఇతర సమస్యలను కూడా సత్వరమే పరిష్కరిస్తామని చెప్పారు. శుక్రవారం రాత్రి వలేటివారిపాలెం మండలం సమీరపాలెం గ్రామంలో ' పల్లెనిద్ర ' నిర్వహించి స్వర్ణ గ్రామ సచివాలయంలో బసచేసిన కలెక్టర్, శనివారం ఉదయం కూడా ప్రజల నుంచి అర్జీలు తీసుకుని గ్రామంలో పర్యటించారు. ' పల్లెనిద్ర ' లో గ్రామస్తులు ప్రస్తావించిన పలు అభివృద్ధి సంబంధిత సమస్యలను కందుకూరు ఎమ్మెల్యే ఇంటూరి నాగేశ్వరరావు, సబ్ కలెక్టర్ డి. హిమవంశీతో కలిసి పరిశీలించారు. ఎస్సీ కాలనీలో గ్రామసభ నిర్వహించి ' స్వర్ణాంధ్ర - స్వచ్ఛాంధ్ర ' కార్యక్రమ ప్రాధాన్యాన్ని వివరించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ గ్రామస్తులు ప్రస్తావించిన రెవెన్యూ సమస్యలను పరిష్కరించడంపై దృష్టి పెట్టామన్నారు. ముఖ్యంగా చుక్కల భూముల సమస్యను 30 రోజుల్లోగా పరిష్కరిస్తానని చెప్పారు. ఆ తరువాత మరోసారి ఈ గ్రామాన్ని సందర్శిస్తానని ప్రకటించారు. గ్రామంలో పూర్తిస్థాయిలో విద్యుత్తు స్తంభాలు ఏర్పాటు చేయాలని అధికారులను ఆదేశించారు. ఎస్సీ కాలనీ నుంచి సచివాలయానికి వెళ్లేందుకు స్థానిక పంట కాలువ మీద కల్వర్టు కూడా నిర్మిస్తామని చెప్పారు. గ్రామంలోని ప్రధాన వాగు వెంట రైతులకు ఉపయోగపడేలా రోడ్డు నిర్మిస్తామన్నారు. ఎస్సీ కాలనీ ప్రజలు వెళ్లేందుకు స్మశానానికి దారి కల్పిస్తామన్నారు. ఎస్.టీ. కాలనీలో కూడా డ్రైనేజీల నిర్మాణానికి అంచనాలు రూపొందించాలని అధికారులను కలెక్టర్ ఆదేశించారు. గ్రామానికి మంచినీటిని సరఫరా చేసే బావిని సందర్శించి మంచినీటి నాణ్యత పై కలెక్టర్ ఆరా తీశారు. కాగా, ఆయన సమక్షంలో ఆర్డబ్ల్యూఎస్ సిబ్బంది మంచినీటి పరీక్షలు నిర్వహించారు. ప్రభుత్వం సరఫరా చేస్తున్న మంచినీటిలో మెండుగా పోషకాలు ఉన్నాయని, ఈ నీటినే తాగాలని ప్రజలకు ఈ సందర్భంగా కలెక్టర్ సూచించారు. గ్రామంలో వీ.బీ.జీ. రామ్ జీ పథకం కింద చేపడుతున్న పనులను కలెక్టర్, ఎమ్మెల్యే పరిశీలించారు. లబ్ధిదారులతో వారు మాట్లాడారు. ముఖ హాజరు వేయటంలో ఎలాంటి ఇబ్బందీ లేదని, పూర్తిస్థాయిలో పనులు లభిస్తున్నాయని కూలీలు తెలిపారు. పరిసరాలను శుభ్రంగా పెట్టుకుంటేనే మనకు ఆరోగ్యము, గౌరవము లభిస్తాయని కలెక్టర్ చెప్పారు. గ్రామానికి ఎస్.డబ్ల్యూ.పి.సి. షెడ్డును నిర్మిస్తామని తెలిపారు. పారిశుద్ధ్య నిర్వహణకు ప్రభుత్వం అధిక ప్రాధాన్యం ఇస్తున్నదని, ప్రజలు కూడా తమ వంతు బాధ్యత నిర్వహించాలని కలెక్టర్ పిలుపునిచ్చారు. సింగిల్ యూజ్ ప్లాస్టిక్ ను వినియోగించవద్దని సూచించారు. తడి చెత్తను, పొడి చెత్తను ఇంట్లోనే వేరు చేయాలని చెప్పారు. ఈ దిశగా సహకరిస్తామని ప్రజలతో కలెక్టర్ ప్రతిజ్ఞ చేయించారు. ప్లాస్టిక్ వ్యర్థాలను తీసుకుని సరుకులు అందించే స్వచ్ఛ రథాన్ని కలెక్టర్, ఎమ్మెల్యే పరిశీలించారు. ఈ సౌకర్యాన్ని ఉపయోగించుకోవాలని ప్రజలకు సూచించారు. ముర్రా బ్రీడ్ తో స్థానికంగా జన్మించిన గేదెలను కలెక్టర్, ఎమ్మెల్యే పరిశీలించారు. వాటి యజమానులతో మాట్లాడి మరింత పాల దిగుబడి కోసం దాణా అందించారు. రంగురంగుల కాగితాలతో తయారుచేసిన పూల బొకేలను చేత పట్టుకుని తాను బసచేసిన సచివాలయం వద్దకు వచ్చిన అంగన్వాడి చిన్నారులతో కలెక్టర్ ప్రత్యేకంగా మాట్లాడారు. ఆప్యాయంగా వారిని పైకెత్తుకున్నారు. వయసుకు తగినట్లుగా పిల్లలు బరువు ఉండాలని, అవసరమైన పోషకాహారం సమృద్ధిగా అందించాలని ఐసిడిఎస్ పి.డి. పద్మ సునందకు దిశా నిర్దేశం చేశారు. గ్రామ సభలో ఎమ్మెల్యే మాట్లాడుతూ పరిసరాల స్వచ్ఛత వలన ఆరోగ్యంగా ఉండవచ్చు అన్నారు. ప్రశాంతంగా ఉండే పల్లెటూరులో కూడా ప్రజలు క్యాన్సర్ బారిన పడుతున్నారంటే ప్లాస్టిక్ వినియోగమే దీనికి ప్రధాన కారణం అన్నారు. ప్లాస్టిక్ వినియోగాన్ని నివారించి పరిసరాలను శుభ్రంగా పెట్టుకోవాల్సిన ఆవశ్యకతను తెలియజేసేలా రాష్ట్ర ప్రభుత్వం ప్రతినెల మూడవ శనివారం ' స్వర్ణాంధ్ర - స్వచ్ఛాంధ్ర ' కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు చెప్పారు. గ్రామాన్ని పరిశుభ్రంగా పెట్టుకోవాలని, గ్రామంలోని అభివృద్ధి, రెవెన్యూ సంబంధిత సమస్యలను జిల్లా యంత్రాంగం పరిష్కరిస్తుందని ఎమ్మెల్యే చెప్పారు. ఈ పర్యటనలో వారి వెంట డిపిఓ అనుపమ, జిల్లా స్వర్ణ గ్రామ స్వర్ణ వార్డు సచివాలయాల నోడల్ ఆఫీసర్ వెంకటేశ్వరరావు, జడ్పీ సీఈవో చిరంజీవి, డ్వామా పి.డి. జోసఫ్ కుమార్, డిఆర్డిఏ పి.డి. నారాయణ, పశు సంవర్ధక శాఖ జె.డి. వెంకటేశ్వరరావు, పంచాయతీ రాజ్ ఎస్.ఈ. అశోక్, స్థానిక అధికారులు, మాజీ సర్పంచ్ నవులూరి రాజారమేష్ ,ప్రజా ప్రతినిధులు పాల్గొన్నారు.

# సచివాలయంలో మొరాయించిన ప్రింటర్లు..

## ధ్రువీకరణ పత్రాలకు కోసం ప్రజల అవస్థలు...




**పెన్ పవర్ తర్లుపాడు జులై 18:**

తర్లుపాడు మండల కేంద్రంలోని గ్రామ సచివాలయంలో గత కొన్ని రోజులుగా ప్రింటర్లు పనిచేయకపోవడంతో ప్రజలకు అందాల్సిన పలు సేవలు నిలిచిపోయాయి. దీంతో ధ్రువీకరణ పత్రాలు, రెవెన్యూ సంబంధిత సేవల కోసం సచివాలయానికి వచ్చే ప్రజలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. గ్రామ సచివాలయం ద్వారా జారీ చేసే కుల, ఆదాయ, నివాస ధ్రువీకరణ పత్రాలతో పాటు 1-బి, అడంగల్, ఇంటి స్థలాల పట్టాలు తదితర పత్రాల కోసం ప్రతిరోజూ పలువురు ప్రజలు సచివాలయాన్ని ఆశ్రయిస్తున్నారు. అయితే ప్రింటర్లు పనిచేయకపోవడంతో దరఖాస్తులు ఆమోదం పొందినప్పటికీ పత్రాలను ముద్రించి ఇవ్వలేని పరిస్థితి నెలకొంది. దీంతో ప్రజలు నిరాశతో వెనుదిరుగుతున్నారు. తర్లుపాడు గ్రామంతో పాటు సమీపంలోని నాయుడుపల్లె తదితర గ్రామాల నుంచి సుమారు మూడు కిలోమీటర్ల దూరం ప్రయాణించి వచ్చే ప్రజలు సైతం ఇదే సమస్యతో అవస్థలు పడుతున్నారు. ప్రింటర్ల సమస్యను పలుమార్లు మండల అధికారుల దృష్టికి తీసుకెళ్లినప్పటికీ ఇప్పటివరకు పరిష్కారం చూపలేదని సచివాలయ సిబ్బంది తెలిపినట్లు సమాచారం. ప్రింటర్ల సమస్య కారణంగా ప్రభుత్వ సేవలు సకాలంలో అందక ప్రజలు ఇబ్బందులు పడుతున్నందున వెంటనే మరమ్మతులు చేపట్టి సచివాలయ సేవలను యథావిధిగా అందుబాటులోకి తీసుకురావాలని మండల ప్రజలు అధికారులను కోరుతున్నారు.

# గ్రీన్ ఫీల్డ్ హైవే వెలిగొండ ప్రాజెక్ట్ పనులను వేగవంతం చేయాలి

**జిల్లా కలెక్టర్ విజయ సునీత**





**సి ఎస్ పురం, పెన్ పవర్ జూలై 18**

గ్రీన్ ఫీల్డ్ హైవే వెలిగొండ ప్రాజెక్టు పనులను వేగవంతం చేసి పూర్తి చేయాలని మార్కాపురం జిల్లా కలెక్టర్ శ్రీమతి విజయ సునీత అధికారులకు సూచించారు శనివారం మండలంలో ఉప్పలపాడు సమీపంలో నిర్మాణంలో ఉన్న గ్రీన్ ఫీల్డ్ హైవే టన్నెల్ పనులను అలాగే వెలిగొండ ప్రాజెక్టు నిర్మాణ పనులను పరిశీలించారు ఈ సందర్భంగా ఆయా శాఖల అధికారులతో కలిసి క్షేత్రస్థాయిలో సమీక్ష చేపట్టారు పనుల్లో ఉన్న సమస్యలనుగుర్తించి శాఖల మధ్య సమన్వయంతో పనులను వేగవంతం చేసి నిర్ణీత గడువులోపు పూర్తి చేయాలని ఆదేశించారు గత డీఆర్సీ సమావేశంలో గౌరవ శాసనసభ్యులు డాక్టర్ ముక్కు ఉగ్ర నరసింహారెడ్డి వెలిగొండ ప్రాజెక్టు అధికారులు, గ్రీన్ ఫీల్డ్ హైవే అధికారుల మధ్య సమన్వయ లోపం వల్ల పనులు పూర్తిస్థాయిలో జరగడంలేదని ప్రస్తావించడం వల్ల కలెక్టర్ ఈ సమస్యను గుర్తించి వెంటనే అధికారులతో వెలిగొండ అలాగే గ్రీన్ ఫీల్డ్ హైవే ప్రాంతాలను సందర్శించారు కనిగిరి శాసనసభ్యులు డాక్టర్ ముక్కు ఉగ్ర నరసింహ రెడ్డి మాట్లాడుతూ ఈ ప్రాంతంలో అధికారులు బాధ్యతగా పనిచేసే గ్రీన్ ఫీల్డ్ హైవే మరియు వెలిగొండ ప్రాజెక్టు కాలువ పనులను త్వరితగతిన పూర్తి చేయాలని సూచించారు వీరి వెంట ఆయా శాఖల అధికారులతో పాటు సింగిల్ విండో చైర్మన్ చెరుకుపల్లి వెంకటరెడ్డి మండల టిడిపి అధ్యక్షులు బొబ్బూరి రమేష్, టిడిపి జిల్లా కార్యనిర్వ కార్యదర్శి నాగిశెట్టి చెన్నమ్మ మాలకొండయ్య, మన్నేపల్లి శ్రీనివాసులు, జనసేన పార్టీ నాయకులు గూడంశెట్టి రవికుమార్, మన్నేపల్లి కార్తీక్, షేక్ రజ్జాబ్ , పులి రాజశేఖర్, వివిధ శాఖల అధికారులు, తదితరులు పాల్గొన్నారు.

# రాచర్ల కేజీబీవీ పాఠశాలను ఆకస్మికంగా తనిఖీ చేసిన ఎమ్మెల్యే శ్రీ ముత్తుముల అశోక్ రెడ్డి

## మెనూ అమలు చేయక పోవడం, పారిశుద్ధ్య లోపం పట్ల ఆగ్రహం





**గిద్దలూరు పెన్ పవర్ జులై 18**

గిద్దలూరు శాసనసభ్యులు ముత్తుముల అశోక్ రెడ్డి రాచర్ల మండలంలోని కస్తూర్బా గాంధీ బాలికల విద్యాలయంను ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా పాఠశాలలో విద్యాబోధన, విద్యార్థినులకు కల్పిస్తున్న వసతి,భోజన సౌకర్యాలు, పరిశుభ్రత తదితర అంశాలను క్షుణ్ణంగా పరిశీలించారు. అనంతరం విద్యార్థినులతో కలిసి భోజనం చేసి,



భోజనం నాణ్యత, పరిమాణం, మెనూ అమలుపై వివరాలు అడిగి తెలుసుకున్నారు శనివారం మెనూ ప్రకారం పాయసం అందించాల్సి ఉన్నప్పటికీ విద్యార్థినులకు అందించకపోవడంపై ప్రిన్సిపాల్‌ను వివరణ కోరి ఆగ్రహం వ్యక్తం చేశారు . ప్రభుత్వం నిర్దేశించిన మెనూ ప్రకారం ప్రతిరోజూ నాణ్యమైన, తగిన పరిమాణంలో భోజనం అందించాలని స్పష్టం చేశారు. పాఠశాలలోని మరుగుదొడ్లు, స్నానాల గదులను పరిశీలించిన ఎమ్మెల్యే వాటి నిర్వహణపై అసంతృప్తి ఆగ్రహం వ్యక్తం చేశారు. వాటిని ఎప్పటికప్పుడు పరిశుభ్రంగా ఉంచాలని అధికారులను ఆదేశించారు. తరగతి గదుల్లో సరిపడా వెలుతురు లేకపోవడాన్ని గమనించిన ఎమ్మెల్యే, అవసరమైన చోట అదనపు లైట్లు ఏర్పాటు చేయాలని ఆదేశించారు. అలాగే పనిచేయని ఫ్యాన్లను వెంటనే మరమ్మతులు చేయించి విద్యార్థినులకు సౌకర్యవంతమైన వాతావరణం కల్పించాలని సూచించారు. అనంతరం పాఠశాల రికార్డులను పరిశీలించి ఉపాధ్యాయులు, విద్యార్థినుల హాజరును తనిఖీ చేశారు. ఉపాధ్యాయులు, సిబ్బందితో సమావేశమై విద్యాబోధన నాణ్యత, విద్యార్థినుల సంక్షేమం, పాఠశాల పరిశుభ్రత విషయంలో ఎలాంటి నిర్లక్ష్యం లేకుండా విధులు నిర్వహించాలని సూచించారు. పాఠశాలకు అవసరమైన మౌలిక సదుపాయాల కల్పనకు సంబంధించిన ప్రతిపాదనలను ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లి, వాటి పరిష్కారానికి కృషి చేస్తానని ఎమ్మెల్యే ముత్తుముల అశోక్ రెడ్డి హామీ ఇచ్చారు ఈ కార్యక్రమంలో రాచర్ల మండల పార్టీ అధ్యక్షులు కటిక యోగానంద్, మార్కెట్ యార్డ్ చైర్మన్ బైలడుగు బాలయ్య, నల్లబోతుల శ్రీను, సంజీవ్ , నాయకులు, స్థానిక ప్రజాప్రతినిధులు పాల్గొన్నారు.

# చిన్నపాటి వర్షానికే జనార్ధన కాలనీలో జలమయం

*-రోడ్డుపైనే అంగన్‌వాడీ పాఠశాల..*

*నీటిలోంచి వెళ్లాల్సి వస్తున్న చిన్నారులు*

*-డ్రైనేజీ నిర్మించాలని*

*మున్సిపల్ అధికారులకు స్థానికుల విజ్ఞప్తి*



**కందుకూరు పెన్ పవర్, జూలై 18**

కందుకూరు పట్టణంలోని జనార్ధన కాలనీలో చిన్నపాటి వర్షానికే రోడ్లు జలమయమవుతున్నాయి. కరెంట్ ఆఫీస్ పక్క లైన్‌లోని ఆరోవ అడ్డ రోడ్డులో సిమెంట్ రోడ్డు నిర్మించినప్పటికీ డ్రైనేజీ కాలువలు ఏర్పాటు చేయకపోవడంతో వర్షపు నీరు రోడ్డుపైనే నిలిచిపోతోందని స్థానికులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.ఈ రోడ్డు ప్రాంతం కిందకు ఉండటంతో వర్షపు నీరు బయటకు వెళ్లే మార్గం లేక రోజుల తరబడి నిలిచిపోతుందని తెలిపారు. ముఖ్యంగా ఇదే వీధిలో ఉన్న అంగన్‌వాడీ పాఠశాలకు వెళ్లే చిన్నారులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని తల్లిదండ్రులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.చిన్న పిల్లలు నీటిలో నడుచుకుంటూ పాఠశాలకు వెళ్లాల్సిన పరిస్థితి ఏర్పడిందని, వర్షాకాలంలో మరింత ఇబ్బందులుఎదురవుతున్నాయని పేర్కొన్నారు. ఈ సమస్యపై గతంలో పలుమార్లు మున్సిపల్ అధికారుల దృష్టికి తీసుకెళ్లినా ఇప్పటివరకు పరిష్కారం లభించలేదని స్థానికులు తెలిపారు.కందుకూరు పట్టణంలో పలు అభివృద్ధి పనులు జరుగుతున్నప్పటికీ తమ కాలనీలో మాత్రం డ్రైనేజీ సౌకర్యం లేక ఇబ్బందులు పడుతున్నామని వాపోయారు. చిన్నారుల భద్రత, ప్రజల ఆరోగ్యాన్ని దృష్టిలో ఉంచుకుని మున్సిపల్ కమిషనర్ వెంటనే స్పందించి రోడ్డుకు ఇరువైపులా కాలువలు నిర్మించి సమస్యను పరిష్కరించాలని జనార్ధన కాలనీ వాసులు కోరుతున్నారు.

# అంగన్వాడీ కేంద్రాల్లో చక్కటి సేవలు అందించండి

**-అధికారులు, సిబ్బందికి ఎమ్మెల్యే ఇంటూరి సూచన**

**-236 కేంద్రాలకు ఇండక్షన్ స్టవ్ లు పంపిణీ**

**కందుకూరు పెన్ పవర్, జూలై 18:**

అంగన్వాడి కేంద్రాల ద్వారా చిన్నారులు, గర్భిణీలు, బాలింతలకు సేవలు అందించడంలో బాధ్యతగా ఉండాలని కందుకూరు శాసనసభ్యులు ఇంటూరి నాగేశ్వరరావు సూచించారు. విద్యుత్ ఆదా చేయడంలో భాగంగా.... నియోజకవర్గంలోని 236 అంగన్వాడీ కేంద్రాలకు ఇండక్షన్ స్టవ్ లు, వంట పాత్రలను ఎమ్మెల్యే నాగేశ్వరరావు శనివారం పంపిణీ చేశారు. కందుకూరు సెక్టార్ పరిధిలోని వలేటివారిపాలెం మండలంలో 53 కేంద్రాలు, ఉలవపాడు



సెక్టార్ పరిధిలోని మొత్తం 183 కేంద్రాలకు స్టౌలు అందించారు. కూటమి ప్రభుత్వం ఒక్కొక్క అంగన్వాడీ కేంద్రానికి సుమారు 7 వేల రూపాయల విలువ



చేసే వస్తువులను అందిస్తోందని ఎమ్మెల్యే చెప్పారు. చిన్నారుల్లో పోషకాహార లోపం ఉండకూడదనే ఉద్దేశంతో అంగన్వాడీ కేంద్రాలకు ప్రభుత్వం భారీగా నిధులు కేటాయిస్తుందని నాగేశ్వరరావు చెప్పారు. నిధుల సద్వినియోగం జరిగేలా అధికారులు పనిచేయాలని ఆయన సూచించారు. ఎమ్మెల్యే కార్యాలయంలో జరిగిన కార్యక్రమంలో కందుకూరు సిడిపిఓ కే.ఉషారాణి, ఉలవపాడు సిడిపిఓ మాధవీలత, సూపర్వైజర్లు, కార్యకర్తలు పాల్గొన్నారు.

## ప్రత్యేక లోక్ అదాలత్‌లో 14 కేసులకు రాజీ పరిష్కారం



**కందుకూరు పెన్ పవర్, జూలై 18**

స్థానిక కోర్టు ప్రాంగణంలో శనివారం నెగోషియబుల్ ఇన్‌స్ట్రుమెంట్స్ చట్టం (ఎన్‌ఐ యాక్ట్) కింద నమోదైన కేసుల పరిష్కారానికి ప్రత్యేక లోక్ అదాలత్ నిర్వహించారు. రాజీ ద్వారా కేసులను త్వరితగతిన పరిష్కరించి, కక్షిదారులకు న్యాయ ఉపశమనం కల్పించాలనే ఉద్దేశంతో ఈ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ ప్రత్యేక లోక్ అదాలత్ ప్రారంభ కార్యక్రమంలో న్యాయమూర్తులు కే.కే.వి. బుల్లి కృష్ణ, శ్రీమతి డి. దుర్గా కళ్యాణి, కుమారి లంక అన్నపూర్ణ శ్రీ, బార్ అసోసియేషన్ అధ్యక్షుడు వి. శ్రీధర్ నాయుడు పాల్గొన్నారు. లోక్ అదాలత్‌లో విచారణకు వచ్చిన కేసుల్లో పరస్పర అంగీకారంతో 14 కేసులు రాజీ ద్వారా పరిష్కారమయ్యాయి. దీంతో సంబంధిత కక్షిదారులు దీర్ఘకాల న్యాయ ప్రక్రియ నుంచి ఉపశమనం పొందారు. ఈ లోక్ అదాలత్‌లో బెంచ్ సభ్యులుగా న్యాయవాదులు ఎస్.కే. శంషుద్దీన్, జే. కోటేశ్వరమ్మ సేవలందించారు. కార్యక్రమంలో న్యాయవాదులు, కోర్టు సిబ్బంది, కక్షిదారులు పాల్గొన్నారు.

## స్వర్ణాంధ్ర-స్వచ్ఛ ఆంధ్రపై గ్రామస్తులకు అవగాహన

**-కొండముడుసుపాలెంలో కార్యక్రమంలో**

**పాల్గొన్న జిల్లా పంచాయతీ అధికారి కే. అనుపమ**





**కందుకూరు పెన్ పవర్, జూలై 18**

స్వర్ణాంధ్ర--స్వచ్ఛ ఆంధ్ర కార్యక్రమంలో భాగంగా కందుకూరు మండలం కొండముడుసుపాలెం స్వర్ణ గ్రామ కార్యాలయంలో శనివారం అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ప్రకాశం జిల్లా పంచాయతీ అధికారి కే. అనుపమ పాల్గొని గ్రామ ప్రజలకు పరిశుభ్రత, ఆరోగ్య పరిరక్షణపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ప్రతి ఇంటి నుంచి వచ్చే తడి చెత్త, పొడి చెత్తను వేర్వేరుగా సేకరించి గ్రీన్ అంబాసిడర్లకు అందించడం అలవాటు చేసుకోవాలని సూచించారు. పరిశుభ్రమైన గ్రామాల నిర్మాణంతో ప్రజల ఆరోగ్యం మెరుగుపడుతుందని, స్వచ్ఛతను ప్రతి ఒక్కరూ సామాజిక బాధ్యతగా భావించాలని అన్నారు. ప్రభుత్వం గ్రామీణ ప్రజల ఆరోగ్య పరిరక్షణకు ప్రత్యేక ప్రాధాన్యం ఇస్తోందని పేర్కొంటూ, స్వచ్ఛ రథం సేవలను సద్వినియోగం చేసుకుని పరిసరాలను పరిశుభ్రంగా ఉంచాలని గ్రామస్తులకు సూచించారు. ఈ కార్యక్రమంలో స్వర్ణ గ్రామ మండల అధికారి పి. శ్రీనివాసరావు, పంచాయతీ డెవలప్‌మెంట్ అధికారి సీహెచ్. స్వప్న, స్వచ్ఛ భారత్ మండల సమన్వయకర్త మెడబలిమి రమణయ్య, గ్రీన్ అంబాసిడర్లు, సీఆర్పీలు, గ్రామ పెద్దలు, పొరపాటు మహేష్, కార్యాలయ సిబ్బంది పాల్గొని గ్రామ ప్రజలకు స్వర్ణాంధ్ర--స్వచ్ఛ ఆంధ్ర కార్యక్రమం లక్ష్యాలను వివరించారు.

## స్వర్ణాంధ్ర--స్వచ్ఛ ఆంధ్రపై అంగన్‌వాడీ కేంద్రంలో అవగాహన కార్యక్రమం



**కందుకూరు పెన్ పవర్, జూలై 18**

స్వర్ణాంధ్ర--స్వచ్ఛ ఆంధ్ర కార్యక్రమంలో భాగంగా కందుకూరు పట్టణంలోని కోటకట్ట కాలనీ అంగన్‌వాడీ కేంద్రంలో శనివారం అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమం సీడీపీఓ ఉషారాణి ఆదేశాల మేరకు చేపట్టారు. ఈ సందర్భంగా అంగన్‌వాడీ కేంద్రంలోని తల్లులు, అంగన్‌వాడీ టీచర్లు స్నేహలత, హసీనా, సూపర్‌వైజర్ యు. ప్రభావతి పాల్గొన్నారు. సూపర్‌వైజర్ ప్రభావతి మాట్లాడుతూ స్వర్ణాంధ్ర లక్ష్యాల సాధనకు ప్రతి ఒక్కరూ పరిశుభ్రతను పాటించాలని, ప్లాస్టిక్ వినియోగాన్ని తగ్గించాలని సూచించారు. అలాగే ఇంటి వద్దే తడి చెత్త, పొడి చెత్తను వేర్వేరుగా సేకరించడం, పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవడం ద్వారా అనారోగ్య సమస్యలను నివారించవచ్చని వివరించారు. అనంతరం పరిశుభ్రమైన వాతావరణం కోసం కృషి చేస్తామని పాల్గొన్న వారితో ప్రతిజ్ఞ చేయించారు. కార్యక్రమంలో అంగన్‌వాడీ సిబ్బంది, తల్లులు పాల్గొని స్వర్ణాంధ్ర--స్వచ్ఛ ఆంధ్ర కార్యక్రమం విజయవంతానికి సహకరిస్తామని తెలిపారు.

# పోలీసు వ్యవస్థపై అవగాహన పెంచిన శ్రీ సంస్కృతి స్కూల్ కమ్యూనిటీ విజిట్

## -కందుకూరు టౌన్ పోలీస్ స్టేషన్, డీఎస్పీ కార్యాలయాన్ని సందర్శించిన విద్యార్థులు







**కందుకూరు పెన్ పవర్, జూలై 18**

విద్యార్థుల్లో సామాజిక అవగాహన, క్రమశిక్షణ, బాధ్యతాయుత పౌరసత్వ భావన పెంపొందించేందుకు శ్రీ సంస్కృతి స్కూల్ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న కమ్యూనిటీ విజిట్--1 కార్యక్రమంలో భాగంగా విద్యార్థులు కందుకూరు టౌన్ పోలీస్ స్టేషన్, డీఎస్పీ కార్యాలయాన్ని సందర్శించారు. ఈ సందర్భంగా పోలీసు శాఖ విధులు, బాధ్యతలు, ప్రజలకు అందించే సేవలు, అత్యవసర పరిస్థితుల్లో పోలీసుల పాత్రపై ప్రత్యక్ష అవగాహన పొందారు. పోలీసు అధికారులు విద్యార్థులకు ఆత్మీయ స్వాగతం పలికి పోలీస్ స్టేషన్‌లోని రిసెప్షన్, ఉమెన్ హెల్ప్ డెస్క్, లాకప్ గదులు, ఇతర విభాగాలను చూపించి వాటి పనితీరును వివరించారు. అలాగే హ్యాండ్‌కఫ్స్ (బేడీలు), లాఠీ, పోలీస్ క్యాప్, సర్వీస్ గన్, బుల్లెట్లు తదితర పోలీసు పరికరాలను పరిచయం చేసి, వాటి వినియోగంపై అవగాహన కల్పించారు. విద్యార్థులు వాటిని దగ్గరగా పరిశీలించి ఆసక్తిగా సందేహాలను నివృత్తి చేసుకున్నారు. అనంతరం పోలీస్ జీప్, పోలీస్ బైక్, ఇతర వాహనాలు, పోలీస్ స్టేషన్‌లోని సౌకర్యాలను పరిశీలించిన విద్యార్థులకు డయల్-112 అత్యవసర సేవ, ఫిర్యాదు నమోదు విధానం, మహిళలు, చిన్నారుల భద్రత కోసం పోలీసులు చేపడుతున్న చర్యలు, ప్రజలకు అందించే సేవల గురించి అధికారులు వివరించారు. ఈ సందర్భంగా పోలీసు అధికారులు విద్యార్థులను ఉద్దేశించి మాట్లాడుతూ ధైర్యం, క్రమశిక్షణ, నిజాయితీ, సేవాభావం వంటి విలువలను జీవితంలో అలవర్చుకోవాలని సూచించారు. వారి ప్రేరణాత్మక సందేశాలు విద్యార్థులను ఆకట్టుకున్నాయి. ఈ సందర్శన అనంతరం పలువురు విద్యార్థులు భవిష్యత్తులో తాము కూడా ఖాకీ యూనిఫామ్ ధరించి పోలీసు అధికారులుగా దేశానికి సేవ చేయాలనే తమ ఆశయాన్ని వ్యక్తం చేశారు. విద్యార్థుల్లో పోలీసు వ్యవస్థపై గౌరవాన్ని పెంపొందించడంతో పాటు సమాజానికి సేవ చేయాలనే స్ఫూర్తిని నింపడంలో ఈ కమ్యూనిటీ విజిట్ ఎంతో ఉపయోగపడిందని శ్రీ సంస్కృతి స్కూల్ విద్యాసంస్థల చైర్మన్ కొంకా చంద్రశేఖర్ తెలిపారు. ఈ కార్యక్రమాన్ని విజయవంతం చేసేందుకు సహకరించిన కందుకూరు టౌన్ పోలీస్ స్టేషన్, డీఎస్పీ కార్యాలయ అధికారులకు, పోలీసు సిబ్బందికి శ్రీ సంస్కృతి స్కూల్ యాజమాన్యం, ఉపాధ్యాయులు, విద్యార్థులు కృతజ్ఞతలు తెలిపారు. వారి ఆతిథ్యం, మార్గదర్శకత్వం వల్ల ఈ విద్యా సందర్శన విద్యార్థులకు చిరస్మరణీయ అనుభవంగా నిలిచిందని పేర్కొన్నారు.

## ప్రభుత్వమే పొగాకు కొనుగోలు చేయాలి - సంయుక్త కిసాన్ మోర్చా





**కందుకూరు పెన్ పవర్, జూలై 18**

ప్రభుత్వం నేరుగా పొగాకును కొనుగోలు చేసేంత వరకు రైతుల ఉద్యమాన్ని మరింత తీవ్రతరం చేయాలని సంయుక్త కిసాన్ మోర్చా నాయకుడు, ఏఐకేఎస్ జిల్లా ప్రధాన కార్యదర్శి జే. జయంతి బాబు పిలుపునిచ్చారు. శనివారం కందుకూరులోని పామూరు రోడ్డులో గల 27వ పొగాకు వేలం కేంద్రాన్ని సంయుక్త కిసాన్ మోర్చా జిల్లా నాయకత్వ బృందం సందర్శించి, చుండి క్లస్టర్ రైతులతో మాట్లాడింది. ఈ సందర్భంగా జయంతి బాబు మాట్లాడుతూ కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు రూ.1,000 కోట్లు కేటాయించి రైతుల వద్ద ఉన్న పొగాకును ప్రభుత్వమే కొనుగోలు చేయాలని డిమాండ్ చేశారు. రైతులకు గిట్టుబాటు ధర లభించేలా క్వింటాల్‌కు కనీసం రూ.25 వేల ధర నిర్ణయించాలని కోరారు. పొగాకు ద్వారా ప్రభుత్వాలకు వేల కోట్ల రూపాయల ఆదాయం వస్తున్నప్పటికీ రైతులు తీవ్ర నష్టాలను ఎదుర్కొంటున్నారని అన్నారు. గతంలో ప్రభుత్వం నో-బిడ్‌లు లేకుండా చూస్తామని, రైతుల వద్ద ఉన్న మొత్తం పొగాకును కొనుగోలు చేస్తామని హామీ ఇచ్చినా ఇప్పటికీ పరిస్థితిలో మార్పు రాలేదని విమర్శించారు. గిట్టుబాటు ధర సాధించే వరకు ఉద్యమాన్ని కొనసాగిస్తామని, రెండో దశ పోరాటంలో వలేటివారిపాలెం, లింగసముద్రం, కందుకూరు మండలాల రైతులందరూ పాల్గొనాలని ఆయన పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో సంయుక్త కిసాన్ మోర్చా నాయకులు వి. హనుమారెడ్డి, జిల్లా కన్వీనర్ చుండూరి రంగారావు, సీఐటీయూ నాయకులు జీవీబీ కుమార్, వాసుబాబు తదితరులు పాల్గొన్నారు.

## విద్యాబోధన పటిష్టం చేయడానికే ఉపాధ్యాయ శిక్షణ -డీవైఈవో రవి





**కందుకూరు పెన్ పవర్, జూలై 18**

ఉపాధ్యాయులు నిరంతరం కొత్త విషయాలను నేర్చుకుంటూ వాటిని తరగతి గదిలో అమలు చేసి విద్యార్థులను ఉత్తమ ప్రతిభావంతులుగా తీర్చిదిద్దాలని కందుకూరు డీవైఈవో టి. రవి సూచించారు. శనివారం స్థానిక జిల్లా పరిషత్ బాలుర, బాలికల ఉన్నత పాఠశాలల్లో భాషాయేతర సబ్జెక్టుల ఉపాధ్యాయులకు ఒకరోజు శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా అకడమిక్ క్యాలెండర్, టీచర్స్ హ్యాండ్‌బుక్స్, స్టూడెంట్ అసెస్‌మెంట్ బుక్‌లెట్స్, పాఠ్యాంశ సంస్కరణలు, ప్రోగ్రెస్ కార్డులు, వంద రోజుల కార్యాచరణ ప్రణాళిక, లీప్, ప్రశస్త యాప్‌ల వినియోగం తదితర అంశాలపై శిక్షణ అందించారు. ఈ సందర్భంగా డీవైఈవో రవి మాట్లాడుతూ శిక్షణలో నేర్చుకున్న అంశాలను బోధనలో సమర్థవంతంగా అమలు చేసి విద్యార్థులు మెరుగైన ఫలితాలు సాధించేలా కృషి చేయాలని సూచించారు. త్వరలో తెలుగు, ఇంగ్లీష్, హిందీ ఉపాధ్యాయులకు కూడా ప్రత్యేక శిక్షణ నిర్వహిస్తామని, తేదీలను తర్వాత ప్రకటిస్తామని తెలిపారు. శిక్షణ కార్యక్రమంలో ఎస్ఆర్పీలు డి. సుధాకర్, ఎం. సురేష్, డీఆర్పీలు ఎస్.కే. మస్తాన్ వలి, ఎం. జనార్ధనరావు, పి.వి. రమణయ్య, పి.వి. పద్మావతి, ఓ. ఆదిశేషయ్య, జి. మధుసూదన్ రావు, జి. ఐజాక్ బాబు, కె. శ్రీనివాసులు, ఎం.వి. సుబ్బయ్య, కె. మాధవ, ఎం.వి. నారాయణ, యల్లమంద, ఎస్.డి. మునీర్ భాషా, జె. సుబ్బారావు శిక్షణ అందించారు. అలాగే ప్రత్యేక ఉపాధ్యాయులు ఎం. శ్రీహరి, ఐఈఆర్పీ కూనం ఉదయలక్ష్మి ప్రశస్త యాప్ వినియోగంపై ఉపాధ్యాయులకు అవగాహన కల్పించారు.

## ప్రజాస్వామ్య స్ఫూర్తితో నాగార్జున పబ్లిక్ స్కూల్‌లో హెడ్ బాయ్- హెడ్ గర్ల్ ఎన్నికలు






**కందుకూరు పెన్ పవర్, జూలై 18**

విద్యార్థుల్లో ప్రజాస్వామ్య విలువలు, నాయకత్వ లక్షణాలు, బాధ్యతాయుతమైన నిర్ణయాలు తీసుకునే సామర్థ్యాన్ని పెంపొందించే లక్ష్యంతో కందుకూరులోని నాగార్జున పబ్లిక్ స్కూల్లో 2026--27 విద్యా సంవత్సరానికి హెడ్ బాయ్, హెడ్ గర్ల్ ఎన్నికలను ప్రజాస్వామ్య పద్ధతిలో నిర్వహించారు. ఈ కార్యక్రమాన్ని పాఠశాల డైరెక్టర్ వి. షాలిని రెడ్డి ప్రారంభించి మాట్లాడుతూ, ప్రజాస్వామ్యంలో ప్రతి ఓటుకు ఎంతో విలువ ఉందని, మంచి నాయకుడిని ఎన్నుకోవడంలో ఓటు కీలకమని విద్యార్థులకు వివరించారు. విద్యార్థి దశ నుంచే ప్రజాస్వామ్య విలువలను అలవర్చుకోవడం ద్వారా భవిష్యత్తులో బాధ్యతాయుతమైన పౌరులుగా ఎదగవచ్చని ఆమె పేర్కొన్నారు. ఎన్నికల ప్రక్రియను నామినేషన్ల స్వీకరణ, అభ్యర్థుల పరిచయం, ప్రచారం, రహస్య ఓటింగ్, ఓట్ల లెక్కింపు వంటి దశల్లో పారదర్శకంగా నిర్వహించారు. విద్యార్థులు ఉత్సాహంగా తమ ఓటు హక్కును వినియోగించి ప్రజాస్వామ్య స్ఫూర్తిని చాటిచెప్పారు. పుస్తక విద్యతో పాటు నాయకత్వం, క్రమశిక్షణ, బాధ్యత, నిర్ణయ సామర్థ్యం వంటి జీవన నైపుణ్యాలను పెంపొందించేందుకు ఇటువంటి కార్యక్రమాలు దోహదపడతాయని పాఠశాల యాజమాన్యం పేర్కొంది. ఈ కార్యక్రమంలో పాఠశాల ప్రిన్సిపాల్ డి. శివకుమార్, యాజమాన్య సభ్యులు వి. మర్రెడ్డి, కె. శ్రీనివాస్, ఉపాధ్యాయులు, సిబ్బంది, విద్యార్థులు పాల్గొన్నారు. ఎన్నికైన హెడ్ బాయ్, హెడ్ గర్ల్ ప్రతినిధులను అభినందించిన యాజమాన్యం, విద్యార్థుల సంక్షేమం కోసం బాధ్యతాయుతంగా పనిచేయాలని ఆకాంక్షించింది.

## యోగా టీచర్ సేవకు సన్మానించిన ఎమ్మెల్యే ముత్తుముల అశోక్ రెడ్డి

**గిద్దలూరు పెన్ పవర్ జులై 18**



గిద్దలూరు పట్టణంలో ఆధ్యాత్మికంగా స్వచ్ఛందంగా సేవా కార్యక్రమాలు నిర్వహిస్తున్న ఆర్ట్ ఆఫ్ లివింగ్ యోగా టీచర్ బి యస్ నారాయణరెడ్డి జి హెచ్ ఆర్ ఏ సి సి పి సి ఐ టి హ్యూమన్ రైట్స్ రాష్ట్ర గౌరవ అధ్యక్షులు గ్లోబల్ అక్రిడిటేషన్ కౌన్సిల్ జర్మనీ ఇంటర్నేషనల్ పీస్ యూనివర్సిటీ చే గౌరవ డాక్టరేట్ అందుకున్న సందర్భంగా బొమ్మరిల్లు ఫర్నిచర్ షాప్ యజమాని చంద్రశేఖర్ రెడ్డి స్నేహితుల ఆధ్వర్యంలో స్థానిక శాసనసభ్యులు ముత్తుముల అశోక్ రెడ్డి ఘనంగా సత్కరించారు. డాక్టరేట్ అవార్డ్ ను ఎమ్మెల్యే అశోక్ రెడ్డి కి చూపించారు. ఆయన మాట్లాడుతూ కడప జిల్లా మిద్దెల గ్రామం నుండి వచ్చి గిద్దలూరు లో ఏళ్ల తరబడి ఆధ్యాత్మికంగా గిద్దలూరు లో మంచి కార్యక్రమాలు చేస్తూ అందరిని కలుపుకొని ప్రపంచ ప్రఖ్యాతిగాంచిన ఆధ్యాత్మిక గురువు ఆర్ట్ ఆఫ్ లివింగ్ వ్యవస్థాపకులు రవిశంకర్ గురూజీ శిష్యులుగా సేవ చేయడం గొప్ప విషయమన్నారు ప్రతి మనిషి దగ్గర మన్ననలను పొందుతున్న నారాయణరెడ్డిని సత్కరించడం అభినందనీయమన్నారు. అందరం ముందుండి సేవా కార్యక్రమాలను నడిపిద్దామని తెలిపారు. నన్ను గుర్తించి సత్కరించినందుకు గిద్దలూరు శాసనసభ్యులు ముత్తుముల అశోక్ రెడ్డి కి కృతజ్ఞతలు. నారాయణ రెడ్డి తెలిపారు.

## గిద్దలూరు పెయింటర్ వర్కర్స్ యూనియన్ నాయకులు జె.ఆబేలుకు నివాళులు

**గిద్దలూరు పెయింటర్ సంఘం అధ్యక్ష కార్యదర్శులు బట్టి శేఖర్ ఆర్ట్స్, సగినాల మోషే**



**గిద్దలూరు పెన్ పవర్ జులై 18**

గిద్దలూరు మున్సిపల్ పరిధిలోని 16వ వార్డు పాముర్రుపల్లె గ్రామంలో గత 40 సంవత్సరాలుగా పెయింటర్ పని చేస్తూ అనారోగ్య కారణాలు చనిపోయిన జాన అబెల్ కు నివాళులర్పించి మట్టి ఖర్చుల నిమిత్తం 15000 రూపాయలు వారి కుటుంబానికి అందించారు . ఈ సందర్భంగా పెయింటర్ సంఘం అధ్యక్షు కార్యదర్శులు బట్టి శేఖర్ ఆర్ట్స్, సగినాల మోషే మాట్లాడుతూ జానా ఆవేలు గత పది సంవత్సరాల నుండి గిద్దలూరులో పెయింటర్స్ సమస్యలపై పనిచేయడం పెయింట్స్ సంఘానికి ఎంతో కృషి చేసినారని అన్నారు. వారి మరణం సంఘానికి తీరనిలోటని అన్నారు. కుటుంబానికి ప్రగడ సానుభూతి తెలియజేస్తున్నామన్నారు. కార్యక్రమంలో పెయింటర్ సంఘం ట్రెజరర్ బి బాబు నాయకులు బి రవి, చెన్నకేశవులు ,ఎస్కే కాసిం పీరా ఏ రాఫాల్ సిఐటియు నాయకులు బి నరసింహులు, ఈ తామస్ తదితరులు పాల్గొన్నారు.

# ఆక్స్‌ఫర్డ్ స్కూల్‌లో ఘనంగా హౌస్ ఇనాగరేషన్









**కందుకూరు పెన్ పవర్ జూలై 18**

పట్టణంలోని స్థానిక బి.ఆర్.ఆక్స్‌ఫర్డ్ స్కూల్‌లో విద్యార్థుల నాయకత్వ నైపుణ్యాలను పెంపొందించేందుకు ఉద్దేశించిన 'హౌస్ ఇనాగరేషన్' వేడుక శనివారం వైభవంగా నిర్వహించారు. విద్యార్థులను నాలుగు హౌస్‌లుగా విభజించిన ఈ కార్యక్రమం అనంతరం పాఠశాల యాజమాన్యం విలేకరుల సమావేశం నిర్వహించింది. ఈ సందర్భంగా బి.ఆర్.ఆక్స్ ఫర్డ్ విద్యాసంస్థల చైర్మన్ శ్రీ ఉన్నం భాస్కర రావు మాట్లాడుతూ.. నేటి ప్రపంచ పోటీని తట్టుకోవడానికి విద్యార్థులు పాఠశాల స్థాయి నుంచే ఇంగ్లీష్ భాషపై పూర్తి పట్టు సాధించాలని, అది వారి కెరీర్‌కు బలమైన పునాది అని పేర్కొన్నారు. విద్యాసంస్థల డైరెక్టర్ జి. బాల భాస్కర రావు మాట్లాడుతూ.. విద్యార్థుల్లో ఇంగ్లీష్ కమ్యూనికేషన్, క్రమశిక్షణను మరింత పెంపొందించడానికి పాఠశాలలో ప్రత్యేకంగా ప్రవేశపెట్టిన 'కాయిన్ సిస్టమ్' ప్రాధాన్యతను వివరించారు. ముఖ్య అతిథి, ప్రముఖ మోటివేషనల్ స్పీకర్ అబ్దుల్ అజీజ్ మాట్లాడుతూ..ప్రస్తుత కాలంలో నిత్య జీవితంలో 'మోడరన్ ఇంగ్లీష్', 'కమ్యూనికేషన్ స్కిల్స్' కలిగి ఉండటం ఎంతో ముఖ్యమని పిలుపునిచ్చారు. ఈ విద్యా ప్రమాణాలను క్షేత్రస్థాయిలో విద్యార్థులకు అందిస్తూ, వారిని ఉత్తమ పౌరులుగా తీర్చిదిద్దడంలో కీలక పాత్ర పోషిస్తున్న పాఠశాల డీన్, ప్రిన్సిపాల్స్ మరియు టీచర్స్ అందరికీ యాజమాన్యం ప్రత్యేక ధన్యవాదాలు, అభినందనలు తెలియజేసింది. ఈ కార్యక్రమంలో విద్యాసంస్థల కరస్పాండెంట్ బండి వెంకటేశ్వర్లు, డైరెక్టర్ బి.నరేంద్ర బాబు,పాఠశాల డీన్, ప్రిన్సిపాల్స్ సిబ్బంది, విద్యార్థులు పాల్గొన్నారు.

## స్వర్ణ ఆంధ్ర - స్వచ్ఛ ఆంధ్ర లక్ష్య సాధనలో ప్రజల భాగస్వామ్యం ఎంతో కీలకం

### ఎమ్మెల్యే ముత్తుముల అశోక్ రెడ్డి





**గిద్దలూరు పెన్ పవర్ జూలై 18**

గిద్దలూరు పురపాలక సంఘం పరిధిలోని పొట్టి శ్రీరాములు రోడ్డులో కీర్తి మెడికల్ స్టోర్ సమీపంలో నిర్వహించిన " స్వర్ణ ఆంధ్ర - స్వచ్ఛ ఆంధ్ర " కార్యక్రమంలో భాగంగా చేపట్టిన "బల్క్ వేస్ట్ జనరేటర్ల గుర్తింపు , లెక్కింపు ప్రచార కార్యక్రమంలో శాసన సభ్యులు ముత్తుముల అశోక్ రెడ్డి పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే అశోక్ రెడ్డి స్వయంగా రోడ్లు , పరిసర ప్రాంతాలు చీపురుతో ఊడ్చి శుభ్రంచేసి స్వచ్ఛ ఆంధ్ర ప్రతిజ్ఞ చేశారు అనంతరం ఎమ్మెల్యే మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం స్వచ్ఛమైన , పరిశుభ్రమైన ఆంధ్రప్రదేశ్ నిర్మాణమే లక్ష్యంగా స్వర్ణ ఆంధ్ర -- స్వచ్ఛ ఆంధ్ర కార్యక్రమాన్ని ప్రతిష్టాత్మకంగా అమలు చేస్తోందన్నారు. పెద్ద మొత్తంలో వ్యర్థాలను ఉత్పత్తి చేసే సంస్థలు, వ్యాపార సముదాయాలు, హోటళ్లు, ఫంక్షన్ హాళ్లు తదితర బల్క్ వేస్ట్ జనరేటర్లను గుర్తించి , వ్యర్థాల నిర్వహణను శాస్త్రీయంగా చేపట్టడం ద్వారా పరిశుభ్రతను మరింత మెరుగుపరచవచ్చని తెలిపారు. ప్రజలందరూ పరిశుభ్రతను తమ బాధ్యతగా భావించి పరిసరాలు శుభ్రంగా ఉంచుకోవాలని దోమలు వల్ల కానీ మరే ఇతర విషయాల వల్ల అంటు వ్యాధులు రాకుండా చూసుకోవాలని తెలిపారు ప్రభుత్వ కార్యక్రమాలకు ప్రజలు సహకరించాలని ఎమ్మెల్యే పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో నియోజకవర్గ, మండల, పట్టణ ప్రముఖులు, ప్రజాప్రతినిధులు, నాయకులు, పురపాలక అధికారులు , స్థానిక వ్యాపారస్తులు పాల్గొన్నారు.

## డా. గ్రీష్మ పావని కి శుభాకాంక్షలు

### బి.సి సంఘాల నాయకులు

**గిద్దలూరు పెన్ పవర్ జులై18**

గిద్దలూరు ప్రభుత్వ ప్రాంతీయ వైద్యశాలలో గైనకాలజిస్టుగా నియమితులైన డా. గ్రీష్మ పావని ని పలువురు బీసీ సంఘాల నాయకులు శనివారం కలిసి బొకే యిచ్చి శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా కంచర్ల కోటయ్య గౌడ్ మాట్లాడుతూ మారుమూల ప్రాంతమైన గిద్దలూరు ప్రాంతీయ వైద్యశాలలో డా. బివి రంగారావు, డా. మేడిశెట్టి సావిత్రి దంపతుల కోడలు డా. గ్రీష్మ పావని ని గైనకాలజిస్టుగా నియమించడం శుభపరిణామమని తెలిపారు. ఈ సందర్భంగా డా. గ్రీష్మ పావని మాట్లాడుతూ గిద్దలూరు ప్రాంత ప్రజలకు తాను శక్తి వంచన లేకుండా మెరుగైన వైద్య సేవలు అందిస్తానని చెప్పారు. ఈ కార్యక్రమంలో తొండమల్ల బ్రహ్మయ్య, కుసుమాల మహానంది యాదవ్, కె.వి స్వామి కొండయ్య, చందా శ్రీనివాసులు, మద్దికట్ల ఈశ్వరయ్య, రెడగాని వెంకటేశ్వర్లు, కె. చిన్న బ్రహ్మయ్య, గుంటూరు డేవిడ్ తదితరులు పాల్గొన్నారు.



# విద్యుత్ కోతలు చీకటి తొలగించాలి

### సోలార్ విద్యుత్ పై సందేహాలు తొలగించాలి.

### విద్యుత్ లోక్ అదాలత్ అవగాహన సదస్సులో వినియోగదారుల విజ్ఞప్తి.





**సింగరాయకొండ, జరుగుమల్లి జులై 18,పెన్ పవర్**


ప్రజల సంక్షేమం అభివృద్ధి కోసం పనిచేసే ప్రభుత్వాలకు చెడ్డపేరు రాకుండా ప్రజా ప్రాధాన్యత లో గ్రామాల లో చీకటి లేకుండా చర్యలు చేపట్టాలని విద్యుత్ వినియోగ దారులు విద్యుత్ లోక్ అదాలత్ వినియోగ దారుల అవగాహన సదస్సులో సి జి ఆర్ ఎఫ్ చైర్మన్ ఎన్ విక్టర్ ఇమ్మానియల్ తో మొర పెట్టుకున్నారు. ఎ పి సి పి డి సి ఎల్ కందుకూరు డివిజన్ ఆద్వర్యం లో సింగరాయకొండ శ్రీనివాస కళ్యాణ మండలం లో ఏర్పాటు చేసిన విద్యుత్ అదాలత్ వినియోగ దారుల అవగాహన సదస్సులో ఆయన పాల్గొన్నారు. ఈ కార్యక్రమాన్ని సూపరెండెంటేంట్ ఇంజనీర్ కట్టా వెంకటేశ్వర్లు పర్యవేక్షించారు. ఈ సందర్భంగా వివిధ ప్రాంతాలకు చెందిన విద్యుత్ వినియోగదారులు వారి వారి విద్యుత్ సమస్యలను ప్రస్తావించి పరిష్కరించు కున్నారు. ఈ సందర్భంగా సి జి ఆర్ టి చైర్మన్ విక్టర్ ఇమ్మానియల్ మాట్లాడుతూ ఇది స్వతంత్ర సంస్థ అని వినియోగ దారుల సమస్యలు పరిష్కరించేందుకు న్యాయం చేసేందుకు చర్యలు తీసుకుంటామన్నారు. ఈ సందర్భంగా విద్యుత్ వినియోగ దారుల నుండి 36 విన్నపాలు వచ్చాయని వాటి లో అన్ని కూడా చీకటిని తొలగించాలని రావడం పరిస్థితి తీవ్రతను స్పష్టం చేస్తుందని ఆయన ఆవేదన వ్యక్తం చేశారు. విద్యుత్ అధికారులు వినియోగ దారుల ప్రధాన సమస్య చీకటి తొలగించడం పై ప్రత్యేక దృష్టి పెట్టాలని సూచించారు. అంతే కాకుండా ప్రభుత్వం ప్రతిష్మాత్మకంగా తీసుకుని అమలు చేస్తున్న సోలార్ విద్యుత్ పథకం పై వినియోగదారులలో ఉన్న అపోహాలను తొలగించడం ఉత్పన్నం అవుతున్న అనుమానాల నివృత్తి పై అవగాహన కల్పించాలని ప్రత్యేకంగా దృష్టికి తెచ్చారన్నారు. సోలార్ విద్యుత్ పై సందేహాలు నివృత్తి చేసేందుకు అవగాహన కల్పించేందుకు అవసరమైన చర్యలు తీసుకోవాలని కందుకూరు డివిజన్ విద్యుత్ అధికారులకు సూచించారు. ఈ సందర్భంగా విద్యుత్ లోక అదాలత్ సభ్యులు ఎస్ ఇ కట్టా వెంకటేశ్వర్లు,సాంకేతిక సభ్యుడు డి కృష్ణ నాయక్,ఆర్థిక సభ్యులు కె.కృష్ణ,స్వతంత్ర సభ్యులు ఎ . సునీత,డి ఇ వీరయ్య కందుకూరు విద్యుత్ డివిజన్ అధికారులు, సిబ్బంది, విద్యుత్ వినియోగ దారులు పాల్గొన్నారు.

# వైద్యులు సమాజానికి ఆదర్శంగా నిలవాలి

### - అడిషనల్ సివిల్ జడ్జి వి. రామకృష్ణ

### - ఒంగోలు ప్రభుత్వ వైద్య కళాశాలలో (జీఎంసీ) డ్రగ్ అవేర్‌నెస్ సెమినార్ నిర్వహణ





**క్రైమ్ రిపోర్టర్ పెన్ పవర్, ఒంగోలు జూలై 18**

మత్తు పదార్థాల వినియోగం వల్ల కలిగే మానసిక ఆరోగ్య సమస్యలు, వాటి దుష్పరిణామాలపై అవగాహన కలిగి ఉండటంతో పాటు, డ్రగ్స్‌ను చట్టవిరుద్ధంగా సరఫరా చేయడం, నిల్వ చేయడం, వినియోగించడం వంటి చర్యలకు చట్ట ప్రకారం విధించే కఠిన శిక్షలపై అవగాహన పెంపొందించుకోవడం ద్వారా యువత డ్రగ్స్‌కు దూరంగా ఉండగలదని ఒంగోలు సివిల్ జడ్జి వి. రామకృష్ణ పేర్కొన్నారు. శనివారం ఒంగోలు ప్రభుత్వ వైద్య కళాశాలలో (జీఎంసీ) డ్రగ్ అవేర్‌నెస్ సెమినార్ నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన సివిల్ జడ్జి వి. రామకృష్ణ మాట్లాడుతూ సమాజంలో అత్యంత ప్రభావశీల వర్గమైన వైద్యులు, వైద్య విద్యార్థులు తమ ప్రవర్తనతో ఇతరులకు ఆదర్శంగా నిలవాలని ఆయన సూచించారు. యువత మత్తు పదార్థాలకు బానిస కాకుండా అప్రమత్తంగా ఉండాలని, చట్టాలపై అవగాహన ప్రతి ఒక్కరికీ అవసరమని అన్నారు. ఈ కార్యక్రమానికి ప్రభుత్వ వైద్య కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ శ్రీవాణి అధ్యక్షత వహించారు. ఆమె మాట్లాడుతూ వైద్య విద్యార్థులు ఆరోగ్యవంతమైన జీవనశైలిని అలవర్చుకొని సమాజానికి స్ఫూర్తిగా నిలవాలని, మత్తు పదార్థాలకు పూర్తిగా దూరంగా ఉండాలని సూచించారు. కార్యక్రమంలో ప్రభుత్వ సర్వజన ఆసుపత్రి ఇంచార్జీ సూపరింటెండెంట్ డాక్టర్ నామినేని కిరణ్ మాట్లాడుతూ మత్తు పదార్థాల వినియోగం వల్ల వ్యక్తి శారీరక, మానసిక ఆరోగ్యంతో పాటు కుటుంబం, సమాజం పైనా తీవ్ర ప్రభావం పడుతుందని వివరించారు. మనోవైద్య విభాగం అసోసియేట్ ప్రొఫెసర్ డాక్టర్ సాయి కిరణ్ మత్తు పదార్థాల వల్ల కలిగే మానసిక ఆరోగ్య సమస్యలు, వ్యసనం లక్షణాలు, చికిత్సా విధానాలపై విద్యార్థులకు అవగాహన కల్పించారు. డిప్యూటీ సూపరింటెండెంట్ ఆఫ్ పోలీస్ రాయపాటి శ్రీనివాసరావు మాట్లాడుతూ మత్తు పదార్థాల అక్రమ రవాణా, సరఫరా, వినియోగాన్ని అరికట్టేందుకు పోలీసులు తీసుకుంటున్న చర్యలు, చట్టపరమైన నిబంధనలు, శిక్షల గురించి వివరించారు. ప్రతి పౌరుడు డ్రగ్స్ నిర్మూలనలో భాగస్వామి కావాలని పిలుపునిచ్చారు. సైకియాట్రీ వైద్యులు డాక్టర్ సబ, ఇతర సిబ్బంది పాల్గొన్నారు.

# అంగన్వాడీ కేంద్రాల్లో ఇండక్షన్ స్టౌవ్, వంట సామాగ్రి పంపిణీ -ఎమ్మెల్యే ముత్తుముల

**గిద్దలూరు పెన్ పవర్ జులై 18**



గిద్దలూరు పట్టణంలోని ఇంటి గ్రేటెడ్ చైల్డ్ డెవలప్ మెంట్ సర్వీసెస్ కార్యాలయం లో ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు గ్యాస్ వినియోగం తగ్గించడం కోసం ప్రతిష్టత్మకంగా ఏర్పాటు చేసిన ఇండక్షన్ స్టవ్ , వాటి సంబంధిత వంట పాత్రాలు పంపిణీ శనివారం " ఎమ్మెల్యే ముత్తుముల అశోక్ రెడ్డి చేతుల మీదుగా అంగన్వాడీ సిబ్బంది కి పంపిణీ చేశారు గ్యాస్ వాడకాన్ని తగ్గించేందుకు అన్ని అంగన్వాడీ కేంద్రాలకి ఇండక్షన్ స్టవ్, వాటి సంబంధిత వంట పాత్రలు, ప్రెషర్ కుక్కర్ లు ఇవ్వడం జరిగింది దీని యొక్క ముఖ్య ఉద్దేశం గ్యాస్ సిలిండర్ ధర పెరగడం రానున్న రోజుల్లో గ్యాస్ ధర పెరగడం , కొరత ఏర్పడటం వలన గ్యాస్ వాడకాన్ని తగ్గించడం తక్కువ టైం లో పిల్లలకు, బాలింతలకు వేడి వేడిగా పౌష్టికాహారం అందించడశీ సిలిండర్ తో పోలిస్తే ఖర్చు కూడా తక్కువ అవుతుందని ప్రాజెక్టు పరిధిలోని 233 అంగన్వాడీ కేంద్రాలకు అన్నిటికి ఇండక్షన్ స్టవ్ లు సంబంధిత వంట పాత్రలు , ప్రెషర్ కుక్కర్ లు అందించారు కార్యక్రమంలో గిద్దలూరు నియోజకవర్గం , పట్టణంలోని ప్రముఖులు, నాయకులు, తదితరులు పాల్గొన్నారు.

## ఉద్యోగుల సమస్యల పరిష్కారం కోరుతూ ఆర్టీసీ డిపోలో ధర్నా

### -ఏపీపీటీడీ ఎంప్లాయిస్ యూనియన్ ఆధ్వర్యంలో నిరసన




**కందుకూరు పెన్ పవర్, జూలై 18**

ఉద్యోగులు ఎదుర్కొంటున్న సమస్యలను పరిష్కరించాలని డిమాండ్ చేస్తూ కందుకూరు ఆర్టీసీ డిపోలో ఏ.పీ.పీ.టీ.డి. ఎంప్లాయిస్ యూనియన్ ఆధ్వర్యంలో శనివారం ధర్నా నిర్వహించారు. డిపో కార్యదర్శి ఎం.ఎస్.ఎన్. రాజు అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమంలో ఉద్యోగులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఎం.ఎస్.ఎన్. రాజు మాట్లాడుతూ ఉద్యోగుల సమస్యలపై యాజమాన్యం సానుకూలంగా స్పందించి తక్షణమే పరిష్కార చర్యలు చేపట్టాలని కోరారు. ఎర్నింగ్ సెక్షన్‌లో ఏ.డీ.సీల సంఖ్యను తగ్గించే విధానాన్ని విరమించి, గతంలో ఉన్న విధానాన్ని కొనసాగించాలని డిమాండ్ చేశారు. అలాగే హైదరాబాద్ తిరుగు సర్వీసుల డ్రైవర్ల మస్టర్ల తగ్గింపు విధానాన్ని నిలిపివేయాలని, కాలం చెల్లిన టీఐఎం యంత్రాల స్థానంలో కొత్త టీఐఎంలను అందుబాటులోకి తీసుకురావాలని కోరారు. రద్దు చేసిన సర్వీసులను పునరుద్ధరించాలని, గ్యారేజ్ ఉద్యోగులను ఇబ్బందులకు గురిచేస్తున్న ఎంఎఫ్ విధానంపై విజిలెన్స్ విచారణ జరిపి చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. మెకానిక్‌లకు అవసరమైన ఆధునిక పనిముట్లు (టూల్స్) అందించాలని, ఉద్యోగులకు మెరుగైన పని వాతావరణం కల్పించాలని నాయకులు కోరారు. ఈ సందర్భంగా సీసీఎస్ డెలిగేట్ ఎన్. సుబ్బారావు, గ్యారేజ్ కార్యదర్శి స్వామి, గ్యారేజ్ అధ్యక్షుడు రహమతుల్లా మాట్లాడుతూ ఉద్యోగుల న్యాయమైన డిమాండ్లను పరిష్కరించడంలో యాజమాన్యం నిర్లక్ష్యం చేయరాదని అన్నారు. ఈ ధర్నా కార్యక్రమంలో శివకృష్ణ, ఖాజావలి, సుధాకర్, మల్లికార్జున, ఉమాదేవి, మాధవరావు, ప్రభాకర్, వినోద్, వెంకటేశ్వర్లు, హరికృష్ణ తదితర ఉద్యోగులు పాల్గొన్నారు.

## నృసింహుని సేవలో ఎమ్మెల్యే ఇంటూరి



**వలేటివారిపాలెం, పెన్ పవర్ జూలై 18**

అయ్యవారి పల్లి పంచాయతీ పరిధిలోని మాలకొండ లో వెలసియున్న శ్రీ మాల్యాద్రి లక్ష్మీనరసింహస్వామిని ఎమ్మెల్యే ఇంటూరి నాగేశ్వరరావు దర్శించుకున్నారు. ఆలయ అధికారులు ఆలయ మర్యాదలతో స్వాగతం పలికారు. ఎమ్మెల్యే ఇంటూరి నాగేశ్వరరావు దర్శించుకోని ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం మాలకొండపై అందుతున్న సౌకర్యాల గురించి ఎమ్మెల్యే భక్తులను అడిగి తెలుసుకున్నారు. ముఖ్యంగా భక్తులందరికీ అన్నదానం అందేలా జాగ్రత్తలు తీసుకోవాలని ఈవో శ్రీనివాసరెడ్డికి సూచించారు.

## జగన్ 2.ఓ విప్లవాత్మక వేదిక

### వైస్సార్సీపీ రాష్ట్ర అధికార ప్రతినిధి, ఎమ్మెల్యే తాటిపర్తి చంద్రశేఖర్







**ఆర్ సి ఇంచార్జి యర్రగొండపాలెం పెన్ పవర్ జులై 18**

వైస్సార్సీపీ యాక్టివిస్టులు సానుభూతి పరులపై జరుగుతున్న దాడులను, కుట్రలను తిప్పి కొట్టెందుకు, విప్లవాత్మకప్లాట్ ఫామ్ ను జగనన్న ఏర్పాటు చేసారని, ఇక ఎవ్వడు మమ్మల్ని ఆపలేడని, ఆంక్షలు ఉండవని వైస్సార్సీపీ రాష్ట్ర అధికార ప్రతినిధి, ఎమ్మెల్యే తాటిపర్తి చంద్రశేఖర్ అన్నారు. శనివారం పార్టీ కార్యాలయంలో జగన్ 2.పోస్టర్, స్కానార్ ను ఆయన ఆవిష్కరించారు. ఈ సందర్బంగా ఎమ్మెల్యే తాటిపర్తి మాట్లాడుతు వైసీపీ కార్యకర్తల గొంతు నొక్కెందుకు జరుగుతున్న కుట్రలను తిప్పికొట్టెందుకు మన అధినేత వై యస్ జగన్మోహనరెడ్డి, మన పార్టీ నాయకులకు, కార్యకర్తలకు, సానుభూతి పరులకు అండగా స్వంత ప్లాట్ ఫామ్ ను ఏర్పాటు చేయడం వెన్ను తట్టి ప్రోత్సహించడమే అని అన్నారు. జగన్ 2.ఓ యాప్ ద్వారా కూటమి ప్రభుత్వం వైసీపీ నాయకులపై, కార్యకర్తలపై చేస్తున్నా దుర్మార్గపు, అరాచకాలపై ఉక్కుపాదం మొపెందుకు విప్లవాత్మకప్లాట్ ఫామ్దోహదపడుతుందని అన్నారు. జగనన్న అభిమానులు, కార్యకర్తలు, నాయకులు ఒక వేదిక పైకి వచ్చి సమన్వయంతో పనిచేయడానికి ఈ యాప్ కీలక పాత్ర పోషిస్తుందని అన్నారు. అనంతరం జగన్ 2.ఓ యాప్ ను ఆవిష్కరించారు, ఈ కార్యక్రమం లో మండల పార్టీ అధ్యక్షులు ఏకుల ముసలారెడ్డి, వైస్సార్సీపీ జిల్లా ఉపాధ్యక్షులు ఒంగోలు మూర్తి రెడ్డి, పట్టణ అధ్యక్షులు కందూరి కాశీ విశ్వనాధ్,నాయకులు, తమ్మినేని సత్తిరెడ్డి, యర్రం రెడ్డి వెంకటేశ్వరరెడ్డి,ఆళ్ల ఆంజినేయ రెడ్డి,సురే వెంకట రమేష్,కొప్పర్తి ఓబుల్ రెడ్డి, సయ్యద్ జాబివుల్లా,కాకుమాను సురేష్, పల్లే సరళ కుమారి,తదితరులు తరులు పాల్గొన్నారు.

## దళితవాడలో సమస్యలను పరిష్కరించాలి



**సి ఎస్ పురం, పెన్ పవర్ జూలై 18**

దళితవాడలో నెలకొన్న సమస్యలను వెంటనే పరిష్కరించాలని కెవిపిఎస్ వ్యవసాయ కార్మిక సంఘం నాయకులు తెలిపారు సామాజిక శంఖారావం పేరుతో కేవీపీఎస్ వ్యవసాయ కార్మిక సంఘం రెండు సంఘాల ఆధ్వర్యంలో దళితవాడ సమస్యలపై అధ్యయనం చేసే కార్యక్రమంలో భాగంగా శనివారం మండలంలోని రేగులచెలుక గ్రామంలో ఎస్సీ కాలనీలో పర్యటించారు అక్కడి ప్రజల స్థితిగతుల గురించి అడిగి తెలుసుకున్నారు మౌలిక సదుపాయాలు కల్పించడంలో ప్రభుత్వాలు పూర్తిగా విఫలమయ్యాయని ఆ సంఘాల నాయకులువిమర్శించారు కాలనీలో రోడ్లో అధ్వానంగా ఉన్నాయని పేదలకు ఇల్లు కూడా లేవని గుర్తించారు రోడ్లపైనే మురుగునీరు ప్రవహిస్తునడంతో కాలనీవాసులు నానా ఇబ్బందులు పడుతున్నారని వెంటనే వారి సమస్యలు పరిష్కరించాలని ఆయా సంఘాల నాయకులు డిమాండ్ చేశారు ఈ కార్యక్రమంలో ఆయా సంఘాల నాయకులు కలివేల థామస్ నగరికంటి ఆంథోనీ విడతల రాజు, బోయిన ఆశీర్వాదం తదితరులు పాల్గొన్నారు.

## గ్రూప్-2 ప్రిలిమినరీ పరీక్షల ఉచిత శిక్షణ

### - దరఖాస్తుల గడువు 25 వరకు పొడిగింపు

### - ఏపీ బి.సి.స్టడీ సర్కిల్ జిల్లా సంచాలకులు యస్. నిర్మలా జ్యోతి

**కలెక్టరేట్ పెన్ పవర్, ఒంగోలు జూలై 18**

ఎ.పి.పి.యస్.సి. గ్రూప్-2 ప్రిలిమినరీ పరీక్షల ఉచిత శిక్షణకు ఉమ్మడి ప్రకాశం జిల్లాకు చెందిన అర్హులైన బి.సి., యస్.సి., యస్.టి. అభ్యర్థుల నుండి దరఖాస్తుల స్వీకరణ గడువును ఈ నెల 25 వ తేదీ వరకు పొడిగించినట్లు ఏపీ బి.సి.స్టడీ సర్కిల్ జిల్లా సంచాలకులు యస్. నిర్మలా జ్యోతి ఒక ప్రకటనలో తెలియజేశారు. అభ్యర్థుల యొక్క ఎంపిక విధానం డిగ్రీ లో వచ్చిన మార్కుల మెరిట్ ఆధారంగా ఎంపిక చేయడం జరుగుతుందని తెలిపారు. ఎంపికైన అభ్యర్థులకు ఈ నెల 30 వ తేది నుండి 2 నెలల పాటు ఉచిత శిక్షణ ఉంటుందని, ఉచిత శిక్షణతో పాటు స్టైఫండ్, స్టడీ మెటీరియల్ ఇవ్వడం జరుగుతుందని, మొత్తం 100 మంది అభ్యర్థులను ఎంపిక చేయడం జరుగుతుందని తెలిపారు. అర్హులైన అభ్యర్థులు తమ బయోడేటా తోపాటు ఎస్.ఎస్.సి , ఇంటర్, డిగ్రీ, కుల ధృవీకరణ, ఆదాయ ధృవీకరణ,( తల్లిదండ్రుల వార్షిక ఆదాయం లక్ష రూపాయల లోపు మాత్రమే) ఆధార్, బ్యాంకు పాస్ బుక్, రెండు పాస్ పోర్ట్ సైజ్ ఫోటోలతో ఈ నెల 25వ తేదిలోపు జిల్లా కలెక్టరు కార్యాలయం ఎదురుగా ఉన్న గవర్నమెంట్ ఆఫీస్ కాంప్లెక్స్ లో ఉన్నటువంటి ఎ.పి.బి.సి.స్టడీ సర్కిల్, ఒంగోలు నందు దరఖాస్తు చేసుకొనవలసినదిగా తెలిపారు. ఇతర వివరములకు ఎ.పి.బి.సి. స్టడీ సర్కిల్, ఒంగోలు, ప్రకాశం జిల్లా ఆఫీసు ఫోన్ నెంబర్- 99892 85530, 89850 90926 ను సంప్రదించాలని కోరారు.

## బసిరెడ్డిపాలెం హైస్కూలు విద్యార్థులకు షైనింగ్ స్టార్స్ అవార్డులు



**గుడ్లూరు, పెన్ పవర్, జులై 18:**

మండలంలోని బసిరెడ్డిపాలెం జడ్.పీ.హెచ్.ఎస్ పాఠశాల విద్యార్థులు ఇద్దరికి షైనింగ్ స్టార్స్ అవార్డులు వరించాయి. ఈ అవార్డులు అందుకున్న వారిలో మామిడాల వెంకట ప్రేమ్ కుమార్, యాళ్ల గీత ఉన్నారు. బసిరెడ్డిపాలెం హైస్కూలు విద్యార్థులు ఇద్దరికి ఈ షైనింగ్ స్టార్స్ అవార్డులు రావడంపై పలువురు హర్షం వ్యక్తం చేస్తున్నారు. అవార్డులు సాధించిన ఇద్దరు విద్యార్థులు ప్రేమ్ కుమార్, గీత లను పాఠశాల పక్షాన ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యాయులు, ఉపాధ్యాయేతర సిబ్బంది మరియు గ్రామ నాయకులు, పిల్లల తల్లిదండ్రులు, పాఠశాల విద్యార్థిని,విద్యార్థులు ప్రత్యేక అభినందనలు తెలియజేశారు.

## లోక్ అదాలత్ లో చెక్ బౌన్స్ కేసుల పరిష్కారం

**గిద్దలూరు పెన్ పవర్ జులై 18**

ఆంధ్రప్రదేశ్ స్టేట్ లీగల్ సర్వీసెస్ అథారిటీ , ప్రకాశం జిల్లా న్యాయ సేవాధికారి సంస్థ ఆదేశముల మేరకు శనివారం గిద్దలూరు కోర్టుల ప్రాంగణంలో చెక్ బౌన్సు కేసుల పరిష్కారము కొరకు ప్రత్యేక లోక్ అదాలత్ నిర్వహించడం జరిగినది.ప్రిసైడింగ్ ఆఫీసర్ లుగా ప్రిన్సిపల్ జూనియర్ సివిల్ జడ్జి ఏ.ఓంకార్ ,మరియు అడిషనల్ జ్యుడీషియల్ మెజిస్ట్రేట్ ఆఫ్ ఫస్ట్ క్లాస్ కె. భరత్ చంద్ర, రెండు బెంచులకు జి. ఆనంద్ కుమార్, డి ,కేశవ, ఏం. పిచ్చయ్య మరియు జె.రంగమోహన్ న్యాయవాదులు మెంబర్లు గా వ్యవహరించారు .లక్షా నలభై మూడు వేల రూపాయలకు ఒక కేసు పరిష్కారమైనది.ఈ కార్యక్రమంలో న్యాయవాదులు, కక్షిదారులు మరియు కోర్టుల సిబ్బంది పాల్గొన్నారు.



# పేదలకు సాయం చేయడంలో ముందుండాలి

### -ఎమ్మెల్యే ఇంటూరి నాగేశ్వరరావు -కందుకూరులో ఆర్ఆర్ఆర్ కేంద్రాన్ని ప్రారంభించిన ఎమ్మెల్యే

### -పాత వస్తువులను సేకరించడం పేదలకు అందించడమే లక్ష్యం -మార్కెట్ సెంటర్, గుండంకట్ట పరిసరాల పరిశీలన







**కందుకూరు పెన్ పవర్, జూలై 18:**

కందుకూరు మున్సిపాలిటీ, స్కందపురి సేవాసమితి ఆధ్వర్యంలో కందుకూరు పట్టణంలోని కూరగాయల మార్కెట్ సెంటర్ లో వస్తు పునర్వినియోగ కేంద్రాన్ని కందుకూరు ఎమ్మెల్యే ఇంటూరి నాగేశ్వరరావు శనివారం సాయంత్రం ప్రారంభించారు. దాతల నుంచి పాత బట్టలు, పుస్తకాలు, ఆట వస్తువులు మొదలైన వాటిని సేకరించి, పేదలకు అందించడమే ముఖ్య ఉద్దేశంగా ఈ కేంద్రాన్ని ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా కేంద్రంలోని పలు వస్తువులను ఎమ్మెల్యే పరిశీలించారు. దాతలు ఇచ్చిన వస్తువులను క్రమ పద్ధతిలో నిల్వచేసి, అవసరమైన వారికి అందజేయాలని నిర్వాహకులకు సూచించారు. ప్రతి ఇంట్లో పనికిరాని, వినియోగంలో లేని వస్తువులు అనేకం ఉంటాయని, వాటిని ఈ కేంద్రానికి తీసుకువచ్చి ఇస్తే పేదలకు సాయం చేసిన వారవుతారని ఎమ్మెల్యే అన్నారు. పేదలకు సహాయం చేసే విషయంలో ప్రతి ఒక్కరు ముందుండాలన్నారు. కార్యక్రమాన్ని చేపట్టిన స్కందపురి సేవా సమితి సభ్యులను ఎమ్మెల్యే అభినందించారు. పలువురు పేదలకు ఆయన స్వయంగా వస్తువులు పంపిణీ చేశారు. అనంతరం గుండంకట్ట ప్రాంతాన్ని ఎమ్మెల్యే పరిశీలించారు. ప్రస్తుతం గుణ్ణంకట్ట అభివృద్ధికి నిధులు విడుదలైనందున, వాటిని ఏ విధంగా ఖర్చు చేయాలన్న దానిపై కమిషనర్ అనూష, ఇంజనీరింగ్ అధికారులకు పలు సూచనలు చేశారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ కమిషనర్. కే అనూష, ఏఎంసీ చైర్మన్ రాయపాటి సుభాషిని, పట్టణ టిడిపి అధ్యక్షుడు దామా మల్లేశ్వరరావు, రాష్ట్ర విశ్వబ్రాహ్మణ కార్పొరేషన్ డైరెక్టర్ చిలకపాటి మధు, స్కంధపురి సేవా సమితి చైర్మన్ పువ్వాడి మౌనిక, పార్టీ నాయకులు కంద్రా మాల్యాద్రి, షేక్ రూబీ, షేక్ సలాం, బెజవాడ ప్రసాద్, రాయపాటి శ్రీను, షేక్ రఫీ, షేక్ మున్నా, షేక్ నజీర్, ఖాదర్ బాషా, వడ్డెళ్ళ రవిచంద్ర, ఖుద్దూస్ తదితరులు పాల్గొన్నారు.

## స్వర్ణాంధ్ర-స్వచ్ఛాంధ్ర నిర్వహించిన జిల్లా పోలీసులు





**క్రైమ్ రిపోర్టర్ పెన్ పవర్, ఒంగోలు జూలై 18**

ప్రతి నెల మూడో శనివారం నిర్వహించే పర్యావరణ పరిరక్షణ కార్యక్రమంలో భాగంగా, రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన స్వర్ణ ఆంధ్ర--స్వచ్ఛ ఆంధ్ర కార్యక్రమాన్ని ప్రకాశం జిల్లా ఎస్పీ వి. హర్షవర్ధన్ రాజు, ఆదేశాల మేరకు జిల్లా పోలీస్ కార్యాలయంలో అడిషనల్ ఎస్పీ (అడ్మిన్) ఎన్.యుగంధర్, ఎఆర్ అడిషనల్ ఎస్పీ జి. నాగేశ్వరరావు, అలాగే జిల్లాలోని అన్ని పోలీస్ స్టేషన్లలో పోలీస్ అధికారులు, సిబ్బంది స్వర్ణ ఆంధ్ర--స్వచ్ఛ ఆంధ్ర కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా పోలీస్ కార్యాలయం, పోలీస్ స్టేషన్ ప్రాంగణాలతో పాటు పరిసర ప్రాంతాలను శుభ్రపరిచి, చెత్తను తొలగించారు. పనిముట్లతో పిచ్చి మొక్కలను తొలగించారు. పరిశుభ్రతకు ప్రాధాన్యం ఇస్తూ పర్యావరణ పరిరక్షణకు కృషి చేస్తున్నారు. అడిషనల్ ఎస్పీ (అడ్మిన్) ఎన్. యుగంధర్ మాట్లాడుతూ, మన చుట్టుపక్కల పరిసరాలు పరిశుభ్రంగా ఉంటేనే ఆహ్లాదకరమైన, ఆరోగ్యకరమైన వాతావరణం నెలకొంటుందని తెలిపారు. పరిశుభ్రమైన వాతావరణం మానసిక ప్రశాంతతను పెంపొందించి, విధులను మరింత సమర్థవంతంగా, క్రమశిక్షణతో నిర్వర్తించేందుకు దోహదపడుతుందన్నారు. పరిసరాలను పరిశుభ్రంగా ఉంచడం ప్రతి ఒక్కరి బాధ్యత అని, అదే లక్ష్యంతో జిల్లాలోని అన్ని పోలీస్ స్టేషన్లలో ఈ కార్యక్రమాన్ని నిర్వహించినట్లు తెలిపారు. అనంతరం అధికారులు, సిబ్బందితో కలిసి స్వచ్ఛత కార్యక్రమాల్లో పాల్గొని, స్వర్ణ ఆంధ్ర--స్వచ్ఛ ఆంధ్ర ప్రతిజ్ఞ చేశారు. ఈ కార్యక్రమంలో ఎఆర్ డిఎస్పీ శ్రీనివాసరావు, ఆర్ఐ సీతారామిరెడ్డి, ఆర్ ఎస్సైలు, సిబ్బంది పాల్గొన్నారు.

# చెత్త రహిత గ్రామాలే లక్ష్యం

### చెత్త సేకరణ, విభజనపై అవగాహన పెంచుకోవాలని పిలుపు

### అధికారులతో కలిసి శామీరపాలెం గ్రామంలో పర్యటించిన ఎమ్మెల్యే నాగేశ్వరరావు

### అభివృద్ధి బాధ్యత నేను చూసుకుంటా - స్వచ్ఛతకు మీరు సహకరించండి






**వలేటివారిపాలెం, పెన్ పవర్ జూలై 18**

వలేటివారిపాలెం మండలం శామీరపాలెం గ్రామంలో రాత్రి పల్లె నిద్ర అనంతరం కలెక్టర్ రాజాబాబు తో కలిసి ఎమ్మెల్యే ఇంటూరి నాగేశ్వరరావు ,సబ్ కలెక్టర్ హిమవంశీ , స్థానిక నేతలు గ్రామంలో పర్యటించారు. ప్రజలు గ్రామంలో ఎదుర్కొంటున్న సమస్యలను ప్రత్యక్షంగా చూపించారు. వీ.బీ జి రామ్ పథకం ద్వారా జరుగుతున్న పనులను పరిశీలించి కూలీలతో మాట్లాడారు. సచివాలయానికి వెళ్లే రోడ్డులో వాగుపై బ్రిడ్జి నిర్మించాలని గ్రామస్తులు కలెక్టర్ రాజబాబు ను అడిగారు. గ్రామం నుంచి విప్పగుంట వెళ్లే రోడ్డు, తూములేరు వాగు వెంబడి రోడ్డు, గతంలో కొట్టుకుపోయిన చెక్ డ్యామ్ బండ్ నిర్మిస్తామని చెప్పారు. ఆది ఆంధ్ర కాలనీ స్మశానం ఆక్రమణలు తొలగించి, రోడ్డు ఏర్పాటు చేయాలని కాలనీవాసులు కలెక్టర్ కు విజ్ఞప్తి చేశారు. సుమారు 400 ఎకరాలు చుక్కల భూములుగా రికార్డుల్లో నమోదై, ఇబ్బందులు పడుతున్నామని గ్రామస్తులు చెప్పడంతో.... నెల రోజుల్లో పరిష్కరిస్తామని కలెక్టర్ తెలిపారు. కలెక్టర్ రాజాబాబు మాట్లాడుతూ తడి చెత్త, పొడిచెత్తను వేరుచేసి పారిశుధ్య సిబ్బందికి ఇవ్వాలని సూచించారు. గ్రామంలో చాలాచోట్ల ప్లాస్టిక్ వ్యర్థాలను గుర్తించిన ఆయన గ్రామాలను స్వచ్ఛంగా తయారు చేయటానికి ప్రజలు సహకరించాలని కోరారు. ఎమ్మెల్యే ఇంటూరి నాగేశ్వరరావు మాట్లాడుతూ కేవలం ఇంటి పరిసరాలు శుభ్రంగా ఉంటే సరిపోదు. వీధులలో చెత్త వేయకుండా చూసుకోవాలి. చిన్నపిల్లలకు కూడా క్యాన్సర్ వస్తుందంటే, దానికి ప్లాస్టిక్ వస్తువుల వాడకమే ప్రధాన కారణం. గ్రామాలను అభివృద్ధి చేసే బాధ్యత తాను తీసుకుంటాను. అదే సమయంలో ప్రజలు కూడా చైతన్యం పొంది స్వచ్ఛ గ్రామాల కోసం సహకరించాలి... అని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో మండల టిడిపి అధ్యక్షుడు మాదాల లక్ష్మీ నరసింహం, మాజీ సర్పంచ్ నవులూరి రాజా రమేష్, పార్టీ నాయకులు తానికొండ రమణయ్య, దామా చెంచునాయుడు, అనుమోలు సుధాకర్, నేతి నరసింహం, జడ రవీంద్ర, కాకుమాని హర్ష, తదితరులు పాల్గొన్నారు.

## లక్ష్మీ నరసింహస్వామికి వైభవంగా పల్లకి సేవ

**సి ఎస్ పురం, పెన్ పవర్ జూలై 18**



కేటీఆర్ టెక్నో స్కూల్ ప్రాంగణంలో వేంచేసియున్న శ్రీ లక్ష్మీ నరసింహస్వామి ఆలయంలో దేవస్థాన కమిటీ ఆధ్వర్యంలో శనివారం శ్రీ లక్ష్మీ నరసింహస్వామి వారికి పల్లకి సేవాకార్యక్రమాలు వైభవంగా నిర్వహించారు. దేవస్థానం అర్చకులు చోడా వీరభద్రస్వామి పూజలు నిర్వహించి భక్తులుకు తీర్థప్రసాదాలు అందజేశారు. ఈ సందర్భంగా భక్తులకు పెన్నా కొండలు ధర్మపత్ని గురు ప్రసన్న, కుమార్తెలు మా జనని, గగనశ్రీ తల్లిదండ్రులు మాలకొండయ్య, గురవమ్మలు అల్పాహారం అందించారు. ఈ కార్యక్రమంలో దేవస్థానం కమిటీ అధ్యక్షులు కుందురు తిరుపతిరెడ్డి , కార్యదర్శి కొప్పరపు సత్యాలు, కోశాధికారి ఉప్పాల నరశింహారావు, జాయింట్ సెక్రటరీ ఉప్పాల సుబ్బారావు, కమిటీ సభ్యులు నున్నా శ్రీ నివాసులు, పైడిమర్రి ప్రసాదు, శ్రీరాం సురేష్, వేమాధర్మ, గంగిరెడ్డి మాలకొండారెడ్డి, మునగా ప్రసాదు, కుందూరు వెంకటేశ్వరరెడ్డి , కంబాలదిన్నె శ్రీనివాసులు తదితరులు పాల్గొన్నారు.

## రైతులకు 'ఐసీహెచ్ 5' ఆముదం విత్తనాల పంపిణీ



**పెద్దారవీడు పెన్ పవర్ జులై 18**

రైతులకు నూతన వంగడాలను పరిచయం చేసే ఉద్దేశంతో కృషి విజ్ఞాన కేంద్రం దర్శి ఆధ్వర్యంలో పెద్దారవీడు మండల పరిధిలోని తోకపల్లి రైతు సేవా కేంద్రంలో ఆముదం పంటకు చెందిన కొత్త రకం 'ఐసీహెచ్ 5' విత్తనాలను 30 మంది రైతులకు పంపిణీ చేశారు.కృషి విజ్ఞాన కేంద్రం హెడ్, ప్రధాన శాస్త్రవేత్త డాక్టర్ జి. రమేష్ మాట్లాడుతూ.. ఈ ఏడాది పెద్దారవీడు మండలంలో రైతులకు నూతన వంగడాలను అలవాటు చేయడానికి ఈ విత్తనాలను అందిస్తున్నట్లు తెలిపారు. ఈ కొత్త రకం ఆముదం పంట పచ్చ దోమ, బూజు తెగుళ్లను సమర్థవంతంగా తట్టుకుని, రైతులకు మంచి దిగుబడిని ఇస్తుందని ఆయన వివరించారు.

**తక్కువ నీటితో పండే పంటలను సాగు చేయాలి**

మరో శాస్త్రవేత్త వెంకటేశ్వర్ రెడ్డి మాట్లాడుతూ.. వాతావరణ శాఖ ముందస్తు హెచ్చరికల ప్రకారం ఈ ఏడాది వర్షపాతం తక్కువగా నమోదైందని పేర్కొన్నారు. అందువల్ల రైతులు తక్కువ నీటితో పండే మినుము, పెసర, ఆముదం, రాగులు, కొర్రలు వంటి ఆరుతడి పంటలను సాగు చేసుకోవాలని సూచించారు.

**యాప్ ద్వారానే ఎరువుల పంపిణీ.. ఈనెల 31 లోపు పంట బీమా!**

జిల్లా వ్యవసాయ అధికారి బాలాజీ నాయక్ మాట్లాడుతూ జిల్లాలో ఎరువుల కొరత లేదని స్పష్టం చేశారు. 'ఏపీ ఏఐఎంఎస్ 2.0'యాప్ ద్వారా మాత్రమే యూరియా, డీఏపీలను పంపిణీ చేస్తామని రైతులకు సూచించారు.మండల వ్యవసాయ అధికారి ఎన్. లక్ష్మీనారాయణ మాట్లాడుతూ.. ఖరీఫ్ 2026 సంవత్సరానికి గానూ వాతావరణ ఆధారిత పంటల బీమా పథకం (జతీశీజా ×అంబతీఘఅఎవ) గడువును ఈ నెల 31 వరకు పొడిగించారని, పంటలు వేయబోయే రైతులందరూ తప్పనిసరిగా ఇన్సూరెన్స్ చేయించుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో రైతు సేవా కేంద్ర సిబ్బంది భావన, వ్యవసాయ విస్తరణ అధికారి సౌజన్య, రిలయన్స్ ఫౌండేషన్ ప్రతినిధులు మరియు స్థానిక రైతులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

## చక్రాయపాలెంలో స్వచ్ఛ ఆంధ్ర అవగాహన కార్యక్రమం

### భారీ వ్యర్థాల నిర్వహణ, పరిశుభ్రతపై ప్రజలకు దిశానిర్దేశం





**అద్దంకి, ఆర్.సి(పెన్ పవర్) జూలై 18:**

స్వచ్ఛ ఆంధ్ర - స్వర్ణాంధ్ర లక్ష్య సాధనలో భాగంగా అద్దంకి మండలం, చక్రాయపాలెం గ్రామంలో పారిశుధ్య అవగాహన కార్యక్రమం నిర్వహించారు. గ్రామంలోని ప్రజలకు భారీ వ్యర్థాల నిర్వహణ, పరిసరాల పరిశుభ్రతపై అధికారులు, నాయకులు ప్రత్యేక అవగాహన కల్పించారు. స్వచ్ఛ ఆంధ్ర కార్యక్రమంలో భాగంగా ప్రజలకు అందుతున్న సేవలపై, స్వయంచాలక ఫోన్ సందేశాల ద్వారా వచ్చే సమాచారంపై వివరించారు. గ్రామంలో పారిశుధ్యం మెరుగుపరిచేందుకు ప్రతి ఒక్కరూ భాగస్వాములు కావాలని కోరారు. ఈ కార్యక్రమంలో మండల పరిషత్ అభివృద్ధి అధికారి వరూధిని, తహసీల్దార్ శ్రీ చరణ్, ఉప మండల అభివృద్ధి అధికారి మస్తాన్ శ్రీధర్, స్వచ్ఛ ఆంధ్ర సంచాలకులు, స్వర్ణ గ్రామం సిబ్బంది, ప్రజాప్రతినిధులు, స్థానిక ప్రజలు పాల్గొన్నారు.

# యువతకు నైపుణ్యాభివృద్ధితో పాటు మెరుగైన ఉపాధికి జాబ్ మేళా

## – ఏపీ మారిటైమ్ బోర్డు చైర్మన్ దామచర్ల సత్యనారాయణ

## – టంగుటూరు ఎంపీడీఓ కార్యాలయంలో విజయవంతంగా మెగా జాబ్ మేళా







**కలెక్టరేట్ పెన్ పవర్, ఒంగోలు జూలై 18**

రాష్ట్ర ప్రభుత్వం యువతకు నైపుణ్యాభివృద్ధితో పాటు మెరుగైన ఉపాధి అవకాశాలు కల్పించేందుకు నిరంతరం కృషి చేస్తోందని, ఉద్యోగాల కోసం ఎదురుచూస్తున్న యువత ఇలాంటి జాబ్ మేళాలను సద్వినియోగం చేసుకుని తమ భవిష్యత్తును తీర్చిదిద్దుకోవాలని ఏపీ మారిటైమ్ బోర్డు చైర్మన్ దామచర్ల సత్యనారాయణ సూచించారు. ఏపీ రాష్ట్ర నైపుణ్యాభివృద్ధి సంస్థ (ఏపీ ఎస్ ఎస్ డి సి) ఆధ్వర్యంలో టంగుటూరు ఎంపీడీఓ కార్యాలయంలో నిర్వహించిన మెగా జాబ్ మేళా శనివారం విజయవంతంగా ముగిసింది. జిల్లాలోని వివిధ ప్రాంతాల నుంచి పెద్ద సంఖ్యలో నిరుద్యోగ యువతీ, యువకులు హాజరై ప్రముఖ సంస్థల ఇంటర్వ్యూలలో పాల్గొన్నారు. నియోజకవర్గ ప్రత్యేక అధికారి రవికుమార్ మాట్లాడుతూ, యువత తమ విద్యార్హతలకు అనుగుణంగా లభించే ప్రతి అవకాశాన్ని వినియోగించుకుని స్వయం ఉపాధి లేదా ఉద్యోగాలను పొందేందుకు ముందుకు రావాలని అన్నారు. టంగుటూరు తహసీల్దార్ మాట్లాడుతూ, ప్రభుత్వ శాఖలు నిర్వహిస్తున్న ఉపాధి కార్యక్రమాలను నిరుద్యోగ యువత తప్పకుండా వినియోగించుకోవాలని సూచించారు. టంగుటూరు ఎంపీడీఓ దేవసేన కుమారి మాట్లాడుతూ, గ్రామీణ ప్రాంత యువతకు ఉపాధి అవకాశాలను చేరువ చేయాలనే లక్ష్యంతో ఇటువంటి కార్యక్రమాలు నిర్వహిస్తున్నామని తెలిపారు. మాజీ సర్పంచ్ జయంత్, మాజీ సర్పంచ్ మమత, మాజీ ఎంపీపీ చంద్రశేఖర్, రాష్ట్ర యువజన కార్యదర్శి వెంకటేశ్వర్లు మాట్లాడుతూ, తమ నైపుణ్యాలను పెంపొందించుకొని ఉద్యోగ అవకాశాలను అందిపుచ్చుకోవాలని, ప్రభుత్వం ఏపీ ఎస్ ఎస్ డి సి అందిస్తున్న సేవలను సద్వినియోగం చేసుకోవాలని పిలుపునిచ్చారు. ఈ జాబ్ మేళాలో వివిధ రంగాలకు చెందిన ప్రముఖ సంస్థలు పాల్గొని అభ్యర్థులకు ప్రత్యక్ష ఇంటర్వ్యూలు నిర్వహించాయి. కార్యక్రమంలో పాల్గొన్న నిరుద్యోగ యువతకు ఉద్యోగ అవకాశాలు కల్పించడంలో ఈ జాబ్ మేళా కీలక వేదికగా నిలిచింది. కార్యక్రమంలో ప్రజాప్రతినిధులు, అధికారులు, సంస్థల ప్రతినిధులు, నిరుద్యోగ యువతీ, యువకులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు. కార్యక్రమంలో 13 కంపెనీలు పాల్గొనగా 189 మంది హాజరవ్వగా 85 మంది సెలెక్ట్ అయ్యారు.

# బ్రాహ్మణ విద్యార్థులకు పుస్తకాలు పెన్నులు పంపిణీ





**కల్చరల్ రిపోర్టర్, పెన్ పవర్ ఒంగోలు జూలై 18**

బ్రాహ్మణ సేవా సమితి ఆధ్వర్యంలో శనివారం రంగారావు చెరువు వద్ద బ్రాహ్మణ సేవా సమితి కమ్యూనిటీ హాల్ లో బ్రాహ్మణ విద్యార్థిని, విద్యార్థులకు పుస్తక వితరణ కి దాతలు కామరాజు గడ్డ కాశి బాబు, కామరాజుగడ్డ కుసుమ కుమారి, ఆదిపూడి గిరిజ శాండిల్య, కే. మారుతి వినయ్, సాక్షి సుజాత ల సహకారంతో బ్రాహ్మణ సేవా సమితి సభ్యుల సహకారంతో విద్యార్థిని, విద్యార్థులకు పుస్తక వితరణ, పెన్నులు అందజేశారు. బ్రాహ్మణ సేవా సమితి ఉపాధ్యక్షులు మద్దులూరి హరి ప్రేమ, మహంకాళి శేషయ్య, గంజాం రంగనాథ్ ప్రసాద్, మైనంపాటి సాయికుమార్, ముక్తినూతలపాటి వాసు, కొండపాటూరి అప్పారావు, వాడరేవు రామ్మోహన్ రావు, శనగవరపు సుబ్బయ్య, శ్రీనివాస శాస్త్రి, మాచిరాజు శ్రీనివాసరావు, ఉప్పలపాటి వంశీ, బాలసుబ్రమణ్యం, నాగేశ్వరరావు, నరసింహారావు, ఎస్ ఫణీంద్ర విద్యార్థినీ విద్యార్థులకు పుస్తక వితరణ చేశారు.

# నాసరమ్మ ను పరామర్శించిన ప్రవీణ్ కుమార్ రెడ్డి



**గిద్దలూరు పెన్ పవర్ జులై 18**

రాచర్ల మండలం అనుమలవీడు గ్రామానికి చెందిన నాసరమ్మను వైసీపీ నాయకులు ఏపీ స్టేట్ ఎగ్జిక్యూటివ్ కౌన్సిల్ మెంబర్ ప్రవీణ్ కుమార్ రెడ్డి పరామర్శించారు. ఇటీవల అనారోగ్య సమస్యలతో బాధపడుతూ ఆసుపత్రులలో ఆపరేషన్ చేయించుకుని విశ్రాంతి తీసుకుంటున్న నాసరమ్మను వారి కుటుంబ సభ్యులను ప్రవీణ్ కుమార్ రెడ్డి పరామర్శించి ఆరోగ్య పరిస్థితిని అడిగి తెలుసుకున్నారు.

# అక్రమ సంబంధం నేపథ్యమే పాత మాగులూరు హత్యకు కారణం -నిందితుడు విష్ణువర్ధన్ అరెస్ట్




**సంతమాగులూరు, పెన్ పవర్, జూలై 18**

సంతమాగులూరు మండలంలోని పాత మాగులూరు గ్రామంలో ఈనెల 16న జరిగిన సంచలన హత్య కేసును పోలీసులు ఛేదించి ప్రధాన నిందితుడు చల్లా విష్ణువర్ధన్‌ను శనివారం అరెస్ట్ చేశారు. కుటుంబ సంబంధాలు, అక్రమ సంబంధాల నేపథ్యంలో చోటుచేసుకున్న ఈ ఘటన గ్రామంలో తీవ్ర చర్చనీయాంశంగా మారింది. సర్కిల్ ఇన్‌స్పెక్టర్ పి. శేషగిరిరావు తెలిపిన వివరాల ప్రకారం, మృతుడు సజ్జల పిచ్చిరెడ్డి గత నాలుగు సంవత్సరాలుగా నిందితుడి తల్లి వెంకటేశ్వరమ్మతో అక్రమ సంబంధం కొనసాగిస్తున్నాడు. ఈ విషయంపై విష్ణువర్ధన్ గతంలో పలుమార్లు తన తల్లిని, పిచ్చిరెడ్డిని హెచ్చరించడంతో పాటు మృతుడితో రెండుసార్లు గొడవ కూడా పడినట్లు విచారణలో వెల్లడైంది.గత గురువారం తెల్లవారుజామున 4 గంటల సమయంలో పిచ్చిరెడ్డి వెంకటేశ్వరమ్మ ఇంటికి వెళ్లగా, సూళ్లూరుపేట నుంచి ఇంటికి చేరుకున్న విష్ణువర్ధన్ వారిద్దరినీ కలిసి చూడడంతో తీవ్ర ఆగ్రహానికి గురయ్యాడు. దీంతో పిచ్చిరెడ్డిని హత్య చేయాలనే ఉద్దేశంతో రాయితో నుదుటిపై బలంగా కొట్టాడు. గాయాలతో అక్కడి నుంచి పరుగులు తీసిన పిచ్చిరెడ్డిని వెంబడించిన విష్ణువర్ధన్, పాత మాగులూరు బస్టాండ్ సెంటర్‌లోని శ్రీ రామాంజనేయ సెల్ షాప్ సమీపంలో ఇటుకరాయితో మళ్లీ తలపై దాడి చేయడంతో అతడు అక్కడికక్కడే మృతి చెందాడు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టిన పోలీసులు శనివారం ఉదయం 11.50 గంటలకు అడ్డరోడ్డు గంగమ్మ గుడి వద్ద విష్ణువర్ధన్‌ను అదుపులోకి తీసుకుని అరెస్ట్ చేశారు. అనంతరం అతడిని అద్దంకి కోర్టులో హాజరుపరుస్తున్నట్లు సీఐ తెలిపారు. ఈ కార్యక్రమంలో బల్లికురవ ఎస్ఐ నాగరాజు, పోలీసు సిబ్బంది పాల్గొన్నారు.

**కుటుంబ వివాదాలు.. నేరాలకు దారితీస్తున్న అక్రమ సంబంధాలు**

గ్రామీణ ప్రాంతాల్లో అక్రమ సంబంధాల కారణంగా కుటుంబ విభేదాలు, పరువు ప్రతిష్ఠల అంశాలు తీవ్ర ఘర్షణలకు దారితీస్తున్న ఘటనలు ఇటీవల పెరుగుతున్నాయి. భావోద్వేగాలను అదుపులో పెట్టుకోలేక తీసుకునే ఆకస్మిక నిర్ణయాలు ప్రాణనష్టాలకు కారణమవుతున్నాయి. పాత మాగులూరు ఘటన కూడా అలాంటి కోణంలోనే కనిపిస్తోందని పోలీసులు భావిస్తున్నారు. కుటుంబ సమస్యలను చట్టపరంగా, సామాజికంగా పరిష్కరించుకోవాల్సిన పరిస్థితుల్లో వ్యక్తిగత కక్షలు, ఆవేశపూరిత చర్యలు చివరకు హత్యల వంటి తీవ్ర నేరాలకు దారితీస్తున్నాయని ఈ ఘటన మరోసారి స్పష్టం చేసింది.

# ఖైదీల సంక్షేమం పై న్యాయ సేవాధికార సంస్థ ఇంచార్జ్ కార్యదర్శి సి హెచ్ వి రామకృష్ణ సమీక్ష

## – ఖైదీలకు ఉచిత న్యాయ సహాయం అందిస్తామని వెల్లడి



క్రైమ్ రిపోర్టర్ పెన్ పవర్, ఒంగోలు జూలై 18

ఉచిత న్యాయ సహాయం అవసరమైన ఖైదీలకు జిల్లా న్యాయ సేవాధికార సంస్థ ద్వారా అన్ని విధాలా సహాయ సహకారాలు అందించబడతాయని అదనపు సీనియర్ సివిల్ జడ్జి, జిల్లా న్యాయ సేవాధికార సంస్థ జిల్లా కార్యదర్శి సి. హెచ్. వి. రామకృష్ణ తెలిపారు. శనివారం ఒంగోలులోని జిల్లా కారాగారాన్ని సందర్శించి ఖైదీల సంక్షేమం, వారికి అందుతున్న న్యాయ సహాయం, వైద్య సేవలు ఇతర సౌకర్యాలను అదనపు సీనియర్ సివిల్ జడ్జి పరిశీలించారు. ఈ సందర్భంగా ఖైదీలతో నేరుగా మాట్లాడి వారి సమస్యలను అడిగి తెలుసుకున్నారు. అర్హులైన ఖైదీలు ఉచిత న్యాయ సహాయం పొందేందుకు సంకోచించకుండా జిల్లా న్యాయ సేవాధికార సంస్థను సంప్రదించాలని సూచించారు. అదేవిధంగా ఖైదీల హక్కులు, న్యాయ సేవలు, పునరావాస అవకాశాలపై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో ఖైదీల సంక్షేమానికి సంబంధించిన పలు అంశాలపై చర్చించి, వారికి అవసరమైన న్యాయ సేవలు సకాలంలో అందేలా చర్యలు తీసుకోవాలని సంబంధిత అధికారులకు సూచనలు చేశారు. జిల్లా న్యాయ సేవాధికార సంస్థ ద్వారా కారాగార ఖైదీలకు ఉచిత న్యాయ సహాయం, న్యాయ అవగాహన కార్యక్రమాలు నిరంతరం నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఈ సందర్భనలో జైలు సూపరింటెండెంట్ రాజ్ కుమార్ , జైలర్ అప్పలనాయుడు, డిప్యూటీ లీగల్ ఎయిడ్ డిఫెన్స్ కౌన్సిల్ పి. వీరరాఘవులు , జైలు విజిటింగ్ అడ్వకేట్లు శైలజ, మొబీనాబీ, ఎన్. ధనలక్ష్మి , పారా లీగల్ వాలంటీర్లు పి. శ్రీనివాసరావు, వెంకటరావు పాల్గొన్నారు.

# వైసీపీ శ్రేణులపై కేసు నమోదు చేసిన గుడ్లూరు పోలీసులు



**గుడ్లూరు, పెన్ పవర్, జులై 18**

గుడ్లూరు మండలం చేవూరు గ్రామంలో రామాయపట్నం పోర్టు ప్రైవేటీకరణకు వ్యతిరేకంగా చలో రామాయపట్నం ధర్నా కు వైఎస్ఆర్ సీపీ పార్టీ శనివారం పిలుపునిచ్చినది. దీనితో వైసీపీ శ్రేణులు ఈ కార్యక్రమానికి తరలివెళ్లారు. చలో రామాయపట్నం ధర్నాకు అనుమతులు లేవని, స్థానిక పోలీసులు వైసీపీ నాయకులు, శ్రేణులపై కేసులు నమోదు చేశారు. స్థానిక ఎస్సై వి.వెంకట్రావు తెలిపిన వివరాల ప్రకారం వైసీపీకి చెందిన కాకాని గోవర్ధన్ రెడ్డి, బుర్రా మధుసూదన్ యాదవ్, రామిరెడ్డి ప్రతాపరెడ్డి మరియు వైసీపీ కార్యకర్తలు ఎలాంటి అనుమతి తీసుకోకుండా ర్యాలీగా వచ్చి పోర్టు లోపలికి వెళ్లాలని పోలీసు వారితో వాగ్వాదం మరియు తోపులాట చేసి తిరిగి వెళ్లే క్రమంలో నేషనల్ హైవే 16 చేవూరు క్రాస్ రోడ్డు వద్ద నేషనల్ హైవే రోడ్డు మీద ఇరువైపులా కూర్చొని వాహనాలు ఆపి వాహనదారులను మరియు సామాన్య ప్రజలను ఇబ్బందులకు గురిచేశారని అన్నారు. ఇబ్బందులు గురిచేసిన వారిపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేయడమైనదని ఎస్సై వి.వెంకట్రావు తెలియజేశారు.

# ఘనంగా మధుర గాయని జానకకి నృత్య నివాళి





**కల్చరల్ రిపోర్టర్, పెన్ పవర్ ఒంగోలు జూలై 18**

చందూ డ్యాన్స్ అకాడమీ ఆధ్వర్యంలో త్రోవగుంట చందూ,కోవెలకుంట్ల బాలకోటయ్యల పర్యవేక్షణలో చిన్నారులు సుమారు 50 మంది నృత్య కళాకారులు దివంగత మధుర గాయని ఎస్. జానకి పాడిన పాటల్లో కొన్ని పాటలకు అద్భుతంగా నృత్యం చేసి ఘనంగా నీరాజనాలు అర్పించారు. శనివారం సాయంత్రం ఒంగోలులోని స్థానిక సివియన్ రీడింగ్ రూం ఆవరణలో నృత్య నివాళి కార్యక్రమం నిర్వహించారు. అనంతరం జరిగిన సభకు ముఖ్య అతిథిగా హాజరైన నవ్యాంధ్ర రాష్ట్ర రచయిత్రుల సంఘం గౌరవ అధ్యక్షురాలు తేళ్ళ అరుణ మాట్లాడుతూ తన అపూర్వ గాన మాధుర్యంతో భారతీయ సంగీతాకాశంలో చిరస్థాయిగా వెలుగొందిన గానకోకిల, పద్మభూషణ్ అవార్డు గ్రహీత ఎస్. జానకి అకాల మరణం దేశానికి, సంగీత ప్రపంచానికి తీరని లోటని పేర్కొన్నారు. మరో ముఖ్య అతిథిగా పాల్గొన్న నాగభైరవ సాహిత్య పీఠం అధ్యక్షులు డా.నాగభైరవ ఆదినారాయణ"జానకి"గురించిమాట్లాడుతూ ఆరు దశాబ్దాలకు పైగా అనేక భాషల్లో వేలాది గీతాలకు ప్రాణం పోసిన ఆమె స్వరంలో పలికిన ప్రతి గీతం ఒక భావోద్వేగం, ప్రతి రాగం ఒక మధుర జ్ఞాపకమని చెప్పారు. కళామిత్రమండలి(తెలుగు లోగిలి)జాతీయ అధ్యక్షులు డా నూనె అంకమ్మరావు మాట్లాడుతూ తెలుగు సహా అనేక భారతీయ భాషల్లో ఆమె అందించిన అమూల్యమైన సంగీత సంపద తరతరాలకు మార్గదర్శకం గా నిలిచి, భారతీయ సంస్కృతికి చిరస్మరణీయ వారసత్వంగా నిలుస్తుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో శ్రీకృష్ణ దేవరాయ సాహిత్య సాంస్కృతిక సేవా సమితి అధ్యక్షులు కుర్రా ప్రసాద్ బాబు, 'తెలికా'ఉద్యమ ప్రచారకురాలు మారేపల్లి సూర్య కుమారి, నాగినేని నరసింహారావు మెమోరియల్ సంస్థ అధ్యక్షులు మిడసల మల్లికార్జున రావు,ప్రముఖ కవి యు.వి.రత్నం, ధేనువకొండ సుబ్బారావు, కేయస్వీ ప్రసాద్, గుంటూరు సత్యనారాయణ, పరాంకుశం కృష్ణవేణి, రామచంద్రుని లక్ష్మీ, బీరం అరుణ,ఓరుగంటి ప్రసాద్ తదితరులుపాల్గొని జానకి ఆత్మకు శాంతి చేకూర్చాలని భగవంతుని ప్రార్థిస్తూ వారి కుటుంబ సభ్యుల కు ప్రగాఢ సానుభూతిని తెలియజేశారు.ఈ కార్యక్రమం అంతా నృత్య విద్యార్థుల తల్లిదండ్రుల ప్రోత్సాహంతో జరిగింది.

# సోనమ్ వాంగ్చుక్ మద్దతు ర్యాలీ

**కల్చరల్ రిపోర్టర్, పెన్ పవర్ ఒంగోలు జూలై 18**

నీట్ పేపర్ లీక్ నిరసిస్తూ కేంద్ర విద్యా శాఖ మంత్రి రాజీనామా చేయాలని కోరుతూ ఢిల్లీ జంతర్ మంతర్ లో ఆమరణ నిరాహార దీక్ష చేస్తున్న పర్యావరణవేత్త స్థానం వాంగ్ చుక్ మద్దతుగా ఒంగోలులో వివిధ ప్రజా సంఘాల ఆధ్వర్యంలో ర్యాలీ నిర్వహించారు. కన్సర్న్డ్ సిటిజన్స్, ప్రజా సంఘాల సమన్వయంతో శనివారం నిర్వహించిన ఈ కార్యక్రమంలో భాగంగా అంబేద్కర్ విగ్రహం వద్ద నుంచి చర్చి సెంటర్ వరకు కొవ్వొత్తులతో ర్యాలీ జరిపారు. చర్చ్ సెంటర్లో జరిగిన సమావేశంలో మన కాలం ఎడిటర్ కత్తి కళ్యాణ్, దళిత మహాసభ నాయకుడు విజయేంద్ర బహుజన్, కాంగ్రెస్ పార్టీ ప్రతినిధి మన్నం ప్రసన్నరాజు, ఓపిడిఆర్ రాష్ట్ర అధ్యక్షుడు చావాలి సుధాకర్, సిపిఐ ఎంఎల్ రెడ్ స్టార్ ప్రతినిధి సుబ్బారావు, ఎమ్మార్పీఎస్ అధ్యక్షుడు ఆనంద్, ఎరుకల సంఘం ప్రతినిధి పేరం సత్యం న్యాయవాదులు షేక్ కరిముల్లా, నూక తోటి రవికుమార్, ఆడే రామ సుబ్బారావు, కన్సర్న్డ్ సిటిజన్స్ ప్రతినిధి ఎద్దు విజయ్ కుమార్, సంపత్, కే ఎన్ పి ఎస్ ప్రతినిధి మేడికొండ జార్జి, ఐఎల్పీ పార్టీ నాయకుడు దాసరి సుందరం, సుబ్రహ్మణ్యం , పేరయ్య తదితరులు పాల్గొన్నారు.



# కొరిశపాడు మండలంలో ఖరీఫ్ పంటల బీమా నమోదు ప్రారంభం

## రైతులు సద్వినియోగం చేసుకోవాలని ఏ.వో రామ్మోహన్ రెడ్డి సూచన



కొరిశపాడు, ఆర్.సి(పెన్ పవర్) జూలై 18

ఖరీఫ్ 2026 సంవత్సరానికి గాను ప్రధాన మంత్రి ఫసల్ బీమా పథకం కింద పంటల బీమా నమోదుకు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ప్రకటన జారీ చేశాయని కొరిశపాడు మండల వ్యవసాయ అధికారి ఎస్. రామ మోహన్ రెడ్డి తెలిపారు. సాగు చేస్తున్న రైతులు ఉమ్మడి సేవా కేంద్రాల (కామన్ సర్వీస్ సెంటర్లు) ద్వారా లేదా పంట రుణం తీసుకున్న బ్యాంకుల ద్వారా బీమా కోసం పేర్లు నమోదు చేసుకోవచ్చని సూచించారు. ?ఈ పథకాన్ని రెండు విధాలుగా అమలు చేస్తున్నట్లు ఆయన వివరించారు. వాతావరణ ఆధారిత పంటల బీమా కింద అల్ప లేదా అధిక వర్షపాతం, ఉష్ణోగ్రతలు, గాలిలో తేమ శాతం ఆధారంగా రైతులకు పరిహారం అందుతుంది. కొరిశపాడు మండలంలో ఈ విధానం కింద పత్తి పంటను చేర్చారు. రెండో విధానమైన పంట కోత దిగుబడి ఆధారిత బీమా కింద వరి, ఎర్ర మిరప, కంది, మినుము పంటలకు నోటిఫికేషన్ విడుదల చేసినట్లు పేర్కొన్నారు.

**నమోదుకు గడువు తేదీలు, కావాల్సిన పత్రాలు:** పత్తి, ఎర్ర మిరప, కంది, మినుము పంటలకు జూలై 31వ తేదీలోపు, వరి పంటకు ఆగస్టు 15వ తేదీలోపు రైతులు బీమా నమోదు పూర్తి చేసుకోవాలి. దరఖాస్తు చేసేటప్పుడు రైతు సేవా సిబ్బంది జారీ చేసిన పంట సాగు ధ్రువీకరణ పత్రం, వన్-బీ నకలు, ఆధార్ కార్డు, బ్యాంకు ఖాతా పుస్తకం నకలు, ఫోన్ నంబరు తప్పనిసరిగా జతచేయాలని వ్యవసాయ అధికారి రామ్మోహన్ రెడ్డి స్పష్టం చేశారు.

# పోలేపల్లి పాఠశాలను సందర్శించిన ఎంఈఓ

**దొనకొండ జులై 18 పెన్ పవర్ :**

మండలంలోని పోలేపల్లి పాఠశాల నందు శనివారం ఉదయం 11గం"లకు మండల పరిషత్ ప్రాథమిక ఆదర్శ పాఠశాల పోలేపల్లి నందు మండల విద్యాశాఖ అధికారి 1 ఎన్ సాంబశివరావు సందర్శించి రికార్డులను పరిశీలించారు. మరియు అమూల్యమైన సలహాలు, సూచనలు తెలియజేసిన అనంతరం మధ్యాహ్న భోజనం చేసిన తర్వాత వంటలు వండే వారికి కొన్ని సూచనలు తెలియజేసినారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ప్రధానోపాధ్యాయుడు అదిమూలపు ప్రభుదాసు పాఠశాల ఉపాధ్యాయులు శ్రీమతి పి.పావని తదితరులు పాల్గొన్నారు.



# గంజాయి, మత్తు పదార్థాలపై మేదరమెట్లలో భారీ ర్యాలీ..

**మత్తుకు బానిసలై భవిష్యత్తును నాశనం చేసుకోవద్దని సీఐ, ఎస్.ఐ ల హితవు.**





**అద్దంకి, ఆర్.సి(పెన్ పవర్) జూలై 18:**

యువత పెడదోవ పట్టడానికి కారణమవుతున్న గంజాయి, ఇతర మత్తు పదార్థాల వినియోగంపై మేదరమెట్ల పోలీస్ స్టేషన్ పరిధిలో శనివారం విస్తృత అవగాహనా కార్యక్రమం నిర్వహించారు. అద్దంకి రూరల్ సర్కిల్ ఇన్‌స్పెక్టర్ (సీ.ఐ) మల్లికార్జునరావు, మేదరమెట్ల సబ్ ఇన్‌స్పెక్టర్ (ఎస్.ఐ) రమేష్ బాబుల ఆధ్వర్యంలో ఈ కార్యక్రమం జరిగింది. ఇందులో భాగంగా స్థానిక సెయింట్ ఆర్నాల్డ్స్ పాఠశాల విద్యార్థులతో కలిసి పోలీసు అధికారులు మేదరమెట్ల పురవీధుల్లో భారీ ర్యాలీ చేపట్టారు. గంజాయి వాడకానికి వ్యతిరేకంగా ప్లకార్డులు చేతబూని నినాదాలు చేస్తూ ప్రజల్లో చైతన్యం నింపారు.

**మత్తు వీడాలి.. భవితను తీర్చిదిద్దుకోవాలి..:** ఈ ర్యాలీలో సీ.ఐ మల్లికార్జునరావు, ఎస్.ఐ రమేష్ బాబు విద్యార్థులను ఉద్దేశించి మాట్లాడుతూ.. క్షణికావేశంలో మత్తు పదార్థాలకు బానిసలై బంగారు భవిష్యత్తును అంధకారం చేసుకోవద్దని హితవు పలికారు. గంజాయి, ఇతర మత్తు పదార్థాల వల్ల కలిగే తీవ్రమైన శారీరక, మానసిక దుష్ప్రభావాలను విద్యార్థులకు, స్థానికులకు వారు సవివరంగా తెలియజేశారు. యువత చెడు వ్యసనాలకు దూరంగా ఉండి, చదువుపై దృష్టి పెట్టి ఉన్నత శిఖరాలను అధిరోహించాలని ఆకాంక్షించారు.

**కఠిన చర్యలు తప్పవు..:** మేదరమెట్ల పోలీస్ స్టేషన్ పరిధిలో ఎవరైనా గంజాయిని విక్రయించినా, రవాణా చేసినా, సేవించినా చట్టపరంగా కఠిన చర్యలు తీసుకుంటామని పోలీసులు హెచ్చరించారు. తల్లిదండ్రులు సైతం తమ పిల్లల నడవడికపై, వారు ఎవరితో స్నేహం చేస్తున్నారనే విషయాలపై ఎప్పటికప్పుడు దృష్టి సారించాలని సూచించారు. తమ పరిసరాల్లో గంజాయి అమ్మకాలు జరిగినా, అనుమానాస్పద వ్యక్తులు కనిపించినా వెంటనే పోలీసులకు సమాచారం అందించాలని కోరారు. సమాచారం ఇచ్చిన వారి వివరాలను గోప్యంగా ఉంచుతామని భరోసా ఇచ్చారు. ఈ ర్యాలీలో సెయింట్ ఆర్నాల్డ్స్ పాఠశాల ఉపాధ్యాయులు, పెద్ద సంఖ్యలో విద్యార్థులు, పోలీసు సిబ్బంది పాల్గొన్నారు.

# బస్సు ప్రమాదంలో క్షతగాత్రులకు మంత్రి డోలా.. ఎమ్మెల్యే దామచర్ల పరామర్శ



**క్రైమ్ రిపోర్టర్ పెన్ పవర్, ఒంగోలు జూలై 18**

బస్సు ప్రమాదంలో గాయపడి ఒంగోలు రిమ్స్ లో చికిత్స పొందుతున్న క్షతగాత్రులను రాష్ట్ర సాంఘిక సంక్షేమ శాఖ మంత్రి డా. డోలా శ్రీ బాల వీరాంజనేయస్వామి స్థానిక ఎమ్మెల్యే దామచర్ల జనార్ధన్ తో కలిసి శనివారం పరామర్శించారు. శనివారం ఉదయం కొండపి – అనకర్లపూడి సమీపంలో ఆర్టీసీ బస్సు ప్రమాదం జరిగింది. విషయం తెలుసుకున్న మంత్రి బస్సు ప్రమాదం పై కలెక్టర్, ఎస్పీతో ఫోన్ లో మాట్లాడి వివరాలు తెలుసుకున్నారు. గాయపడిన వారికి మెరుగైన చికిత్స అందించాలని, ఘటనపై సమగ్ర విచారణ జరపాలని ఆదేశించారు. అనంతరం ఒంగోలు రిమ్స్ ఆస్పత్రికి వెళ్లి క్షతగాత్రులను పరామర్శించి డాక్టర్లతో మాట్లాడి ఆరోగ్య పరిస్థితి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా మంత్రి డోలా శ్రీ బాల వీరాంజనేయస్వామి మాట్లాడుతూ....బస్సు ప్రమాదం దురదృష్టకరం, అదృష్టవశాత్తు ప్రయాణికులు చిన్న చిన్న గాయాలతో బయటపడ్డారు. గాయపడిన వారికి మెరుగైన వైద్యం అందిస్తున్నాం. ఘటనపై ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు, రవాణా శాఖ మంత్రి మండిపల్లి రాంప్రసాద్ రెడ్డితో మాట్లాడాం. ఇటువంటి ఘటనలు పునరావృతం కాకుండా చర్యలు చేపడతాం. క్షతగాత్రులు పూర్తిగా కోలుకునే వరకు వైద్యం అందిస్తామని మంత్రి డోలా శ్రీ బాల వీరాంజనేయస్వామి తెలిపారు.ఒంగోలు శాసనసభ్యులు దామచర్ల జనార్ధన్ రావు మాట్లాడుతూ క్షతగాత్రులను పరామర్శించి సంఘటన జరిగిన తీరును తెలుసుకోవడం జరిగిందన్నారు. ఒంగోలు జిజిహెచ్ లో వైద్య బృందానికి సూచనలు చేసి మెరుగైన వైద్యాన్ని అందించి, వారికి అవసరమైన

ఎక్స్రే.. స్కానింగ్ వంటి పరీక్షలు నిర్వహించాలని, అన్ని జాగ్రత్తలు తీసుకొని క్షతగాత్రులను అతి త్వరలో కోలుకునే విధంగా చర్యలు తీసుకోవాల్సిందిగా వైద్య బృందాన్ని కోరినట్లు ఆయన చెప్పారు. మంత్రి, ఎమ్మెల్యే వెంట ఒడా చైర్మన్ షేక్ రియాజ్, జిజిహెచ్ ఇంచార్జీ సూపరింటెండెంట్ డాక్టర్ నామినేని కిరణ్ కుమార్, జిజిహెచ్ వైద్య బృందం ఉన్నారు.

# పేకాట స్థావరంపై పోలీసులు దాడి

## 13 మంది అరెస్ట్

**కొనకనమిట్ల పెన్ పవర్ జూలై 18**

కొనకనమిట్ల మండలంలోని నాగిరెడ్డిపల్లి గ్రామ సమీపంలో శనివారం రాత్రి నిర్వహించిన పోలీసుల మెరుపు దాడిలో పేకాట ముఠా బట్టబయలైంది. పేకాట జరుగుతోందనే విశ్వసనీయ సమాచారం మేరకు పొదిలి సీఐ రాజేష్ ఆధ్వర్యంలో సిబ్బందితో పాటు పేకాట స్థావరంపై ఆకస్మికంగా దాడి నిర్వహించారు. ఈ దాడిలో పేకాట ఆడుతున్న 13 మందిని అదుపులోకి తీసుకుని వారి వద్ద నుంచి రూ.2,38,450 నగదు,12 ద్విచక్ర వాహనాలు,12 మొబైల్ ఫోన్లను స్వాధీనం చేసుకున్నట్లు తెలియచేసారు. ఈ ఘటనపై సంబంధిత నిందితులపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టినట్లు పొదిలి సీఐ రాజేష్ తెలిపారు. చట్టవిరుద్ధ కార్యకలాపాలు, పేకాట, జూదం వంటి అసాంఘిక చర్యలపై పోలీసులు ప్రత్యేక నిఘా ఉంచినట్లు సిఐ పేర్కొన్నారు. ఇలాంటి కార్యకలాపాలకు పాల్పడే వారిపై చట్టపరమైన చర్యలు తప్పవని హెచ్చరించారు.



# ప్రతి ఒక్కరూ ఆలోచిస్తే స్వచ్ఛ ఒంగోలు సాధ్యమే - ఎమ్మెల్యే దామచర్ల

**కల్చరల్ రిపోర్టర్, పెన్ పవర్ ఒంగోలు జూలై 18**

ప్రతి ఒక్కరూ మనస్సు పెట్టి ఆలోచిస్తే స్వచ్ఛ ఒంగోలు సాధ్యం అవుతుందని ఒంగోలు శాసనసభ్యులు దామచర్ల జనార్దన్ రావు స్పష్టం చేశారు. స్వర్ణ ఆంధ్రా స్వచ్ఛ ఆంధ్రా లో భాగంగా శనివారం బీకే ఎంక్లేవ్ లో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో ఎమ్మెల్యే దామచర్ల మాట్లాడారు. ఒంగోలు నగరాన్ని అభివృద్ధి చేస్తున్నామని, సుందరీకరణ కూడా జరుగుతుందని, ఇలాంటి సమయంలో స్వచ్ఛ ఒంగోలు కోసం ప్రతి ఒక్కరూ సహకరించాలని కోరారు. స్వచ్ఛమైన వాతావరణం ఉండటంవల్ల ప్రజలు కూడా ఆరోగ్యంగా ఉంటారని తెలిపారు. ప్రతి ఒక్కరు పరిసరాలను పరిశుభ్రంగా ఉంచడం వల్ల సమాజం ఆరోగ్యంగా ఉంటుందన్నారు. ఇప్పటికే ఒంగోలు నగరానికి ఒక రూపం తీసుకువచ్చామని, రోడ్లపై చెత్త వేయకుండా, గేదెలు తిరగకుండా సహకరించాలని సూచించారు. పబ్లిక్ ఎక్కువగా ఉండే అపార్టుమెంట్లు, హాస్పిటల్స్, స్కూల్స్ నుండి ఎంత చెత్త వస్తుందో వివరాలు సేకరిస్తున్నట్లు తెలిపారు. ఇప్పటికే ఒంగోలుకు ఒక రూపం తీసుకువచ్చామని, ప్రజలు రోడ్లపై చెత్త వేయకుండా సహకరించాలని దామచర్ల జనార్దన్ రావు కోరారు. పీడీసీసీ బ్యాంకు పర్సన్ ఇంచార్జి




డాక్టర్ కామేపల్లి సీతారామయ్య మాట్లాడుతూ ఒంగోలు నగరంలో ఎమ్మెల్యే దామచర్ల జనార్దన్ రావు చేస్తున్న అభివృద్ధిని అందరూ కళ్ళారా చూస్తున్నామని, స్వచ్ఛ ఒంగోలు కోసం ప్రతి ఒక్కరు సహకరించాలని కోరారు. ఇళ్ల వద్దకు వచ్చే పారిశుద్ధ్య సిబ్బందికి తడి చెత్త, పొడి చెత్త వేరువేరుగా ఇవ్వాలని సూచించారు. ఒంగోలు నగరం పరిశుభ్రంగా ఉంటే ప్రజలకు జబ్బులు రావని, అందరూ ఆరోగ్యంగా ఉంటారని, ఆసుపత్రి ఖర్చులు కూడా తగ్గుతాయని తెలిపారు. మార్పు



అనేది ప్రతి ఒక్కరు తమ ఇంటి నుండే మొదలు పెట్టాలని డాక్టర్ సీతారామయ్య కోరారు. ఈ సందర్భంగా ఒంగోలు ఎమ్మెల్యే స్వర్ణ ఆంధ్ర స్వచ్ఛ ఆంధ్రా పై ప్రజలతో ప్రతిజ్ఞ చేయించారు. ఈ కార్యక్రమంలో ఒంగోలు నగరపాలక సంస్థ కమిషనర్ వెంకట కృష్ణయ్య, వావ్ ఐటీసీ మేనేజర్ శ్రీనివాస్, బికె ఎంక్లేవ్ అసోసియేషన్ ప్రెసిడెంట్ సరయు, సెక్రటరీ వెంకటేశ్వర్లు, టిడిపి నగర అధ్యక్షుడు బండారు మదన్, నాయకులు, పాల్గొన్నారు.

# అద్దంకిలో ఘనంగా ముద్రగడ పద్మనాభం చిత్రపటానికి నివాళి

**ముద్రగడ పేరిట ప్రతిభావంతులైన కాపు విద్యార్థులకు స్కాలర్‌షిప్‌లు.**



**అద్దంకి, ఆర్.సి(పెన్ పవర్) జూలై 18:**

అద్దంకి వైఎస్ఆర్సీపీ కార్యాలయంలో కాపు ఉద్యమ నేత, వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు ముద్రగడ. పద్మనాభంకి శనివారం పార్టీ శ్రేణులు ఘనంగా నివాళులు అర్పించాయి. ఈ కార్యక్రమానికి అద్దంకి నియోజకవర్గ వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీ సమన్వయకర్త డాక్టర్ చింతలపూడి. అశోక్ కుమార్ ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఆయన ముద్రగడ. పద్మనాభం చిత్రపటానికి పూలమాలలు వేసి, జోహార్లు అర్పించారు. సామాజిక న్యాయం కోసం, బడుగు బలహీన వర్గాల హక్కుల సాధన కోసం ముద్రగడ చేసిన సుదీర్ఘ పోరాటాన్ని ఈ

## కార్యకర్తల కోరికపై హామీ ఇచ్చిన అశోక్ కుమార్

సందర్భంగా అశోక్ కుమార్ కొనియాడారు.

**ప్రతిభావంతులకు చింతలపూడి ట్రస్ట్ ద్వారా స్కాలర్‌షిప్‌లు:**

డాక్టర్. అశోక్ కుమార్ మాట్లాడుతూ.. ఒక కీలక ప్రకటన చేశారు. ముద్రగడ ఆశయాలను ముందు తరాలకు తీసుకువెళ్లే దిశగా.. వచ్చే విద్యా సంవత్సరం నుండి అద్దంకి నియోజకవర్గంలోని కాపు సామాజిక వర్గానికి చెందిన విద్యార్థులలో ఉత్తమ మార్కులు సాధించిన వారికి ముద్రగడ పద్మనాభం గారి పేరు మీద 'చింతలపూడి ట్రస్ట్' ద్వారా స్కాలర్‌షిప్‌లు అందిస్తామని సభాముఖంగా తెలియజేశారు.

**ముద్రగడ స్మృతివనం – సీఎం జగన్ దృష్టికి తీసుకెళ్తాం:** సమావేశంలో పాల్గొన్న ఒక కార్యకర్త మాట్లాడుతూ.. రాబోయే రోజుల్లో వైఎస్ఆర్సీపీ ప్రభుత్వ హయాంలో ముద్రగడ. పద్మనాభం పేరట ఒక 'స్మృతివనం' ఏర్పాటు చేయాలని కోరారు. అలాగే ప్రతి సంవత్సరం ఆ స్మృతివనంలో ఆయన జన్మదిన వేడుకలను ఘనంగా జరుపుకునేలా పార్టీ అధినేతతో మాట్లాడాలని అశోక్ కుమార్ కు సూచించారు. ?కార్యకర్త సూచనపై అశోక్ కుమార్ వెంటనే సానుకూలంగా స్పందించారు. కార్యకర్త ప్రస్తావించిన విషయంతో తాను 100 శాతం ఏకీభవిస్తున్నానని తెలిపారు. 2029లో వైఎస్ఆర్సీపీ ప్రభుత్వం ఏర్పాటు అయిన వెంటనే ఈ విషయాన్ని సీఎం వై.ఎస్. జగన్ మోహన్ రెడ్డి గారి దృష్టికి తీసుకువెళ్లి, ముద్రగడ స్మృతివనం ఏర్పాటుకు ఖచ్చితంగా కృషి చేస్తానని ఆయన గట్టి హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో అద్దంకి నియోజకవర్గ పరిధిలోని వివిధ హోదాలలో ఉన్న వైఎస్ఆర్సీపీ ముఖ్య నాయకులు, మండల కన్వీనర్లు, అనుబంధ సంఘాల నాయకులు, స్థానిక ప్రజాప్రతినిధులు, పార్టీ కార్యకర్తలు, అభిమానులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

# రాగి తీగలు దొంగిలించే వారిపై కఠిన చర్యలు తీసుకోవాలి

**స్టాఫ్ రిపోర్టర్ పెన్ పవర్, ఒంగోలు జూలై 18**

పొలాల్లో విద్యుత్తు ట్రాన్స్ఫార్మర్ లోని రాగి తీగలను దొంగిలించే వారిపై కఠిన చర్యలు తీసుకోవాలని జిల్లా కలెక్టర్ పి.రాజాబాబు చెప్పారు. ఈ రాగిని కొనుగోలు చేసే వారిపైనా కేసులు పెట్టాలని అన్నారు. ఉమ్మడి ప్రకాశం జిల్లాలో ఇటీవల ఈ తరహా దొంగతనాలు ఎక్కువైన నేపథ్యంలో తీసుకోవాల్సిన చర్యల పై ఉమ్మడి ప్రకాశం జిల్లా ఎస్పీ వి.హర్షవర్ధన్ రాజు, ఇరు జిల్లాల విద్యుత్ అధికారులు, పోలీసు ఆఫీసర్లు, సంబంధిత అధికారులతో శనివారం ప్రకాశం భవనంలో ఆయన సమావేశం నిర్వహించారు. రెండు జిల్లాలలోని పరిస్థితిని ఏపీ సిపిడిసిఎల్ ఎస్.ఈ.లు కట్టా వెంకటేశ్వర్లు ( ప్రకాశం), అబ్దుల్ కరీం ( మార్కాపురం) ఈ సందర్భంగా వివరించారు. రాగి తీగలు దొంగతనానికి గురికావడం వలన ట్రాన్స్ఫార్మర్ మరమ్మతులు, పంట కోల్పోవడం వంటి రూపాలలో రైతులు నష్టపోతున్నట్లు వారు చెప్పారు. దీనిపై కలెక్టర్ స్పందిస్తూ రాగి తీగలను దొంగిలించే వారితో పాటు, వాటిని కొనుగోలు చేసే వారిని కూడా ఈ నేరంలో భాగస్వాములను చేయాలని చెప్పారు. రాగి వ్యాపారం, ఇతర స్క్రాప్ వ్యాపారం చేసేవారు ప్రత్యేకంగా రాగి విక్రయము, కొనుగోలుకు సంబంధించిన లావాదేవీలను తెలిపేలా రిజిస్టర్లు నిర్వహించాలని కలెక్టర్ స్పష్టం చేశారు. ఈ దిశగా చర్యలు తీసుకునేలా వాణిజ్య పన్నుల అధికారులతో విస్తృత సోదాలు చేయిస్తానన్నారు. పొలాల్లో ఇలాంటి దొంగతనాలను అరికట్టేందుకు విద్యుత్ అంతరాయం వస్తే తక్షణమే ట్రాన్స్ఫార్మర్ ను పరిశీలించేలా స్థానిక పంచాయతీ కార్యదర్శి, విద్యుత్తు లైన్ మన్, నలుగురు రైతులు, ఒక కానిస్టేబుల్ తో ప్రత్యేకంగా కమిటీలను ఏర్పాటు చేస్తామన్నారు. ఎవరైనా ట్రాన్స్ఫార్మర్



చుట్టుపక్కల సంచరిస్తే ఈ కమిటీ సభ్యుల మొబైల్ ఫోన్లకు మెసేజ్ రావడంతో పాటు ట్రాన్స్ఫార్మర్ వద్ద సోలార్ లైటు, సిసి కెమెరా ఏర్పాటుకు అవకాశాలను పరిశీలించాలని విద్యుత్ శాఖ అధికారులకు కలెక్టర్ చెప్పారు. దొంగతనాలు జరిగేందుకు ఎక్కువ అవకాశం ఉన్న ట్రాన్స్ఫార్మర్ లను కూడా గుర్తించాలన్నారు. ఎస్పీ మాట్లాడుతూ రాగి తీగల దొంగతనం కేసులలో నిందితులకు కౌన్సిలింగ్ ఇస్తామని, దోషులకు కఠిన శిక్ష పడేలా చర్యలు తీసుకుంటామని చెప్పారు. అవసరమైతే పీడీ కేసులు కూడా పెట్టే విషయాన్ని పరిశీలిస్తున్నామన్నారు. స్క్రాప్ వ్యాపారులకు కూడా రాగి తీగల కొనుగోలు విషయాలలో అవగాహన కల్పిస్తామని, ఆధారాలు లేకుండా వీరి వద్ద రాగి లభ్యమైతే కేసులు పెడతామని చెప్పారు. ఈ సమావేశంలో డిఆర్ఓ పివి రమణ, జిల్లా వ్యవసాయ అధికారి శ్రీనివాసరావు, జడ్పీ సీఈవో చిరంజీవి, డిపిఓ అనుపమ, డీఎస్పీలు, సిఐలు, ఎస్ఐలు, ఇతర అధికారులు పాల్గొన్నారు.

# రామాయపట్నం పోర్టు ప్రైవేటీకరణను అడ్డుకుంటాం

**-ఇది అంతం కాదు.. ప్రజా ఉద్యమానికి ఆరంభం మాత్రమే -మాజీ మంత్రి కాకాణి గోవర్ధన్‌రెడ్డి**

**-చలో రామాయపట్నం'లో వైసీపీ నాయకుల నిరసన -పోలీసుల అడ్డుకోవడంతో ఉద్రిక్తత**





**కందుకూరు పెన్ పవర్, జూలై 18**

రామాయపట్నం పోర్టు ప్రైవేటీకరణ నిర్ణయాన్ని వ్యతిరేకిస్తూ వైఎస్సార్‌సీపీ ఆధ్వర్యంలో నిర్వహించిన 'చలో రామాయపట్నం' కార్యక్రమం శనివారం తీవ్ర నిరసనల మధ్య జరిగింది. పోర్టు పరిరక్షణ కోసం చేపట్టిన ఈ కార్యక్రమంలో మాజీ మంత్రి కాకాణి గోవర్ధన్‌రెడ్డి, కందుకూరు వైకాపా ఇంచార్జ్ బుర్రా మధుసూదన్ యాదవ్ కావలి మాజీ ఎమ్మెల్యే రామిరెడ్డి ప్రతాప్‌కుమార్‌రెడ్డి, తదితర నాయకులు, కార్యకర్తలు, రైతులు, మత్స్యకారులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు. కార్లు, ద్విచక్ర వాహనాలతో భారీ ర్యాలీగా రామాయపట్నం పోర్టు వైపు వెళ్లిన నాయకులు, కార్యకర్తలు పోర్టు వద్దకు చేరుకునేందుకు ప్రయత్నించగా పోలీసులు అడ్డుకున్నారు. దీంతో కొంతసేపు ఉద్రిక్త పరిస్థితులు నెలకొన్నాయి. పోర్టు ముట్టడికి ప్రయత్నించిన పలువురు నాయకులను పోలీసులు అదుపులోకి తీసుకుని అక్కడి నుంచి తరలించారు.

**ప్రజల ఆస్తిని ప్రైవేటుపరం చేయడాన్ని సహించం...:** ఈ సందర్భంగా మాజీ మంత్రి కాకాణి గోవర్ధన్‌రెడ్డి మీడియాతో మాట్లాడుతూ రామాయపట్నం పోర్టు ప్రజల ఆస్తి అని, దాని ప్రైవేటీకరణను ఎట్టి పరిస్థితుల్లోనూ అంగీకరించబోమని స్పష్టం చేశారు. ప్రజల కోసం నిర్మించిన పోర్టును కొందరి ప్రయోజనాల కోసం ప్రైవేటు సంస్థలకు అప్పగించే ప్రయత్నాలను అడ్డుకుంటామని అన్నారు. ఇది అంతం కాదు.. ప్రజల హక్కుల కోసం ప్రారంభమైన ఉద్యమానికి ఇది ఆరంభం మాత్రమే అని ఆయన పేర్కొన్నారు.

**రైతులు, మత్స్యకారుల హక్కుల కోసం పోరాటం...:** రామాయపట్నం పోర్టు కోసం రైతులు భూములు ఇచ్చారని, మత్స్యకారులు తమ జీవనోపాధిని త్యాగం చేశారని కాకాణి తెలిపారు. వారి త్యాగాలతో ఏర్పడిన పోర్టును ప్రైవేటు చేతుల్లో పెట్టడం అన్యాయమన్నారు. పోర్టు ఆధారంగా స్థానిక యువతకు వచ్చే ఉద్యోగ అవకాశాలను దెబ్బతీసే నిర్ణయాలను ప్రభుత్వం వెనక్కి తీసుకోవాలని డిమాండ్ చేశారు. భూములు కోల్పోయిన ప్రతి కుటుంబానికి న్యాయం జరిగే వరకు పోరాటం కొనసాగుతుందని తెలిపారు.

**రూ.5 వేల కోట్ల విలువైన పోర్టును కారుచౌకగా అప్పగించే కుట్రలి....: బుర్రా..:** ప్రజల సొమ్ముతో నిర్మించిన రామాయపట్నం పోర్టును కారుచౌకగా ప్రైవేటు సంస్థలకు అప్పగించే ప్రయత్నం జరుగుతోందని కందుకూరు నియోజకవర్గం వైకాపా ఇన్చార్జి బుర్రా మధుసూదన్ యాదవ్ ఆరోపించారు. నిర్మాణానికి సంబంధించిన ఖర్చులు ప్రభుత్వమే భరించి, నిర్వహణ హక్కులను మాత్రం ప్రైవేటుకు ఇవ్వడం సరికాదన్నారు. ప్రభుత్వ రంగ ఆస్తులను అమ్మే విధానాలను ప్రజలు సహించరని, పోర్టు ప్రభుత్వ ఆధీనంలోనే కొనసాగాలని డిమాండ్ చేశారు.

**న్యాయపోరాటంతో పాటు ప్రజా ఉద్యమం...:** పోర్టు ప్రైవేటీకరణ నిర్ణయాన్ని వెనక్కి తీసుకునే వరకు వైఎస్సార్‌సీపీ పోరాటం ఆగదని స్పష్టం చేశారు. అవసరమైతే రాష్ట్రవ్యాప్తంగా ప్రజలను కలుపుకుని ఉద్యమాన్ని మరింత ఉధృతం చేస్తామని మధుసూదన్ యాదవ్ తెలిపారు. ఈ కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ నాయకులు, కార్యకర్తలు, రైతులు, మత్స్యకారులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు. రామాయపట్నం పోర్టు పరిరక్షణ కోసం ప్రజా ఉద్యమాన్ని కొనసాగిస్తామని నాయకులు ప్రకటించారు.

# నేడు రాళ్లవాగుపై బ్రిడ్జి నిర్మాణానికి శంకుస్థాపన చేయనున్న ఎమ్మెల్యే

**గుడ్లూరు, పెన్ పవర్, జులై 18**



చిమిడితపాడు, పోట్లూరు మధ్య ఉన్న రాళ్ళవాగుపై బ్రిడ్జీ నిర్మాణానికి స్థానిక ఎమ్మెల్యే ఇంటూరి నాగేశ్వరరావు నేడు అనగా 19వ తేదీ ఆదివారం ఉదయం 10 గంటలకు శంఖుస్థాపన చేయనున్నారని మండల పార్టీ అధ్యక్షులు జనిగర్ల నాగరాజు శనివారం తెలిపారు. వర్షం వస్తే ఈ రాళ్ళవాగుపై నీరు ప్రవహించడం వలన గుడ్లూరు నుండి నేషనల్ హైవే 16 ను కలిపే మార్గం పూర్తిగా రాకపోకలు నిలిచిపోయేవి. ఎన్నో ఏళ్ల నుండి ప్రజలు దీనివలన తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. ఈ సమస్యను ఎమ్మెల్యే ఇంటూరి దృష్టికి తీసుకువెళ్లడంతో, స్పందించిన ఎమ్మెల్యే 2కోట్ల రూపాయలను మంజూరు చేయించి, నేడు తన చేతుల మీదుగా శంకుస్థాపన చేయనున్నారు. కావున ఈ కార్యక్రమానికి కూటమి పార్టీల నేతలు, కార్యకర్తలు, అభిమానులు, ప్రజలు ప్రతి ఒక్కరూ పాల్గొని విజయవంతం చేయాలని మండల తెలుగుదేశం పార్టీ సభ్యులు కోరారు.

# నేడు సి ఎస్ పురంలో ఉచిత చర్మ వైద్య శిబిరం

**సి.ఎస్.పురం,పెన్ పవర్ జూలై 18**

మండల కేంద్రంలోని సి.ఎస్.పురం బెల్లంకొండ పాఠశాల ఆవరణలో ఎస్ఎంఆర్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో శనివారం ఉచిత చర్మ వైద్య శిబిరాన్ని నిర్వహిస్తున్నట్లు ప్రముఖ వైద్య నిపుణులు డాక్టర్ ఏడుకొండలు తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మండల ప్రజలకు నాణ్యమైన వైద్య సేవలను ఉచితంగా అందించాలనే ఉద్దేశంతో ఈ శిబిరాన్ని ఏర్పాటు చేసినట్లు తెలిపారు శిబిరంలో చర్మ సంబంధిత అన్ని రకాల వ్యాధులకు పరీక్షలు నిర్వహించనున్నట్లు తెలిపారు. మొటిమలు, అలర్జీలు, ఎక్జిమా, సోరియాసిస్, గజ్జి, తామర, చర్మంపై మచ్చలు, నల్లమచ్చలు, జుట్టు రాలడం, చుండ్రు, గోర్లు సంబంధిత సమస్యలకు నిపుణులచే ఉచితంగా పరీక్షలు నిర్వహించి, అవసరమైన వారికి వైద్య సలహాలతో పాటు ఉచితంగా మందులు అందజేయనున్నట్లు వెల్లడించారు.ఉదయం 10 గంటల నుంచి సాయంత్రం 4 గంటల వరకు శిబిరం కొనసాగుతుందని తెలిపారు. మండలంలోని ప్రజలు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకొని తమ చర్మ సంబంధిత ఆరోగ్య సమస్యలకు నిపుణుల సలహాలు పొందాలని కోరారు. అధిక సంఖ్యలో ప్రజలు హాజరై ఉచిత వైద్య సేవలను సద్వినియోగం చేసుకొని విజయవంతం చేయాలని కోరారు.

# 'సూపర్ నారీ'తో పొదుపు వివరాలు తెలుసుకోవచ్చు.

**వెలుగు కార్యాలయం నుంచి బస్టాండ్ సెంటర్ వరకు అవగాహన ర్యాలీ.**





**అద్దంకి, ఆర్.సి(పెన్ పవర్) జూలై 18**

"మన డబ్బులు – మన లెక్కలు" కార్యక్రమంలో భాగంగా జే. పంగులూరు మండలంలోని అన్ని గ్రామ సంఘాలలో శనివారం అవగాహన ర్యాలీలు నిర్వహించారు. ఇందులో భాగంగా స్థానిక వెలుగు కార్యాలయం నుండి బస్టాండ్ సెంటర్ వరకు మహిళలు నినాదాలు చేస్తూ భారీ ర్యాలీ చేపట్టారు. అనంతరం బస్టాండ్ సెంటర్ వద్ద మానవహారంగా ఏర్పడ్డారు. ఈ సందర్భంగా ఏ.పి.ఎం మాట్లాడుతూ.. ప్రతి పొదుపు సంఘం సభ్యురాలు 'సూపర్ నారీ' అప్లికేషన్‌ను ఫోన్లలో నిక్షిప్తం (డౌన్లోడ్) చేసుకోవాలని సూచించారు. దీని ద్వారా సంఘంలోని పొదుపు మొత్తాలు, తీసుకున్న రుణాల వివరాలు ఎప్పటికప్పుడు తెలుసుకోవచ్చని వివరించారు. జూలై 31 వరకు మండలంలోని అన్ని సంఘాల సభ్యులచే దీన్ని వాడుకలోకి తీసుకువచ్చేలా చూడాలని క్షేత్రస్థాయి సహాయకులకు, డిజిటల్ సహాయకులకు దిశానిర్దేశం చేశారు. ఈ కార్యక్రమంలో ఏపిఎం, సంఘ నిర్వాహకులు, క్షేత్రస్థాయి సహాయకులు, మహిళా సంఘాల ప్రతినిధులు పాల్గొన్నారు.

On behalf of Printed, Published and owned by GANTYADA APPA RAO, Published at D.NO: 49-1-35, Miriyalapalem Center, Railway Station Road, Ongole, Prakasam District -523001,Andhrapradesh. Printed by GANTYADA APPARAO, Printed At SRI SAI GANGA PRINTERS AND PUBLICATIONS, D.NO: 49-1-35, Miriyalapalem Center, Railway Station Road, Ongole, Prakasam District -523001,Andhrapradesh. Editor: G.APPARAO, (Responsible for selection of news under the PRB Act ) RNI : APTEL/2014/58046 e-mail:penpower9@gmail.com